అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 03-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 61 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50



గ్లోబల్ లీడర్లతో భారత్ కంపెనీలు పోటీ పడాలి

కార్పొరేట్లు పరిశోధనల్లో పెట్టుబడి పెట్టాలి
సృజనాత్మకత, ఆవిష్కరణలే భారత్ పెట్టుబడి
దానిలో ఐఐటీ హైదరాబాద్ అగ్రగామి
కృత్రిమ మేధ నూతన శకానికి నూతన విప్లవం
'ఏక్ పేడ్ మా కే నామ్' పేరిట మొక్కను నాటిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ 5లో..



నా కుమార్తెను పోకిరీలు వేధించారు

కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే
స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు

చండీగఢ్ : మహారాష్ట్రలో శాంతిభద్రతలపై కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే ఆందోళన వ్యక్తం చేశారు. జల్‌గావ్ జిల్లా ముక్తాయ్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తన కుమార్తెను కొందరు యువకులు వేధించారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన వెల్లడించారు."మహాశివరాత్రి సందర్భంగా మా ప్రాంతంలో ఏటా సంత్ ముక్తాయ్ యాత్ర నిర్వహిస్తారు. ఇటీవల నిర్వహించిన ఈ యాత్రకు స్నేహితులతో ...13లో



హర్యానాలో ఘోరం

సూట్‌కేస్‌లో యువతి మృతదేహం
కాంగ్రెస్ మహిళా కార్యకర్తగా గుర్తింపు
రాహుల్ భారత్ జోడో యాత్రలో పాల్గొన్న సదరు యువతి 13లో

ఈ పాపం కేసీఆర్‌దే

ఎస్ఎల్‌బీసీని పదేండ్లు పడావు పెట్టడంతోనే ప్రమాదం

- గత ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం
- సైంధవుడిలా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- పాలమూరు రుణం తీర్చుకుంటా
- ఉమ్మడి జిల్లాలో 25 లక్షల ఎకరాలకు నీరు పారిస్తా
- వనపర్తి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



నవతెలంగాణ-వనపర్తి

ఎస్ఎల్‌బీసీని పదేండ్ల పాటు పడావు పెట్టడంతోనే కుప్పకూలిందనీ, ఈ పాపం కేసీఆర్‌ది కాదా అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆంధ్రావాళ్లు రాయలసీమకు నీళ్లు తరలించుకు పోతుంటే గుడ్లప్పగించుకుంటూ కేసీఆర్ చూడలేదా అని విమర్శించారు. రోజమ్మ ఇంటికి పోయి రొయ్యల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ అనలేదా.. అని గుర్తు చేశారు. కృష్ణా జలాలను ఆంధ్రాకు తరలించుకు పోతున్నారంటే అది కేసీఆర్ దుర్మార్గం వల్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. 811 టీఎంసీలుండే కృష్ణా జలాల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగేలా 500.12 టీఎంసీలు తీసుకెళ్లేలా సంతకం పెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మెన్ చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వనపర్తి జీజీహెచ్ భవన నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణం, జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, జూనియర్ కాలేజీ భవనాలు, వనపర్తి ఐటీ టవర్, శ్రీ రంగాపురం దేవాలయం పనులు, పెబ్బేరు 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం, రాజానగరం, పెద్దమందడి బీటీ రోడ్డు నిర్మాణ పనులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు.అంతకుముందు వనపర్తి జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ...13లో

బాధిత కుటుంబాలను

ఆదుకుంటాం

సొరంగ నిర్మాణం మానవ అద్భుతం

అవసరమైతే పూర్తిచేయడానికి రోబోలనూ ఉపయోగిస్తాం
ఎస్ఎల్‌బీసీ ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

"సొరంగం ప్రమాదంలో కార్మికులు చిక్కుకొని తొమ్మిది రోజులు అయ్యింది.. కాలం గడిచిన కొద్దీ బాధిత కుటుంబ సభ్యుల్లో ఆందోళన పెరిగిపోతోంది. ఆ కుటుంబాల వారిని అన్ని విధాలా ఆదుకుంటాం. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు సాగు, తాగు నీరు అందించే ఒక మహా అద్భుతాన్ని ఇక్కడ నిర్మిస్తున్నాం. ఇలాంటి కార్యక్రమంలో ప్రమాదాలు జరగడాన్ని చింతిస్తున్నాం" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శ్రీశైలం దోమలపెంట వద్ద సొరంగంలో జరిగిన ప్రమాద ఘటనా స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా అధికారులు, కార్మికులతో సమీక్ష చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కార్మికుల రక్షణకు ఆటంకంగా మారిందన్నారు. ఊటికి వస్తున్న నీళ్ల వల్ల సహాయ చర్యలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. ముఖ్యంగా ప్రమాద స్థలంలో



భీకర పరిస్థితులు నెలకొన్నందున ఇక నుంచి రోబోలను సైతం వాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. 4000 క్యూసెక్కులు, 30 టీఎంసీల నీటిని వాడుకోవడానికి 2005-06లో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మూలకు పడేసిందన్నారు. పనులు చేయకపోగా కనీసం విద్యుత్ బిల్లులు కూడా ఇవ్వకుండా కాంట్రాక్టర్లను ఇబ్బందులు ...13లో

ట్రంప్ రాకతో..అమెరికాలో

అదానీ పెట్టుబడులకు బాట

ఎఫ్‌సీపీఏకు అమెరికా అధ్యక్షుడి బ్రేకులు

యూఎస్‌లో మళ్లీ భారీ మొత్తంలో ఇన్వెస్ట్ చేసే యోచన

న్యూఢిల్లీ : కొన్ని నెలల క్రితం హిండెన్‌బర్గ్ సంచలన నివేదికతో అదానీ గ్రూపు నేల చూపులు చూసింది. ప్రపంచ మార్కెట్‌లో అదానీ సామ్రాజ్యం వేల కోట్ల రూపాయల నష్టాన్ని ఎదుర్కొన్నది. అమెరికా న్యాయశాఖ నోటీసులు, తనపై నమోదైన క్రిమినల్ అభియోగాలతో షేర్‌విలువ దారుణంగా పడిపోయింది. అమెరికాతో సహా పలు దేశాలలో పెట్టుబడులపై దీని ప్రభావం తీవ్రంగా పడింది. భారత్‌లో మోడీ ప్రభుత్వం ఉన్నా కూడా ఏమీ చేయలేని పరిస్థితి అదానీకి ఏర్పడింది. ఇప్పుడు అమెరికాలో ట్రంప్ రాకతో అక్కడ భారీ పెట్టుబడులు పెట్టేందుకు అదానీ గ్రూపునకు మార్గం సుగమమైంది. భారత ప్రధాని మోడీని స్నేహితుడిగా భావించే డోనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన రాక యూఎస్‌లో అదానీ గ్రూపు పెట్టుబడులకు తిరిగి మార్గం సుగమం అవుతోంది. ఇటీవల విదేశీ అవినీతి పద్ధతుల చట్టం(ఎఫ్‌సీపీఏ) అమలుకు ట్రంప్ బ్రేకులు వేశారు. దీనిపై గత నెలలోనే నిర్ణయం తీసుకున్నారు. దీంతో అదానీ గ్రూపులో భారీగా ఆశలు చిగురించాయని విశ్లేషకులు అంటున్నారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం



తర్వాత అదానీ గ్రూపు యూఎస్‌లో మౌలికసదుపాయాల కోసం భారీగా పెట్టుబడులు పెట్టే ప్రణాళికలకు అవకాశాలున్నాయని పలు నివేదికలు వివరిస్తున్నాయి.

ముడుపుల వ్యవహారంలో అదానీ, ఉన్నతాధికారులు కొందరు ప్రస్తుతం క్రిమినల్ అభియోగాలను ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ.. యూఎస్‌లోని పలు రంగాలలో ప్రాజెక్టుల కోసం పెట్టుబడులు పెట్టేందుకు అదానీ గ్రూపుమళ్లీ పరిశీలనను జరుపుతున్నదని తెలుస్తోంది. ఇందులో న్యూక్లియర్‌పవర్ అండ్ యుటిలిటీస్, ఈస్ట్ కోస్ట్ పోర్ట్ వంటి ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టే అవకాశమున్నదని ...13లో

జనం అడుక్కోవడానికి

అలవాటుపడ్డారు

బీజేపీ నేత వివాదాస్పద వ్యాఖ్యలు

మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఆగ్రహం

భోపాల్ : బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, మధ్యప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రజలు చేయి చాచేందుకు అలవాటు పడిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాజగఢ్ జిల్లాలో వీరాంగన రాణి అవంతీబాయ్ లోధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై ప్రసంగించిన సందర్భంగా ప్రహ్లాద్ పటేల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రభుత్వం నుంచి అడుక్కుని తీసుకునేందుకు ప్రజలు అలవాటుపడ్డారు. నేతలు వచ్చినప్పుడల్లా వారికి గంప నిండుగా అర్జీలు ఇస్తుంటారు. స్టేజీలపైన నేతలకు పూలమాలలు వేసి చేతుల్లో అర్జీలు పెడుతుంటారు. ఇది మంచి అలవాటు కాదు. ఇలా అర్జించే బదులు ఇచ్చే అలవా టును పెంపొందించుకోవాలి. దాంతో సమాజంలో సంస్కారం పెరగడంతోపాటు జీవితం ఆనందమయం అవుతుంది" అన్నారు. చేయిచాచే వారివల్ల సమాజం బలహీనమవుతుందనీ, ఉచితాలకు ఆకర్షితులు కావడం ధీర మహిళల లక్షణం కాదని ప్రహ్లాద్ పటేల్ చెప్పారు. అమరులను గౌరవించుకోవడం అంటే వారు చూపిన మార్గంలో వారి ఆదర్శాలకు అనుగుణంగా జీవించడమేనని అన్నారు. నిజమైన దేశభక్తులు చేయిచాచి అర్జించినట్టు మనం ఎక్కడైనా విన్నామా..? అని ప్రశ్నించారు. నర్మదా పరిక్రమ యాత్రికుడిగా తాను దానాలు స్వీకరించాననీ, కానీ అవి నా కోసం కాదనీ, నాకు ఏదైనా ఇచ్చినట్టు చెప్పే వ్యక్తి ఎవరూ లేరని అన్నారు.

బీజేపీ అహంకారం పెరిగింది : కాంగ్రెస్

ప్రహ్లాద్ పటేల్ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జీతూ పట్వారీ... 13లో



డోజ్ ఎఫెక్ట్..మస్క్‌కు షాక్

టెస్లా కార్యాలయాల ఎదుట నిరసనలు

- టెస్లా కొనుగోళ్లు అడ్డుకోవాలని ఆందోళనకారుల పిలుపు
- ఇంగ్లండ్, స్పెయిన్, పోర్చుగల్‌లోనూ నిరసనలకు నిర్ణయం

వాషింగ్టన్ : ప్రపంచంలో అత్యంత సంపన్నుడు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు మద్దతుదారుడు అయిన ఎలన్ మస్క్‌కి షాక్ తగిలింది. ఆయనకు వ్యతిరేకంగా అమెరికాలోని టెస్లా కార్యాలయాల ఎదుట ఆందోళనకారులు ఆదివారం భారీ నిరసన చేపట్టారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు అమెరికా అధ్యక్షులు ట్రంప్ నియమించిన డోజ్‌ని ఆందోళనకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉత్తరఅమెరికా, ఐరోపాలో ...3లో

42 పైసలు కాదు...చారణానే

రూ.21 వేల కోట్లలో వచ్చింది రూ.5 వేల కోట్లే... కేంద్ర గ్రాంట్లు, ఆర్థిక సాయాల్లో రాష్ట్రానికి దక్కింది ఇదే

'కేంద్ర ప్రభుత్వానికి మనం పన్నుల రూపంలో రూపాయి పంపితే...అక్కణ్నుంచి తిరిగి మనకు 42 పైసలే వస్తున్నాయి...' ఇటీవల ఒక బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ వ్యక్తం చేసిన ఆవేదన ఇది. అయితే వాస్తవ లెక్కలు మాత్రం సీఎం చెప్పిన 42 పైసలు కూడా కాదు.. రాష్ట్రానికి వచ్చింది చారణానే (పావలా) అంటే 25 పైసలే అని తేల్చిచెబుతున్నాయి. అదే బీహార్‌కైతే రూపాయికి 7.6 రూపాయలు, ఉత్తర ప్రదేశ్‌కు అయితే రూపాయికి 3 రూపాయలు ఇస్తున్నారంటూ సీఎం పలుమార్లు ప్రస్తావించారు. దీన్నిబట్టే మోడీ సర్కార్ దక్షిణాది పట్ల చూపుతున్న వివక్ష ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 'కర్నాటక మీద కక్షతో కేంద్రం మనకు పన్నుల వాటాలో 13 పైసలే ఇస్తోంది. అందుకే మోడీ సర్కార్ అనేది 13 పైసల ప్రభుత్వం...' పొరుగు రాష్ట్రం కర్నాటకలో కేంద్రంపై పేలే సెటైర్ ఇది. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన అనేక ఇతర విషయాలతోపాటు ప్రధానంగా నిధుల్లో కోతలు విధిస్తున్న కేంద్ర ప్రభుత్వం...తాజాగా మరోసారి తెలంగాణకు రిక్తహస్తాన్నే ఇచ్చింది. జనవరి నాటికి కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాకు సంబంధించిన లెక్కలు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.



వీటిపై గంపెడాశలు పెట్టుకున్న ప్రభుత్వం
సీఎం వినతులను పెడచెవిన పెట్టిన కేంద్రం

బి.వి.యన్.పద్మరాజు

గత పదేండ్ల నుంచి బీజేపీ పాలిత రాష్ట్రాలకు నిధుల్లో పెద్ద పీటేస్తూ వస్తున్న మోడీ సర్కార్... మన రాష్ట్రానికి మాత్రం కోతలు పెడుతోన్న సంగతి తెలిసిందే. ఇదే విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం పలుమార్లు ప్రస్తావించారు. ఇప్పుడు సీఎం రేవంత్ కూడా అదే విషయమై ఆందోళన వ్యక్తం చేస్తుండటం గమనార్హం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్లు, ఇతర ఆర్థిక సాయాల రూపంలో రాష్ట్రానికి మొత్తం రూ.21,636 కోట్లు వస్తాయని రేవంత్ సర్కార్ అంచనాలేసుకుంది. కానీ జనవరి చివరి నాటికి ఇందులో కేవలం రూ.5,176 కోట్లే వచ్చాయి. అంటే వేసుకున్న అంచనాల్లో మనకు దక్కింది పావలా మాత్రమే(నాలుగోవంతు) నన్నమాట. అందువల్ల కర్నాటక మాదిరిగానే మనం మోడీ సర్కార్‌ను 'పావలా ప్రభుత్వం' అని పిలవాలని ఎద్దేవా చేస్తున్నారు ఆర్థిక నిపుణులు.

రాష్ట్రంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.8 కోట్ల మేర పేరుకుపోయాయంటూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడించారు. మరోవైపు గత బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.7 లక్షల కోట్లు, దాన్ని తీర్చేందుకు ప్రతీనెలా కిస్తీల రూపంలో రూ.6,500 కోట్లు, ఆ చొప్పున ఏడాదికి రూ.75 వేల కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోంది. ఇది ఖజానాపై తీవ్ర భారాన్ని మోపుతోంది. ఇదే సమయంలో ఆరు గ్యారెంటీల అమలు అనేది సర్కారుకు మెడ మీద కత్తిలా వేలాడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి రూ.21 వేల కోట్లపై రాష్ట్ర ప్రభుత్వం గంపెడాశలు పెట్టుకుంది. రాష్ట్రానికి రావాల్సిన ఆర్థిక సాయాలు, గ్రాంట్లను తక్షణమే విడుదల చేసి ఆదుకోవాలంటూ సీఎం రేవంత్ ఇటీవల తన ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీకి మరోసారి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఈనెలతో ముగుస్తున్న నేపథ్యంలో జనవరి నాటికి వచ్చిన ...13లో

2024-25లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన గ్రాంట్లు.. సాయాలిలా...(రూ.కోట్లలో)

ఏప్రిల్ (2024)	0
మే	0
జూన్	0
జులై	1,880.18
ఆగస్టు	566.85
సెప్టెంబరు	0
అక్టోబరు	1,452.71
నవంబరు	629.53
డిసెంబరు	242.17
జనవరి (2025)	405.28
మొత్తం	5,176.72



గెలుపెవరిదో?

నేడు ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల
ఓట్ల లెక్కింపు ప్రారంభం

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి, కరీంనగర్

రాష్ట్రంలోని ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడు ప్రారంభం కానుంది. లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కాగా, ఫిబ్రవరి 27న వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఐదు రోజులుగా ఎదురు చూస్తున్న ఫలితాలు నేడు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నాయి. ఇదిలా ఉంటే గెలుపుపై అభ్యర్థులు ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మొత్తం ఓటర్లు 25,797 ఉండగా ...3లో



సీఎంను కలిసిన పౌల్ట్రీ అసోసియేషన్స్ ప్రతినిధులు

హైదరాబాద్ : పౌల్ట్రీ అసోసియేషన్స్ ప్రతినిధులు డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. పౌల్ట్రీ ఉత్పత్తులైన చికెన్, కోడిగుడ్ల వల్ల కలిగే మంచి గురించి, వాటిని తీసుకోవటంలో ప్రజలకు ఉన్న భయాన్ని పారదోలి నమ్మకాన్ని కల్పించేలా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం కల్పించటానికి సీఎం సహాయాన్ని వారు కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారన్నారు. తక్షణ ఉత్తర్వులకు ఆదేశించారని చెప్పారు. ఈ విషయంలో తక్షణమే స్పందించిన సీఎంకు తాము రుణపడి ఉంటామని పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. సీఎంను కలిసినవారిలో తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ (టీపీబీఏ) నుంచి జి.రమేశ్ బాబు, డి.రాంరెడ్డి, కె.జి ఆనంద్, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ (టీపీఎఫ్) నుంచి కె.మోహన్‌రెడ్డి, వి. భాస్కర్‌రావు, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) నుంచి జి.చంద్రశేఖర్‌రెడ్డి, పౌల్ట్రీ ఇండియా నుంచి ఉదయ్‌సింగ్ బయాస్, సంజీవ్ చింత్వార్‌లు ఉన్నారు.

అయోమయంలో మిర్చి రైతులు

కాలయాపనతో సాయంపై దాటవేత!

- ధరలు పెరుగుతాయనే అంచనాతో వేచిచూసే ధోరణి
- మార్కెట్ ఇంటర్‌వెన్షన్‌పై విడుదల కాని ఉత్తర్వులు
- ఆచరణలోకి రాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలు





గుంటూరు : మిర్చికి ఐదేండ్లుగా ఉన్న ఆశాజనకమైన ధరలు ప్రస్తుతం 50 శాతానికి పడిపోయిన నేపథ్యంలో మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన ప్యాకేజీ రైతులకు ఎంతవరకు మేలు చేస్తుందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. క్వింటాల్ మిర్చి ధర రూ.11,781 కంటే తగ్గితే కేంద్రం సాయం చేస్తుందని ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. గత నెల రోజుల్లో రాష్ట్రంలో మిర్చి క్వింటాల్‌కు కనిష్టంగా రూ.9 వేలు, గరిష్టంగా రూ.13,500 లభిస్తోంది. గత వారం రోజుల్లో క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు ధర పెరిగిందని అధికారులు తెలిపారు. రూ.11,781 కంటే ధర తగ్గితే సంబంధిత వ్యత్యాసం సొమ్ము ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం వల్ల తమకు పెద్దగా ప్రయోజనం ఉండబోదని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అదనంగా ధరలు వచ్చే అవకాశం ఉందని అధికార యంత్రాంగం భావిస్తోంది. మార్కెట్ ఇంటర్ వెన్షన్ ద్వారా రైతులకు సాయంపై ఇంతవరకు ఉత్తర్వులు రాలేదు. ఈ నేపథ్యంలో ధరలు పెరిగే వరకు వేచి చూసే ధోరణి అవలంబించాలని మార్కెటింగ్ శాఖకు మౌఖిక ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. ఇందువల్లే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్లో ధరల స్థిరీకరణ నిధి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారని చెప్తున్నారు. అన్ని పంటలకు కలిపి ఇంత తక్కువ మొత్తం కేటాయిస్తే మిర్చి రైతుకు ఎంత కేటాయిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. గతేడాది డిసెంబరు నుంచి ఫిబ్రవరి 28 వరకు జరిగిన క్రయవిక్రయాల వివరాలు మాత్రమే ప్రభుత్వం కోరిందని మిర్చి యార్డు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 2024-25 వ్యవసాయ సీజన్‌లో 4,18,665 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఇందుకు సంబంధించి 2,17,490 మంది రైతులు, కౌలు రైతులు ఈ-క్రాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎకరాకు సగటు దిగుబడి 20 క్వింటాళ్ల వరకు వస్తుందని అధికార్ల అంచనా. 2017లో ఎకరాకు రూ.1,500 మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం ద్వారా ప్రభుత్వం సాయం అందించింది. అయితే, ప్రస్తుతం పెరిగిన పెట్టుబడి వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని ప్రస్తుతం ధరలు తగ్గినందున క్వింటాలుకు రూ.3 వేలు ఇస్తే రైతులు కొంతవరకు కోలుకునే అవకాశం ఉంది. ఈ లెక్కన మొత్తం దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున ఒక్కో రైతుకు రూ.60 వేలు సాయం అందిస్తే మేలు జరిగే అవకాశం ఉంటుంది.

ఈ ప్రాతిపదికన కింద 4,18,665 ఎకరాలకు రూ.2,512 కోట్లవుతుంది. దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తే రైతులకు మేలు జరుగుతుంది. కానీ, ప్రభుత్వం ప్రతిపాదించిన ధర రూ.11,781 కంటే తక్కువ వస్తే తాము ఈ ధరకు రైతుల నుంచి 25 శాతం దిగుబడులు కొంటామని ప్రభుత్వం చెప్పడం వల్ల తమకు ఒనగూరే ప్రయోజనం చాలా తక్కువని రైతులు చెబుతున్నారు. 20 క్వింటాళ్ల దిగుబడిలో క్వింటాలుకు రూ.10 వేలు వస్తే మిగతా రూ.1,781 చొప్పున 25 శాతం దిగుబడికి అంటే ఐదు క్వింటాళ్లకు తమకు దక్కేది కేవలం రూ.8,905 మాత్రమేనని రైతులు అంచనా వేస్తున్నారు.

అమెరికా అధికారిక భాషగా ఇంగ్లీష్

ఆర్డర్‌పై ట్రంప్ సంతకం



వాషింగ్టన్: అమెరికా అధికారిక భాషగా ఇంగ్లీష్‌ను పేర్కొంటూ ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఆదేశాలపై ఆయన సంతకం చేశారు. తాజా ఆదేశాలు ఫెడరల్ ప్రభుత్వ నిధులతో నడిచే ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు తమ సేవలను, పత్రాలను ఆంగ్లేతర భాషల్లో కొనసాగించాలా, వద్దా? అని ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. "ఇంగ్లీష్ అధికారిక భాషగా ఏర్పాటు చేయడం వల్ల సంభాషణలు క్రమబద్ధీకరించడమే కాకుండా ఉమ్మడి జాతీయ ప్రయోజనాలు బలోపేతమవుతాయి. సమ్మిళిత, సమర్థవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు" అని ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఈ పరిణామం దేశంలో ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రభుత్వ కార్యక్రమాల్లో సమర్థతను నెలకొల్పుతుందని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. పౌరుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు మార్గాన్ని ఏర్పరుస్తుందని వైట్‌హౌజ్ అభిప్రాయపడింది. ఇంగ్లీష్‌ను అధికారిక భాషగా గుర్తిస్తూ ఇప్పటికే అమెరికాలోని 30 రాష్ట్రాలు చట్టం చేసినట్టు సమాచారం. అయితే, అమెరికా అధికార భాషగా గుర్తింపు కోసం కాంగ్రెస్ చట్టసభ సభ్యులు దశాబ్దాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ అవి సఫలం కాలేదు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే వైట్‌హౌస్ వెబ్‌సైట్ స్పానిష్ వెర్షన్‌ను తొలగించారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడయ్యాక ఇదే విధంగా చేసినప్పటికీ.. బైడెన్ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించడం గమనార్హం.

మీ ఇంటిని చక్కదిద్దుకోండి

బీజేపీకి డి.కె శివకుమార్ సూచన

ఆ పార్టీలో చేరుతారంటూ వస్తున్న వార్తలకు ఖండన

బెంగళూరు : కర్నాటక ఉపముఖ్యమంత్రి డి.కె శివకుమార్ బీజేపీకి కౌంటర్ ఇచ్చారు. ముందు మీ ఇంటిని చక్కదిద్దుకోండని హితవు పలికారు. ఆయన బీజేపీలో చేరుతారని ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే, వీటిని ఆయన ఖండించారు. ఆ పార్టీ నేతలే కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. "ముందు బీజేపీ తన ఇంటిని చక్కదిద్దుకోనివ్వండి. ఆ పార్టీలోని పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయాన్ని మా పార్టీ మంత్రులే స్వయంగా వెల్లడించారు. దీనిపై ఎలాంటి చర్చలు అవసరం లేదు" అని వివరించారు. ఈ సందర్భంగా ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సద్గురు జగ్గీ వాసుదేవ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలవడంపై వస్తున్న విమర్శలకు కూడా ఆయన స్పందించారు.

చరిత్ర వక్రీకరణకే ఆ మ్యూజియం!

ఫ్రాన్స్ భాగస్వామ్యంతో దేశ రాజధాని ఢిల్లీలో ప్రపంచంలోనే అతి పెద్ద మ్యూజియంను నిర్మిస్తానని నరేంద్ర మోడీ ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ 'యుగ యుగీన్ భారత్ నేషనల్ మ్యూజియం' (వైవైబీఎన్ఎం) స్వరూపం ఎలా ఉంటుందనే విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచుతోంది. ఇది హిందూయిజాన్ని శాశ్వతమైనదిగా, ముస్లిం పాలకులను శత్రువులుగా చిత్రిస్తూ చరిత్రను వక్రీకరిస్తుందని తెలుస్తోంది. ప్రజాస్వామ్యం వంటి ఆధునిక భావాలకు 'భారత్' అనేదే పునాది అని చెప్పే ప్రయత్నం కూడా చేయబోతోంది. ప్రస్తుతం ఉన్న జాతీయ మ్యూజియం ప్రాంగణంలో దీనిని నిర్మించడం సాధ్యం కాదు. ఎందుకంటే ఇందులో ఏడెనిమిది వేల కళాఖండాలను ప్రదర్శిస్తారు. అందుకు అవసరమైన స్థలం జాతీయ మ్యూజియంలో లేదు. దీంతో వైవైబీఎన్ఎం నిర్మాణానికి కొత్తగా స్థల సేకరణ జరపాల్సి ఉంటుంది.

హిందూయిజం ప్రచారానికే అంటున్న చరిత్రకారులు

న్యూఢిల్లీ: కొత్తగా నిర్మించబోయే మ్యూజియం, ప్రస్తుతం ఉన్న జాతీయ మ్యూజియం ప్రణాళికలు, భవితవ్యంపై జాతీయ మ్యూజియం డైరెక్టరును, ఫ్రాన్స్ కంపెనీని ఆరా తీయగా సాంస్కృతిక మంత్రిత్వ శాఖను సంప్రదించాలని సూచించాయి. అంటే దీనిపై ఉన్నత స్థాయిలోనే నిర్ణయం జరుగుతుందన్నది స్పష్టమైపోతోంది. చరిత్రను తిరగరాసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలపై విమర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాఠశాల పాఠ్య పుస్తకాలలో, నాయకుల ప్రసంగాలలో ఆ ప్రయత్నం కన్పిస్తోంది. ఇక కొత్త మ్యూజియంలోనూ ఇది ప్రతిబింబిస్తుందనే అభిప్రాయం వినిపిస్తోంది. కొత్త మ్యూజియంపై కేంద్ర ప్రభుత్వం ఎవరి అభిప్రాయాలు తీసుకోలేదు.

సెంట్రల్ ఢిల్లీలోని రైసినా హిల్స్‌లో ఉన్న ఉత్తర, దక్షిణ బ్లాక్స్‌ను ఖాళీ చేయించి అక్కడ నూతన మ్యూజియంను ఏర్పాటు చేయాలని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఆ బ్లాక్స్‌లో ఆర్థిక, హోం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు పనిచేస్తున్నాయి. వీటిని ప్రస్తుతం నిర్మిస్తున్న కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌కు తరలించాలని భావిస్తున్నారు. 1.55 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉండే కొత్త మ్యూజియం రూపురేఖలపై మీడియాలో ఉత్కంఠ కన్పిస్తోంది. ప్రస్తుత మ్యూజియం ఉన్న భవన విస్తీర్ణం 35 వేల చదరపు మీటర్లు మాత్రమే. కొత్త మ్యూజియం భారత అవిచ్ఛిన్న నాగరిక చరిత్రను చాటిచెబుతుందంటూ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రకటనలు గుప్పిస్తోంది. అయితే ఇది ఎలా ఉంటుంది, ఎంత బడ్జెట్ కేటయించారు అనేది మాత్రం బహిర్గతం చేయడం లేదు. కళాఖండాలను ఎలా రవాణా చేస్తారు, ఎలా నిల్వ చేస్తారు అనేది కూడా తెలియడం లేదు. ప్రభుత్వ అధికారిక సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ వెబ్‌సైటులో కొత్త మ్యూజియంకు ఓ పేజీ కేటాయించారు. అయితే అందులోనూ వివరాలేవీ లేవు. 'ఈ పేజీని అభివృద్ధి చేస్తున్నారు' అనే సందేశం మాత్రం కన్పిస్తోంది. జాతీయ మ్యూజియం వెబ్‌సైటులో కూడా ఎలాంటి సమాచారాన్ని పొందుపరచలేదు.

2023 మేలో జరిగిన ఇంటర్నేషనల్ మ్యూజియం ఎక్స్‌పోలో ప్రధాని మోడీ కొత్త మ్యూజియం ప్రస్తావన తెచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. దాని ప్రకారం మ్యూజియంలో 950 గదులు ఉంటాయి. ఇవి భారతీయ జ్ఞాన సంప్రదాయాలను, చారిత్రక వారసత్వాన్ని, మధ్య యుగం నాటి భారతదేశాన్ని, స్వాతంత్ర్య పోరాటాన్ని గురించి వివరిస్తాయి. అయితే వీటిని చాటిచెప్పేలా ఎలాంటి వస్తువులు, కళాఖండాలను వాడతారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. మ్యూజియంలో మోడల్స్, వీడియోలకు ప్రాధాన్యత ఉంటుందని మాత్రం తెలుస్తోంది. మ్యూజియంలో ఫ్రాన్స్, భారత సాంస్కృతిక శాఖ నిర్వహించబోయే పాత్ర ఎలా ఉంటుందన్న విషయంపై ఊహాగానాలు వినవస్తున్నాయి. ప్రభుత్వ మ్యూజియంల నుండి, దేశంలోని ఇతర ప్రాంతాల నుండి కళాఖండాలను తెచ్చి కొత్త మ్యూజియంలో ఉంచుతారని పలువురు అధికారులు చెబుతున్నారు. కొత్త మ్యూజియంపై కేంద్ర సాంస్కృతిక శాఖ మాజీ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు జవహర్ సిర్కార్ మొదటి నుండి సందేహాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. దీని ప్రణాళికలు ఏమిటని ఆయన పార్లమెంటులో సాంస్కృతిక శాఖ మంత్రిని ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదు.

'అసలు వారు ఏం ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. భారతీయ చరిత్ర మెహర్‌గఢ్ (పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్‌లో ఉన్న పురావస్తు ప్రదేశం), మొహంజదారో, హరప్పా నుండి ప్రారంభమైంది. దానికి ముందున్న చరిత్రకు ఆధారాలేవీ లేవు. అసలు దానిని చరిత్ర అనలేము. అది పురాణం మాత్రమే. చరిత్ర అంటే గట్టి రుజువులు ఉండాలి. మనం చూస్తున్న కళాఖండాలలో ఆ రుజువులు కన్పిస్తాయి' అని సిర్కార్ తెలిపారు. కాగా మ్యూజియం రూపురేఖలకు సంబంధించిన అంతర్గత పత్రాన్ని 'ది వైర్' పోర్టల్ సేకరించింది. దాని ప్రకారం అందులో 12 విభాగాలు ఉంటాయి. ఆ విభాగాలు చరిత్రకు ముందు నాటి కాలంలో ప్రారంభమై వలసవాదుల పాలన నుండి దేశానికి స్వాతంత్ర్యం లభించడంతో ముగుస్తాయి. ఆ పత్రంలో 'భారత్' అనే పదాన్ని పదే పదే వాడడం గమనార్హం.





ఇంటివద్దే పాఠాలు!

- హోమ్ స్కూలింగ్‌కు పెరుగుతున్న ఆదరణ
- సమస్యలూ ఉన్నాయంటున్న విద్యావేత్తలు

ఇంటి వద్దే పాఠశాల...ఇదేమిటి అనుకుంటున్నారా ? ఇప్పుడు మన దేశంలో ఈ ధోరణి బాగా పెరిగిపోతోంది. సంప్రదాయ పరంగా చిన్నారులను పాఠశాలకు పంపకుండా వారికి ఇంటి వద్ద విద్యను అందించడమే ఈ 'హోమ్ స్కూలింగ్'. ఈ విధానంలో తల్లిదండ్రులు లేదా గార్డియన్లే నేరుగా పిల్లలకు విద్యను బోధించే బాధ్యతను తీసుకుంటారు. పాఠశాలకు వెళ్లి గంటల తరబడి తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినాల్సిన పనే ఉండదు. తల్లిదండ్రులు, పిల్లల సమయానుకూలాన్ని బట్టి విద్యా బోధన జరుగుతుంది. పిల్లలు తమ అభిరుచులను బట్టి నేర్చుకోవచ్చు. ఇది మన దేశంలో చట్టబద్ధమే. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్), ఈ-పాఠశాల వంటి వేదికలు హోమ్ స్కూలింగ్‌కు మద్దతుగా పనిచేస్తున్నాయి.

న్యూఢిల్లీ : ఇటీవలి కాలంలో చాలా మంది పిల్లలు కూడా హోమ్ స్కూలింగ్‌నే ఇష్టపడుతున్నారు. హడావిడిగా నిద్ర లేచి ఉరుకులు పరుగులు పెట్టాల్సిన అవసరం లేదు. తల్లిదండ్రులకు కూడా తొందర ఏమీ ఉండదు. తాపీగా పనులు చేసుకోవచ్చు. ఉదయం లేచీ లేవగానే స్కూలుకు పోవడానికి తయారవ్వాల్సిన పనీ ఉండదు. ఆటలు ఆడుతూ, మ్యూజిక్ వింటూ, బొమ్మలు గీస్తూ ఇష్టమొచ్చినప్పుడు హాయిగా చదువుకోవచ్చు. రోజులో ఎప్పుడైనా చదువుకోవచ్చు. తల్లిదండ్రులే తొలి గురువులు. పుస్తకాల మోత అసలే ఉండదు. చెమటలు కక్కుకుంటూ, వానలో తడుస్తూ, చలికి వణుకుతూ స్కూలుకు పోనక్కరలేదు.

ఇదంతా ఊహాజనితం అనుకుంటున్నారా? లేదు. నమ్మండి... నమ్మక పోండి.. చాలా మంది పిల్లలకు ఇది వాస్తవం. మన దేశంలో ఇప్పుడిప్పుడే ఈ తరహా విద్యాబోధనకు ప్రాచుర్యం పెరుగుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు సైన్స్, గణితం, ఆంగ్లం బోధించవచ్చు. అంతేకాదు...జీవిత పాఠాలూ నేర్పవచ్చు. నిండా మూడేండ్లయినా నిండని చిన్నారుల్ని డేకేర్, ప్రీ-స్కూల్‌కు పంపితే చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. అప్పటి వరకూ తల్లిదండ్రుల ముద్దుమురిపాల నడుమ పెరిగిన బాలబాలికలు ఒక్కసారిగా వారికి దూరమై వేరే ప్రపంచంలో అడుగుపెడితే ఎలా ఉంటుంది? 'ఆ వయసులో వారికి కనీసం సరిగా తినడం కూడా తెలియదే. అలాంటిది డేకేర్‌లో, ప్రీ-స్కూల్‌లో తోటి పిల్లల రణగొణధ్వనుల మధ్య, ఏడుపులు పెడబొబ్బల మధ్య వారు ఎలా ఉంటారు? చిన్నారులకు విద్యా బోధన ఇలా ఎలా మొదలయ్యేది?. అందుకే మేము ఇంటి వద్దే మా పాపకు చదువు చెప్పుకుంటున్నాము' అని ఓ మహిళ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు.

ఇప్పుడు పిల్లల్ని పాఠశాలలో చేర్చాలంటే అదో పెద్ద ప్రహసనంగా మారిపోయింది. అడ్మిషన్ దొరకాలంటే ప్రవేశ పరీక్ష రాయాలి. ఆ తర్వాత ఇంటర్వ్యూకు వెళ్లాలి. ఈ తంతంతా చూసి పిల్లల్లో ఉత్సాహం నీరుకారిపోతోంది. స్కూలు అంటేనే భయం పట్టుకుంటోంది. ఇక పాఠాలు ఎలా నేర్చుకుంటారు? భయానక వాతావరణంలో ఎలా చదువుకుంటారు? ఇదంతా చూసి విసిగిపోతున్న తల్లిదండ్రులు హోమ్ స్కూలింగ్ వైపు మొగ్గుచూపుతున్నారనడంలో అతిశయోక్తి లేదు. అయితే ఇంటి వద్దే విద్యాభ్యాసాన్ని ఎలా కొనసాగిస్తారు అనే సందేహం కలగక మానదు. హోమ్ స్కూలింగ్ అనేది అన్ని కుటుంబాలలో ఒకేలా ఉండదు. తమ పిల్లలు ఎలా నేర్చుకోవాలని తల్లిదండ్రులు అనుకుంటారో దానిని బట్టే అది ఉంటుంది. కొందరికి నిర్దిష్ట పాఠ్యాంశాలు అంటూ ఏవీ ఉండవు. 'పిల్లలకు నడక ఎవరు నేర్పారు? వారు తమంతతామే నేర్చుకుంటారు. వారిపై మనం ఎందుకు ఆంక్షలు విధించాలి? ఒత్తిడి పెంచాలి?' అని సుభద్ర అనే మహిళ ప్రశ్నించారు. పిల్లలు ఇప్పటివరకూ పాఠశాలకు వెళ్లకపోయినా ఆంగ్లంలో చక్కగా మాట్లాడుతున్నారని, వివిధ ప్రదేశాలు తిరుగుతూ చరిత్రను గురించి తెలుసుకుంటున్నారని, క్రికెట్ ఆడుతూ స్కోరును లెక్కిస్తూ గణితాన్ని నేర్చుకుంటున్నారని ఇఫ్తెకార్ గర్వంగా చెప్పారు.

అయితే ఇందులో సవాళ్లూ ఉన్నాయి. నేటి ఉరుకులు పరుగులు జీవితాల్లో తల్లిదండ్రులకు అసలు సమయమే చిక్కడం లేదు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు కలవరపెడుతుంటాయి. ఈ పరిస్థితుల్లో పిల్లలకు తీరుబడిగా చదువు చెప్పే తీరిక ఎవరికి ఉంటుంది? పైగా హోమ్ స్కూలింగ్ కారణంగా ఇరుగు పొరుగు పిల్లలతో సంబంధాలు ఉండవని, వారు ఒంటరివారు అవుతారని సంస్కృతి గ్రూప్ ట్రస్టీ, కార్యదర్శి ప్రణీత్ ముంగాలీ చెప్పారు. తోటి పిల్లలతో కలిసి మెలసి ఉన్నప్పుడు, చదువుకున్నప్పుడు వారి బుద్ధి వికసిస్తుందని, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, ఇంటి వద్ద చదువుకుంటే అది సాధ్యపడదని ఆమె తెలిపారు.

హోమ్ స్కూలింగ్‌తో చదువే కాదు... సంగీతం, చిత్రలేఖనం, వంట చేయడం వంటి అనేక ఇతర పనులను కూడా పిల్లలు నేర్చుకుంటున్నారు. సిర్‌సీన్ అనే మహిళ కుమార్తె ఇరుగుపొరుగు వారు ఆంగ్లంలో మాట్లాడుతుంటే విని తానూ అనర్గళంగా మాట్లాడుతోంది. ఆమెకు బెంగాలీ, హిందీ, ఉర్దూ భాషలు కూడా వచ్చు. పరిసరాల ప్రభావం పిల్లలపై ఎక్కువగా పడుతుంటుంది. జీవితంలో ఎదురయ్యే అనుభవాలే పిల్లలకు పాఠాలు నేర్పుతాయి. తమ పిల్లలు పుస్తకాలతో కుస్తీ పట్టడం తమకు ఇష్టం లేదని, వారి ఆసక్తిని తెలుసుకొని దానికి అనుగుణంగా విషయ పరిజ్ఞానం కలిగిస్తామని, హోమ్ స్కూలింగ్ ద్వారా పిల్లల మేధస్సు వికసిస్తుందని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

మనువాదానికి వ్యతిరేకంగా

మహోద్యమానికి సిద్ధం కావాలి

పూలే, అంబేద్కర్‌ను మొక్కుతూ వారి ఆశయాలను తొక్కేస్తున్న మతోన్మాదులు

కులవివక్ష, అసమానతలపై ప్రతిఘటనా పోరాటాలు : కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ పిలుపు



మహబూబ్‌నగర్‌లో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాలు

నవతెలంగాణ -నవాబ్‌పేట

దేశంలో అధికారంలో ఉన్న మతోన్మాద పాలకులు పూలే, అంబేద్కర్‌ను మొక్కుతూ వారి ఆశయాలను అణగదొక్కే విధంగా పరిపాలన చేస్తున్నారని, మతోన్మాద మనువాద భావాజాలానికి వ్యతిరేకంగా మహోద్యమాలను ఐక్యంగా నిర్మించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అరుంధతి భవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున, అతిమల మాణిక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించగా, జాన్‌వెస్లీ మాట్లాడారు. భారత దేశానికి దిశా నిర్దేశం చేసేలా అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి పొంచి ఉన్న మనువాద, మతోన్మాద ప్రమాదాన్ని ప్రతిఘటించడానికి ఒక విశాల ఐక్య మహోద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. దేశంలోని కులాలు, మతాల మధ్య అసమానతలు సృష్టిస్తూ పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని తొలగించాలన్న కుట్రలో భాగంగానే పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవమానపరిచే మాట్లాడారని గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని హిందుత్వ ఎజెండాను దూకుడుగా అమలు చేస్తూ దేశాన్ని అల్లకల్లోలం చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని తెలిపారు. సనాతన ధర్మం ముసుగులో మనువాద భావజాలాన్ని ప్రచారం చేస్తూ.. దళితులు, అభ్యుదయవాదులు, మేధావులు, జర్నలిస్టులపై దాడులు చేస్తున్నారని అన్నారు. స్థానికంగా క్షేత్రస్థాయిలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సామాజిక అణిచివేతలకు, కులవివక్షకు వ్యతిరేకంగా అంబేద్కర్, పూలే చూపిన బాటలో పయనిస్తూ ఉద్యమాలు తీవ్రతరం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు, రాష్ట్ర ఆఫీసు బేరర్స్ ఎం కురుమయ్య, నందిపాటి మనోహర్, అరూరి కుమార్, సురేష్ కుమార్, కోట గోపి, రాధాకృష్ణ, మంద సంపత్ దుర్గం దినకర్, రామ్మూర్తి, ప్రకాష్‌కారత్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు మాణిక్యాల రాజు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

డోజ్ ఎఫెక్ట్..మస్క్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ విధ్వంసకర పాత్రకు పెరుగుతున్న వ్యతిరేకతకు ఈ ప్రదర్శనలు నిదర్శనం. దీనిలో భాగంగా టెస్లా కొనుగోళ్లను అడ్డుకోవాలని, ఆటంకం కలిగించాలని ఆందోళనకారులు భావిస్తున్నారు. శనివారం 50 కంటే ఎక్కువ ప్రదర్శనలు జరిగినట్టు టెస్లా వెబ్‌సైట్ పేర్కొన్నది. ఇంగ్లండ్, స్పెయిన్, పోర్చుగల్‌లతో పాటు యూఎస్‌లోని పలు ప్రాంతాల్లో మరిన్ని నిరసనలు చేపట్టనున్నట్టు ఆందోళనకారులు వివరించారు. టక్సన్, అరిజోనా సహా సెయింట్ లూయిస్, న్యూయార్క్ నగరం, డేటన్, ఒహియోటీ షార్లెట్, పాలో ఆల్టో, కాలిఫోర్నియాల్లో ఇటీవల ప్రదర్శనలు జరిగినట్టు వార్తానివేదికలు తెలిపాయి. కొంత మంది టెస్లా యజమానులు.. తమ వాహనాలను ధ్వంసం చేసినట్టు చెప్పారు. యూదు సమూహాలు, పరిశీలకులు యూదు వ్యతిరేకత పెరుగు తుందని భయపడుతున్నారు. ఇటీవల ట్రంప్, మస్క్‌లు వేల సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగులను తొలగించడంతో పాటు ఒప్పందాలను రద్దు చేశారు. యూఎస్‌ఏజెన్సీఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఎయిడ్)



తో సహా ప్రభుత్వ విభాగాలను మూసివేశారు. మస్క్ చర్యలు అమెరికా బడ్జెట్‌ను నియంత్రించడానికి, తన సంపదను పటిష్టపరుచుకోవడానికి మార్గాలను అందిస్తున్నాయనీ, కాంగ్రెస్‌ను ధిక్కరిస్తున్నాయని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మస్క్ ముఖ్యంగా స్పేస్‌ఎక్స్, సోషల్ మీడియా ఎక్స్‌లను విస్తరించేందుకు యత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు.



జాబిల్లిపై బ్లూ ఘోస్ట్

- విజయవంతంగా ల్యాండ్ అయిన వ్యోమనౌక
- చరిత్ర సృష్టించిన తొలి ప్రయివేటు సంస్థ ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్

వాషింగ్‌టన్ : అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ సంస్థ ప్రయోగించిన 'బ్లూ ఘోస్ట్' అనే వ్యోమనౌక జాబిల్లి ఉపరి తలంపై విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. ఫైర్‌ఫ్లైకు చెందిన మిషన్ కంట్రోల్ ఈ విషయాన్ని నిర్ధారిం చింది. 'చంద్రుడిపై ఉన్నాం. ల్యాండర్ స్థిరమైన స్థితిలో ఉంది' అని ప్రకటించింది. తద్వారా చందమామ పై కూలిపోకుండా, పడిపోకుండా.. సరైన స్థితిలో వ్యోమనౌకను ల్యాండ్ చేసిన తొలి ప్రయివేటు సంస్థగా చరిత్ర సష్టించింది.

ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి జనవరి 15న స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్-9 రాకెట్.. బ్లూ ఘోస్ట్‌తోపాటు జపాన్‌కు చెందిన మరో ల్యాండర్ 'హకుటో-ఆర్2'ను నింగిలోకి తీసుకెళ్లింది. బ్లూ ఘోస్ట్ ల్యాండర్ పొడవు రెండు మీటర్లు. ఇది జాబిల్లి కక్ష్య నుంచి ఆటోపైలట్ మోడ్‌లో కిందికి ప్రయాణిస్తూ.. ఈశాన్య అంచున ఉన్న మోన్స్ లాట్రెయిల్ సమీపంలో దిగింది. అనంతరం అక్కడి తొలి చిత్రాన్ని పంపించింది. అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా)కు సంబంధించిన 10 ప్రయోగాలను నిర్వహించనుంది. చందమామ ధూళిని సేకరించేందుకు వాక్యూమ్ వినియోగం, చంద్రుడి ఉపరితలం కింద ఉష్ణోగ్రతలను కొలవడానికి డ్రిల్లింగ్ చేయడం, వ్యోమగాముల స్పేస్‌సూట్‌లు, పరికరాలకు అంటుకునే హానికరమైన ధూళిని తొలగించే మరో పరికరాన్ని పరీక్షించడం తదితరాలు ఇందులో ఉన్నాయి.

టెక్సాస్‌కు చెందిన 'ఇన్‌ట్యూయిటివ్ మెషీన్స్' సంస్థ ప్రయోగించిన ల్యాండర్ కూడా గురువారం జాబిల్లిపై దిగేందుకు సిద్ధంగా ఉంది. దక్షిణ ధ్రువానికి 160 కిలోమీటర్ల దూరంలో దీన్ని దించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది ఇదే సంస్థ ప్రయోగించిన మొదటి ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై ఒరిగిపోయింది. మరోవైపు.. బ్లూ ఘోస్ట్‌తోపాటే నింగిలోకి వెళ్లిన 'హకుటో-ఆర్2'.. మే చివరలో లేదా జూన్ ప్రారంభంలో దిగనుంది. జాబిల్లిపై ల్యాండింగ్ కోసం ఐస్పేస్ చేస్తున్న రెండో ప్రయత్నమిది. రెండేండ్ల కిందట ప్రయోగించిన మొదటి ల్యాండర్ చందమామ ఉపరితలంపై కూలిపోయింది.

అసెంబ్లీ ప్రోరోగ్

గవర్నర్ నోటిఫికేషన్ జారీ

నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

శాసనసభ, శాసనమండలిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రోరోగ్ చేశారు. అందుకు అనుగుణంగా ఆదివారం ఆయన నోటిఫికేషన్ జారీ చేశారు. డిసెంబరులో ప్రారంభమైన సమావేశాలను ప్రోరోగ్ చేయకుండానే మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం, ఎస్సీ వర్గీకరణ, కులగణన నివేదికలపై తీర్మానాన్ని ఆమోదించాయి. ఈ నెలలో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తాజాగా ఉభయసభలను ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించాల్సి ఉంటుంది. అసెంబ్లీ, మండలిని సమావేశపరిచేందుకు వీలుగా గవర్నర్ మరో నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది.



గెలుపెవరిదో..?

(మొదటి పేజీ తరువాయి)

24,133 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపును నల్లగొండ పట్టణంలోని అర్జాలబావి దగ్గరున్న పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టినట్టు, సర్వం సిద్ధం చేసినట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపు కోసం మొత్తం 25 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. టేబుల్‌కు నలుగురు చొప్పున సిబ్బంది ఉంటారు. మొత్తం ఓటర్లు 25797 ఉండగా 24133 మంది. ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకున్నారు.25 టేబుళ్లలో 24133 ఓట్లను లెక్కించడానికి సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ మొదలు కానుంది. కాగా, పోటీలో అలుగుబెల్లి నర్సిరెడ్డి, పులిసరోత్తం రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి పింగిళి, పూల రవీందర్, గాల్రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.సుందరరాజు, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, లింగిడి వెంకటేశ్వర్లు, అర్వస్వాతి, కంటె సాయన్న, పన్నాల గోపాల్రెడ్డి, ఏలె చంద్రమోహన్, చాలిక చంద్రశేఖర్, జంకిటి కైలాసం, జి.శంకర్, తలకోల పురుషోత్తంరెడ్డి, తాటికొండ వెంకటరాజయ్య, దామెర బాబురావు, బంక రాజు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజక వర్గ స్థానాల ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం మొత్తం 35 టేబుళ్ల వినియోగించనున్నారు. ఇందులో 21 పట్టభద్రుల ఓట్ల కోసం, 14 టేబుళ్ల ఉపాధ్యాయుల ఓట్లు కోసం ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తించనుండగా, ఇందులో ఒక మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు లెక్కింపు అసిస్టెంట్లు ఉన్నారు. వీరందరికీ శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులు శిక్షణ ఇచ్చారు. లెక్కింపు కోసం మొత్తం 800 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఇందులో 20శాతం రిజర్వ్ సిబ్బందిని నియమించారు. అత్యంత పటిష్టమైన భద్రత నడుమ లెక్కింపు చేపట్టనుండగా, ప్రతి టేబుల్ వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరాయంగా కొనసాగనున్నది. సోమవారం ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రారంభం కానుండగా, పూర్తయ్యే సరికి సుదీర్ఘ సమయం తీసుకోనున్న నేపథ్యంలో మూడు షిఫ్టుల్లో లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఓట్ల లెక్కింపులో పాల్గొనబోయే సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించేందుకు మాక్ కౌంటింగ్ నిర్వహించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలకు చోటు లేకుండా ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణలో ఇచ్చిన ఆదేశాలను, సూచనలను కచ్చితంగా పాటిం చాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక అడిషనల్ డీసీపీ అధికారితో పాటు, ఆరుగురు ఏసీపీలు, 18 మంది ఇన్‌స్పెక్టర్లు, 30 మంది ఎస్సైలతో సహా మొత్తం 400మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీపోరులో 3,55,159 ఓట్లలో ఏకంగా 2,50,106 మంది (70.42 శాతం)ఓట్లువేశారు. మొత్తం 56మంది అభ్య ర్థులు బరిలో ఉండగా.. కేవలం నలుగురు అభ్యర్థుల నడుమే ప్రధాన పోటీ నెలకొంది. అందులో అధికార కాంగ్రెస్ నుంచి వుట్కూరి నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి పోటీ చేసిన ప్రసన్న హరికృష్ణ, ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ (ట్రస్మా) బలపరిచిన యాదగిరి శేఖర్‌రావు ఉన్నారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 27,088 ఓట్లలో ఏకంగా 24895 (91.90శాతం) ఓట్లు పోలయ్యాయి. కాగా, పీఆర్‌టీయూ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి కొమురయ్య, టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్, ఎస్సీఎస్టీయూఎస్ మద్దతుతో పోటీచేస్తున్న అశోక్‌కుమార్ మధ్య పోటీ తీవ్రంగానే సాగింది.



ఇళయరాజాను సత్కరించిన తమిళనాడు సీఎం

చెన్నై: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సత్కరించారు. ఇళయరాజా ఈ నెల 8న లండన్‌లో 'సింఫనీ' వేదికగా భారీ స్థాయిలో ఆర్కెస్ట్రా ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్టాలిన్ స్వయంగా ఇళయరాజా నివాసానికి వెళ్లి అభినందించారు. ఇళయరాజాను శాలువాతో సన్మానించి కాసేపు ముచ్చటించారు. ఈ వీడియోను స్టాలిన్ తన సోషల్‌మీడియా ఖాతా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇళయ రాజా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజల సంగీత శ్వాస అని స్టాలిన్ కొనియాడారు. ఆసియాలోనే ఇంతకుముందు ఎవరూ చేపట్టని రీతిలో సింఫనీ కార్యక్రమం ఏర్పాటుకు ధైర్యంగా ముందుకు వచ్చిన ఇళయరాజాను అభినందించారు. అదే సమయంలో తన చేతితో రాసిన మ్యూజిక్ నోట్స్‌ని ఇళయరాజా సిఎంకు చూపించారు. స్టాలిన్ పోస్టును రీట్వీట్ చేస్తూ ఆయనకు ఇళయరాజా ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు.

వాస్తవాన్ని తెలిపిన కథలు

జీవితాలను మరింత సునిశితంగా పరిశీలించడానికి స్ఫూర్తినిచ్చిన కథల పుస్తకం జమిలిపోగు. 2024 లో వచ్చిన ఈ కథా సంపుటిని రచయిత్రి రుబీనా పర్వీన్ రాశారు. సాధారణంగా స్త్రీల కథలు అనగానే వారి దుఃఖాలు కష్టాల కలపోతలే ఎక్కువగా ఉంటాయని అనుకుంటాం. కానీ జమిలి పోగు రకరకాల స్త్రీల ప్రయాణాన్ని ఏరి కూర్చి అల్లినది. గమ్యానికన్నా ప్రయాణం ముఖ్యమైనది అన్న వాస్తవాన్ని తెలిపిన కథలు ఇందులో ఉన్నాయి.


రుబీనా పర్వీన్ వృత్తి రీత్యా ఎంతోమంది బడుగు వర్గాల స్త్రీల నుంచి ఆర్థికంగా అభివృద్ధి చెందిన స్త్రీల వ్యాపార ఉద్యోగాల విషయాలలో పని చేసారు. వేల మందికి ఉద్యోగ అవకాశాలు ఉపాధులు కల్పించారు. ఆ క్రమంలోనే కాక తను పెరిగిన ఖమ్మం జిల్లా వాతావరణాలు, జీవితాలు కూడా ఆమె కథల్లో కనిపిస్తాయి. తన గుండెకి ఉన్న తడి తన కథల్లో కనిపిస్తుంది.

ముస్లిం స్త్రీల జీవితాల్లో వారి స్వేచ్ఛకి వారి అస్తిత్వానికి పరదా వేయడం, తెరదింపడం వంటి విషయాలను బయటివారు చాలా చర్చిస్తుంటారు. నిజానికి అలా మాట్లాడే వాళ్ళకి లోపలి విషయాలు బయట వారిగానే తెలుస్తుంటాయి. తెలియకపోయినా ఒక్కోసారి మాట్లాడుతుంటారు. ఎప్పుడైతే మనలో నుంచి ఒక గొంతు బయటకు వినిపిస్తుందో అప్పుడే దానికి ఒక నిజమైన ప్రామాణికత చేకూరుతుంది. అలాంటి కథ ఖులా. నిజానికి అంతకంటే ముందు రూబీ నా కొన్ని కథలు రాసినా ఖులా కథతో ఒక ప్రత్యేకమైన గుర్తింపును పొందారు. ఇస్లాం చట్టపరంగా స్త్రీలకున్న ఒక ముఖ్యమైన అవకాశం గురించిన కథ ఇది. చదివి తీరాల్సిన కథ.

అలాగే స్కిజోఫ్రీనియా అనే కథ కూడా ఆమెకు మరింత మంది పాఠకులను తెచ్చిపెట్టింది. సాధారణంగా సినిమాల్లో మనం చూస్తున్నప్పుడు మానసిక రోగం ఉన్న పురుషులు హీరోలుగా కనబడుతుంటారు కథ అంతా ఆ జబ్బు చుట్టూరు తిరుగుతూ ఉంటుంది. కానీ ఇంట్లో ఒక రోగి ఉన్నప్పుడు మిగతా కుటుంబ సభ్యులు ఎదుర్కొనే విషయాలను గురించి సినిమాలు తక్కువగా చర్చిస్తుంటాయి ఆ లోటుని తీర్చే కదే ఇది. రోగం ముదిరే కొద్దీ తన సహచరికి ఉండే ప్రేమ కూడా ముదరడం, పరిస్థితులను అంగీకరించడం, నిస్సహాయంగా ప్రేమించడం ఈ కథలో చూస్తాం ఈ కథ చదివిన తర్వాత ఏం జరగనట్టు మామూలుగా నిద్రపోవడం అసంభవం.

రూబీనా కథల్లో కథ ఒక ఎత్తు అయితే కథనం మరో ఎత్తు. ప్రతి కథా వస్తువు గురించి కథనం గురించి ఒకేసారి ఆలోచించడం మనకే తెలియకుండా జరుగుతూ ఉంటుంది. ఖమ్మం గ్రామీణ యాస నుంచి మెట్రోపాలిటన్ నగరాల్లో ఇంగ్లీష్ మాట్లాడే పాత్రల వరకు ఈ జమిలిపోగు అల్లుకొని ఉంది. మీకు ఎప్పుడైనా ఏం చదవాలి, ఏదో ఒకటి చదవాలి అని కథా రచనల మీద ఆసక్తి కలిగినప్పుడు ఈ జమిలిపోగు పుస్తకాన్ని తప్పకుండా అందుకోండి. ఒక గొప్ప అనుభూతిని పొందుతారు.





దక్షిణాది సినిమాపై అపూర్వ పరిశోధన

దురదృష్టవశాత్తూ ఇవాళ తెలుగు సినిమా విమర్శ అంటే... అయితే కొత్త చిత్రాల సమీక్ష, లేదా పాత చిత్రాల గొప్పదనం విశ్లేషణగా స్థిరపడిపోయింది. దీనికి భిన్నంగా, అరుదుగా కొంతమంది సినీ చరిత్రకారులు ఉంటారు. సినీ రంగం స్థితిగతులపై సుదీర్ఘ కాలంగా విశ్లేషణ, పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తున్న విశిష్ట చరిత్రకారుడు డాక్టర్ రెంటాల జయదేవ. ఆయన ఇప్పుడు 'మన సినిమా... ఫస్ట్ రీల్' పేరుతో, అనితరసాధ్యమైన కృషి చేశారు. మన తెలుగు సినిమాయే కాక, మొత్తం దక్షిణాది భాషా చిత్రాల తొలినాళ్ళ చరిత్రను ఈ బృహత్ గ్రంథంతో వెలుగులోకి తెచ్చారు.

అసలు మన దేశంలో సినిమా ఎలా మొదలైంది? అది మన దక్షిణాదికి ఎలా విస్తరించిందో రచయిత తెలిపారు. బొంబాయి, కలకత్తా, మద్రాసుల్లో, హైదరాబాద్ స్టేట్ లో, కన్నడ దేశంలో, మలయాళ సీమలో... ఇలా ప్రాంతీయ శాఖలుగా భారతీయ సినిమా ఎలా ప్రారంభమైందో తెలిపారు. అప్పట్లో మూకీ సినిమాల పట్ల ప్రజలు ఆదరణ చూపించారు. అయితే తెర మీద ఏవో బొమ్మలు పరుగెడుతూ ఉన్నాయి తప్ప మాటలు, పాటలు లేవనే అసంతృప్తి కొంత ఉండేది. ఆ సమయంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యంత్ర పరికరాల సహాయంతో మాటలున్న టాకీ చిత్రాలు ప్రదర్శించేందుకు వీలు కలిగింది. అలా విదేశీ టాకీల దిగుమతి, ప్రదర్శన సాగుతున్న పరిస్థితుల్లో 1931 మార్చి 14న భారతదేశపు మొదటి టాకీ ఫీచర్ ఫిల్మ్ 'ఆలం ఆరా' విడుదలైంది.

'ఆలం ఆరా' తర్వాత నాలుగేళ్లలో సైలెంట్ సినిమాల నుంచి శబ్ద చిత్రాల మార్పు పూర్తిగా జరిగిపోయింది. తొలి భారతీయ టాకీ హీరోయిన్ జుబేదా మన హైదరాబాదీ కోడలే. స్టంట్ మూకీల స్టార్ హీరో మాస్టర్ విఠల్ తొలి టాకీ హీరో అయ్యే అదృష్టం పట్టినా, ఎక్కువకాలం తన స్టార్ హోదాను నిలబెట్టుకోలేక పోయారు. ఇందులో హీరోగా అవకాశం చేజారిన మెహబూబ్ ఖాన్ మాత్రం తర్వాత కాలంలో స్టార్ డైరెక్టర్ గా ఎదగడం విశేషం. తొలి భారతీయ టాకీ 'ఆలం ఆరా' (1931) రూపకల్పన ఎంత ఆసక్తికరమైనదో... ఆ చిత్ర నిర్మాణ శిల్పి అర్దేశీర్ ఇరానీ సినీ ప్రస్థానం కూడా అంతే ఆసక్తికరమని ఆ భారతీయ టాకీపతి విశిష్టత - గొప్పదనాన్ని వివరించారు.

తొలి పూర్తి తెలుగు టాకీ ఏమిటని అడగగానే అందరూ సర్వసాధారణంగా 'భక్త ప్రహ్లాద' (1932) అని చెబుతారు. ఇక, ఈ పుస్తకంలో రెంటాల జయదేవ మరో కొత్త పరిశోధనతో ముందుకొచ్చారు. పది రీళ్ళ పూర్తి నిడివి '100% సంపూర్ణ తెలుగు టాకీ'... 'భక్త ప్రహ్లాద' రిలీజు (1932 ఫిబ్రవరి 6) కన్నా మూణ్ణెల్ల పైచిలుకు ముందే 1931 అక్టోబర్ 31న విడుదలై, తెరపై బొమ్మలు తెలుగులో మాట్లాడిన, తెలుగు త్యాగరాయ కీర్తనలతో అలరించిన తొలి దక్షిణ భారతీయ భాషా టాకీ సినిమా... 'కాళిదాస్'. ఆ సంగతి పుష్కరకాలం క్రితమే మన దృష్టికి తెచ్చిన జయదేవ... తీరా తమిళులు ఆ చిత్రాన్ని తమ తొలి టాకీగా చెప్పుకుంటూ తమిళ సినీచరిత్రలో కలిపేసుకుంటూ ఉంటే తెలుగు మాటలు, పాటలున్న ఆ చిత్రాన్ని తెలుగువాళ్ళమైన మనం లెక్కలలో పూర్తిగా వదిలేసుకుంటున్న సంగతిపై ఈ రచనలో ఫోకస్ లైట్ వేశారు.


- కె.పి.అశోక్ కుమార్
9700000948


'కాళిదాస్' పూర్తి నిడివి కథా చిత్రమేమీ కాదు. అది అసలు ఒకే సినిమా కూడా కాదు... మూడు చిన్న నిడివి చిత్రాలను కలిపి ఒకే షోగా జనానికి చూపిన కదంబ కార్యక్రమ ప్రదర్శన. అసలు సినిమాకు ముందూ వెనుకా తమిళ పాటలు, డ్యాన్సుల లఘు చిత్రాలు రెండు వేశారు.

తమిళులు తమ చరిత్ర లెక్కల్లో 'కాళిదాస్'ను తొలి తమిళ టాకీగా చెప్పుకుంటున్నా, అందులో అసలు తమిళ డైలాగులే లేవు. అచ్చంగా తెలుగు డైలాగులతోనే ఆ కథను చిత్రీకరించారని రెంటాల తెలియజేశారు . నిజానికి, 4 రీళ్ళే ఉన్న ఆ 'కాళిదాస్' లఘు కథా చిత్రం పూర్తిగా తెలుగు డైలాగులతోనే నడిచిన సినిమా అని తన నూతన పరిశోధనలో వెల్లడించారు. అది అచ్చమైన తెలుగు మాటల సినిమా అనేందుకు సాక్ష్యాధారాల బలం చేకూరుస్తూ... అప్పట్లోనే ఆ చిత్ర హీరోయిన్ టి.పి. రాజలక్ష్మి, ఆ చిత్రంలో నటించిన ఎల్.వి. ప్రసాద్, సినిమా రిలీజైన వెంటనే ఆ రోజుల్లో తమిళ 'ఆనంద వికటన్' మేగజైన్ లో ప్రసిద్ధ తమిళ రచయిత 'కల్కి' కృష్ణమూర్తి రాసిన వ్యంగ్యపూరిత సమీక్ష... ఇలా అందరూ ఇచ్చిన ఇంటర్వ్యూలు, రాసిన మాటలను ఆధార సహితంగా జయదేవ ఈ పుస్తకంలో బయటపెట్టారు.

> ఆసక్తికరమైన అప్పటి టాకీ టెక్నిక్, పాఠాలు అంటూ అప్పటి ఛాయాగ్రహణం, సౌండ్ రికార్డింగ్, కలర్ ప్రింట్ల విషయంలో వచ్చిన క్రమ వికాస పరిణామాన్ని కూడా ఈ పుస్తకంలో మన కళ్ళ ముందు ఉంచారు. తెలుగు, తమిళంలో కంటే కొంత ఆలస్యంగా అనగా 1934లో తొలి కన్నడం టాకీ 'సతీ సులోచన' విడుదలైంది.

అలా ఒకటికి మూడు లఘు చిత్రాల సమాహారంగా రిలీజైన తొలి దక్షిణ భారతీయ భాషా టాకీ 'కాళిదాస్'లో కథానాయిక పాత్ర ధరించిన టి.పి. రాజలక్ష్మి బహుముఖ ప్రజ్ఞాశాలిని. టీనేజ్ లోనే పెద్ద రంగస్థల నటిగా, మూకీ స్టార్ గా వెలసిన రాజలక్ష్మి 'ఫస్ట్ ఉమన్ డైరెక్టర్ ఇన్ సౌత్ ఇండియా'. విప్లవాత్మక నవలా రచయిత్రిగా, సినీ నిర్మాతగా, సామాజిక ఉద్యమకారిణిగా వెలుగొందిన ఆమె చివరలో... ఆర్థిక పరాజయాలతో ఆస్తులన్నీ కరిగిపోయి, అనామకంగా కన్నుమూయడం విషాదం. ఆ కథంతా ఈ పుస్తకంలో చదవచ్చు. అలాగే వెండితెరపై కలర్ దృశ్యాల ఆవిర్భావ వికాసాల కథనూ, అప్పట్లోనే సినిమా సమీక్షలపై - సమీక్షకులపై చెలరేగిన విమర్శల దుమారాన్ని కూడా ఇందులో తెలియజేశారు.

గతంలో పరిశోధనాత్మక దృష్టితో వాస్తవాలను పరిశీలించని సినీ పండితమన్యులు కొందరు మొదట 'భక్త ప్రహ్లాద', ఆపైన 'కాళిదాస్' వచ్చాయని వాస్తవ విరుద్ధ అంశాలను చాలాకాలం ప్రచారంలో పెట్టారు. దాంతో, అటు 'కాళిదాస్' విడుదల (1931 అక్టోబర్ 31) కి కానీ , ఇటు 'భక్త ప్రహ్లాద' విడుదల (1932 ఫిబ్రవరి 6) కి కానీ అసలు సంబంధమే లేని 1931 సెప్టెంబర్ 15 అనే తప్పుడు తేదీ తెరపైకి వచ్చింది. అది తెలుగు సినిమా జన్మదినం అంటూ అసలు పుట్టని తేదీన తెలుగు సినిమాకు పుట్టినరోజు వేడుక జరుపుతూ వచ్చారు. అది తప్పు అన్న సంగతి 2011లోనే ఈ పుస్తక రచయిత రెంటాల జయదేవ తన పరిశోధనతో తేల్చారు.



జయదేవ తొలి లఘు నిడివి 4 రీళ్ళ తెలుగు టాకీ 'కాళిదాస్', తొలి పూర్తి నిడివి 10 రీళ్ళ తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద'తో పాటు, మన తెలుగు తర్వాతే తమిళంలో పూర్తి నిడివి టాకీలు వచ్చాయని వెల్లడించారు. పూర్తి నిడివి టాకీల్లో సైతం మన తెలుగు 'భక్త ప్రహ్లాద' తరువాతే... తమిళ పూర్తి నిడివి తొలి టాకీ 'హరిశ్చంద్ర' (1932 ఏప్రిల్ 9) వచ్చింది. చరిత్రకారులకు చాలాకాలంగా ఉన్న సందిగ్ధతను పోగొట్టారు.

ఆసక్తికరమైన అప్పటి టాకీ టెక్నిక్, పాఠాలు అంటూ అప్పటి ఛాయాగ్రహణం, సౌండ్ రికార్డింగ్, కలర్ ప్రింట్ల విషయంలో వచ్చిన క్రమ వికాస పరిణామాన్ని కూడా ఈ పుస్తకంలో మన కళ్ళ ముందు ఉంచారు. తెలుగు, తమిళంలో కంటే కొంత ఆలస్యంగా అనగా 1934లో తొలి కన్నడం టాకీ 'సతీ సులోచన' విడుదలైంది. కన్నడ టాకీ పితామహుడిగా కొనియాడబడే నట, దర్శక, నిర్మాత వై.వి. రావు తెలుగువాడే! త్రిపురాంబ తొలి కన్నడ టాకీ హీరోయిన్. ఆ తొలి కన్నడ టాకీకి సంగీత దర్శకత్వంలో కీలకమైన హెచ్.ఆర్. పద్మనాభ శాస్త్రి మన తెలుగువాడే! అవన్నీ ఈ రచనలో ఆసక్తికరంగా తెలియజేశారు.

తెలుగు, తమిళ, కన్నడ భాషా చిత్రాల తర్వాత 1938లో కానీ, తొలి మలయాళ టాకీ 'బాలన్' విడుదల కాలేదు. తొలి మలయాళ టాకీలో నటించిన హీరో, హీరోయిన్, దర్శకుడు... ఈ ముగ్గురిదీ చాలా చిత్రమైన కథ. ఈ ముగ్గురూ జీవితంలో ఎక్కడ మొదలై, ఎక్కడ చేరారని చూస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది. చివరకు టీ షాప్ లో సర్వర్ గా మారిన హీరో, మూడు సినిమాలకే కెరీర్ ముగిసిన హీరోయిన్, సినిమాల్లో సర్వం కోల్పోయి దుస్తుల వ్యాపారిగా మారిన దర్శకుడు - ముగ్గురు ముగ్గురే! ఒక్కొక్కరిది ఒక్కో సినిమా కష్టం. ఒక్కో సినిమా స్టోరీ! ఇక, మలయాళ సినిమాలో ప్రవేశించిన మన తెలుగు తారలు కాంతారావు, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, విజయనిర్మల, ఊర్వశి శారద తదితరుల ప్రగతి, విద్యావంతుల వేదికగా మారిన మలయాళ సినిమా అనేక మార్పులకు అందమైన చిరునామా అంటూ ఆ చిత్ర పరిశ్రమ ఒడుదొడుకులనూ, గొప్పదనాన్నీతెలియజేశారు.

తెలుగు, తమిళమే కాదు... ఇతర దక్షిణాది భాషల సినిమా చరిత్రలో ఇప్పటి దాకా తప్పుగా నమోదైన పలు విషయాలను ఈ పరిశోధనాత్మక రచనలో జయదేవ సరిచేయడం విశేషం. ఇవాళ్టికీ కన్నడ సినిమా చరిత్రలో చరిత్రకారులు తొలి కన్నడ టాకీ 'సతీ సులోచన' (1934) హీరోయిన్ త్రిపురాంబ అంటూ కె.ఎల్.వి. వసంత అనే తమిళ సినీ నటి ఫోటో వేస్తున్న సంగతిని ఆయన బహిర్గతం చేశారు. ఇలా దక్షిణాది భారతీయ భాషల చరిత్రను సాధికారికంగా రూపొందించడంలో జయదేవ చేసిన కృషి ప్రశంసించదగినది.

కొన్ని సంస్థలు, యూనివర్సిటీలు కలిసి చేయాల్సిన పనిని ఒక వ్యక్తిగా రెంటాల జయదేవ ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి భుజాన వేసుకున్నారు. విశేషంగా శ్రమించి, సమాచారం సేకరించారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు పలువురు ప్రముఖులను ఇంటర్వ్యూ చేయడమే కాక, అలనాటి వారు గతంలో వచ్చిన ఇంటర్వ్యూల నుండి కూడా ఎంతో విలువైన సమాచారాన్ని సేకరించి ఈ పుస్తకంలో పొందుపరిచారు. అరుదైన, విలువైన ఫోటోలనూ, వందేళ్ళ క్రితం నాటి పేపర్ క్లిప్పింగులనూ చూడముచ్చటగా విస్తృతంగా ఇచ్చారు. దాని వల్ల ఈ సినీ చరిత్ర గ్రంథం అందంగా, ఆకర్షణీయంగా తయారవ్వడమే కాదు. మరింత సాధికారతను సంతరించుకుంది. భారతీయ, మరీ ముఖ్యంగా దక్షిణాది చిత్ర పరిశ్రమకు సంబంధించి ఈ రెంటాల జయదేవ 'మన సినిమా... ఫస్ట్ రీల్' మంచి రెఫరెన్స్ బుక్ గా చిరకాలం నిలిచిపోతుంది. ఇది అందరూ కొని, చదివి, పదిలంగా దాచుకోవాల్సిన అరుదైన రచన.

మైల బంధం

నేను ఇక్కడే ఉంటా
ఎక్కడ ఉన్నా ఇక్కడే ఉంటా
ఈ ఆరు బయటనే
హృదయాన్ని గాలిపటంలా ఎగరేసుకుంట

రెక్కలు ఇప్పుకోలేని ఇంట్లో
మూలకు పడి ఉండలేక
పిట్టో చెట్టో పిలిస్తే
తోవలు తీసుకున్న
నిశ్శబ్దంగా మాట్లాడుకుంటూ
గోడలు లేని జాడ కొచ్చిన
పూర్వ నీడల మైల బంధం
పూనకమై....
ప్రకృతికి పాలోన్ని చేసింది



ఇక్కడ అంతా అంతే
ఎటు చూసినా
ఎద ఏరవుతుంది
అదృశ్యదారులెంట నడుస్తున్నప్పుడు
లోన దుఃఖం నాటుకొని
మేఘమై పూసే
పొగ చెట్లను చూశా
ఎన్ని కళ్ళను తుడిచిందో
తడి తడిగా ఎగిరిపోతుంది గాలి

ఒక మెరుపు మెరిసిపోయింది
వాయిద్యం లా
ఉరుము ఉరిమిపోయింది
వానకు తడిసిన రేల చెట్టు
అనుభూతిని....
గాలితో పంచుకుంది
నేల మీద పూల వాగు
వెన్నెల్లో మునిగితేలుతున్న

చెట్టు నేలకు ఆకాశానికి ధన్యవాదాలు చెబుతూ
పారవశ్యపు వేడుకలో ఉన్నాయి
తెలవని రంగులెన్నో
నన్ను ముంచెత్తుతున్నాయి
వాన వీణరాగమై కురుస్తుంది
పూలు రేపు తుమ్మెదలకు
ఒక పాటను కూర్చుకున్నాయి
అన్ని నృత్యం లోనే ఉన్నాయి
పొద్దు కూడా దినమాలస్యమైనా
మెల్లగానే కదులుతుంది

పిట్టలు వాలి
చెట్టుకు గొంతునిచ్చాయి
శ్వాసను మీటుతుంటే
లోన శూన్యరాగం
ఇది దివ్య తలం
ఇక్కడే నా ఆత్మని ఇనాముగా ఇచ్చి
దేహాన్ని పారేసుకుంట.

- మునాసు వెంకట్ , 9948158163

సాహితీ వార్తలు

ఆవిష్కరణ, అంకితోత్సవ సభ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణా సాహిత్య అకాడమీ, హైదరాబాద్ పాతనగర కవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో కొరుప్రోలు హరనాథ్ సమగ్ర కవిత్వం ఆవిష్కరణ, అంకితోత్సవం ఈ నెల 4 తేదీ సాయంత్రం 5 గంటలకు రవీంద్రభారతి సమావేశమందిరం నందు జరుగును. ఈ కార్యక్రమానికి శ్రీ వేమిరెడ్డి నరసింహారెడ్డి, శ్రీమతి సురభివాణీదేవి, డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ కాంచనపల్లి, డా॥బాలాచార్య నామోజు, గుడిపాటి, డా॥ కొండపల్లి నీహారిణి, డా॥ మామిడి హరికృష్ణ, డా॥కె.అనితారెడ్డి, డా॥కె.వి.కృష్ణకుమార్, పులిపాక సత్యమూర్తి పాల్గొంటారు. తదుపరి అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా కవి సమ్మేళనంలో డా॥ ఏనుగు నరసింహారెడ్డి, సుధామ, సి.యస్. రాంబాబుగారు వ్యవహరిస్తారు.

- హైదరాబాద్ పాతనగర కవుల వేదిక

కవిత 2024 కు కవితలకు ఆహ్వానం

విజయవాడ సాహితీమిత్రులు వెలువరిస్తున్న కవిత 2024 కోసం కవితలకు ఆహ్వానం పలుకుతోంది. జనవరి 24 నుండి డిసెంబర్ 24 మధ్యకాలంలో ప్రింట్/ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురితమైన కవితలను మార్చి 15 లోగా editor.kavitha2024@gmail.com కు పత్రికలలో ప్రచురితమైన కవితల ఇమేజ్ / పిడిఎఫ్ లు మాత్రమే పంపండి.

- విశ్వేశ్వరరావు

పులి వేటలో నిశబ్ధమే వ్యూహం..


- పర్కపెల్లి యాదగిరి,
9299909516

అగ్నిపర్వతం లాంటి కవిత్వాన్ని నెత్తిన మోస్తున్న కవి కొండి మల్లారెడ్డి కూడా వస్తువు పట్లా శిల్పం పట్లా.. వ్యక్తీకరణ పట్లా పులిలాగే నిశ్శబ్ద వ్యూహ రచన చేస్తాడు.. జింకలను అప్రమత్తం చేసి పులికి గర్వభంగం కలిగిస్తాడు..

'నిశ్శబ్ద వ్యూహం' కవితలో.. "వాడెవడో కూడలిలో నిలబడి/ రాయి విసిరిన వాడి చేయికి మొక్కాలి/ అద్దం పగిలితే పగిలింది దాని వెనకాల దాగి ఉన్న/ అబద్ధాలను తేటతెల్లం చేసింది"

సమాజంలో సాగుతున్నదీ.. అతి ప్రధానమైనదీ.. అతి ప్రమాదకరమైనదీ వేట..

సంక్షోభ సమయాలను ముందే గుర్తించి అక్కడ మాటు వేస్తాడు.. మాయను గుర్తించి కవితాస్త్రాన్ని సంధిస్తాడు కవి..

మార్కెట్ పేరుతో వ్యూహం.. పాలన పేరుతో వ్యూహం.. అభివృద్ధి పేరుతో వ్యూహం.. సకలం వ్యూహమయం.. వ్యూహం పన్ని రైతు కాలి కింది నేలను లాక్కొని నిర్వాసితున్నీ నిర్వీర్యున్ని చేయడం జరుగుతున్నది.

వినియోగదారుడినీ, రైతునీ, నేలనీ చేజిక్కించుకొని సమాజంలో దోపిడీ జరుపుతున్న ఒరవడిని తెలియపరచిన కవిత్వం 'గూడు చెదిరిన దృశ్యం' కవిత్వం మహిమాన్వితమైనది.. దానిని ఆరాధిస్తూ సాష్టాంగపడి ఆవాహన చేసుకొని అస్వాదిస్తున్న కవి.. అందుకే అతడిలో కవిత్వం నదిలాగా పెల్లుబికి వస్తున్నది.

మానవ సంబంధాలు.. రక్తసంబంధాలు సైతం ఆర్థిక సంబంధాలుగా మారిపోయిన సమాజంలో.. "కాలానికి కొలతవేసి/ కరెన్సీలోకి మార్చి/ మునివేళ్ళ మీద నిలుచున్న మనిషిని/ కుదురుగా కూర్చుండబెట్టే చోటు కావాలి 'ఇప్పుడొక వూరు కావాలి' కవితలో అన్నాడు.

రైతు కుటుంబంలో జన్మించిన మల్లారెడ్డి, రైతు జీవితంలోని లోతులనూ సాదకబాదకాలనూ, కన్నీళ్లనూ కడగండ్లనూ చూసినవాడు, ఆత్మాభిమానం గలవాడు, రైతుగా గాయపడినవాడు.

నిత్యం భూమాతతో సహజీవనం చేసే రైతు, భూమాత సహనాన్ని ఒంట బట్టించుకున్న రైతు, జీవితాన్ని చాలించిన సంఘటనలు అనేకం.

ఏ కాలధారలో ఏదీ శాశ్వతం కాదు.. చైతన్యం కాలపు సహజ గుణం.. 'భూమి పుత్రులు' కవిత లో.. "పంట పొలాల్లో పాతుకుపోయి/ నేల సారాన్నంతా పిప్పి చేస్తున్న పిచ్చి మొక్కల్ని/ కలుపు తీసేందుకు మునుం బట్టారు" ఇది కాలానుగుణంగా వచ్చిన మార్పుని వెలిబుచ్చినాడు.

గత కొన్నేళ్లుగా పాలకులు చేసిందే శాసనం.. చెప్పిందే వేదం.. ఏది చెప్పినా నమ్ముతారనీ.. చెల్లుతుందనే అతి నమ్మకంతో పెరిగిన అహంకారం.. ఔట్ గోయింగే కానీ ఇన్ కమింగ్ ఎరుగని అధికారాన్ని హెచ్చరించిన "వినికిడి సమస్య ఎవరికీ లేదు/ వినాలని లేకపోవడమే జాడ్యమని తెలిసి పోయాక/ తేల్చుకోవడానికే అడుగేసారు"

ఇప్పుడు రైతు కన్నీరు కార్చే ఎద్దు కాదు.. పందెంలో రంకె వేసి కాలు దువ్వే కాలం.. 'అలికిడి' లో.. "అర్ధరాత్రి దాటాక/ ఆశ చావని సేద్యకాడొకడు/ సాయుధుడై నడుస్తూ వెళ్ళుతో ఉంటాడు" ఇప్పుడు రైతు నాగలిని ఆయుధంగా మోస్తున్న దృశ్యం మన కళ్లముందు నిలిపినాడు.



గత వర్తమానాలలో జరుగుతున్న మార్పుకు సాక్షిగా నిలబడి కవిత్వం వ్రాస్తున్న వాడు కొండి మల్లారెడ్డి.

"భ్రమలు తొలగిన చోట బతుకు దుర్భరమే/ కుండ పోతగా వాన/ కుళ్ళనంతా కడిగేసుకొనిరా"

ఎన్నికల వేళ ఇంటి ముందుకు వచ్చే నాయకుల స్వభావాన్ని సూటిగా ఎండగట్టిన కవిత.. 'వాగ్దానం' లో.. "మళ్ళా ఒక్కసారి మీ రక్తం ధారపోయండి/ నెత్తురు తడిసిన నేలలో విత్తనాలు నాటి/ రాజ్యాన్ని సేద్యం చేసుకుంటాం/.. త్యాగాలూ తద్దినాలూ ఆశయాలూ అమరత్వాలో/ వాటాలూ వగైరాలంటూ వాదులాటకు దిగకండి"

నిర్వాసితుల అశ్రు బిందువులను కవిత్వంతో శోధించి కన్నీటికి భాష ఉందని తేల్చిన మల్లారెడ్డి.. 'కన్నీటి భాష' లో.. "ముంపుపేర కొంపగోడు కనుమరుగై పోతుంటే/ విడిచిపోలేక వీడ్కోలు పలుకలేక/ తలపడే శక్తిచాలక తాకట్టు విడిపించుకోలేక/ గుండె పగిలి దుఃఖభాష"..

నిన్న మొన్నటిదాకా ఎల్లయ్య మల్లమ్మ అని పిలిపించుకున్న వారికి నిర్వాసితులనే పేర్లు తగిలించిన వాస్తవం.. 'పచ్చబొట్టు' కవితలో.. "నొసటి మీద నిర్వాసితులనే పచ్చబొట్టు పొడిపించుకున్నాక/ భూగోళం మీద ఏ మూల కాలు మోపినా/ చెదిరిన ముఖం చెల్లని రూపాయి కన్నా హీనం.."

మనిషికే ఏ జీవికైనా సోయి ఉండాలి.. అక్షరాలని భుజకీర్తులుగా తగిలించుకున్న కొందరికి సోయి తెప్పించే కవిత 'సోయి '..

ప్రజావసరాలను తీర్చే కవిత్వం యాచకత్వం గా మారకూడదని 'తంగేడు పూల దుఃఖం' కవితలో.. "అనధికార శాసనకర్త రూపాంతరీకరించబడి/ ఆధునిక యాచక కర్తగా కీర్తనగా స్థిరీకరించబడిన బుద్ధీజీవి/ వేళ్ళ మధ్య మొద్దుబారిన కలాన్ని"

రెండువేల ఇరువైఐదు సంవత్సరం శుభారభంలో పాఠక లోకానికి అందుతున్న 'గూడు చెదిరిన దృశ్యం' కవిత్వం.. పీడితుల కళ్ళు తెరిపిస్తుంది.. పీడించే వాడిని ఆలోచింప చేస్తుంది.. ప్రేక్షక పాత్ర పోషించే వాడిని కదిలిస్తుంది.. కన్నీళ్లు తెప్పిస్తుంది.. ఇది మల్లారెడ్డిగారిది ఏడవ సంపుటి.. కాలం కొలిమిలో సదా పుటం పెట్టబడిన ఆయుధమై నిలబడుతుంది..

కొండి మల్లారెడ్డిగారి నుండి ఈ కవిత్వధార మరింత ఉధృతిగా సాగాలని ఆశీస్తూ...

గాజాస్ట్రిప్‌నకు సాయాన్ని అడ్డుకుంటాం : ఇజ్రాయిల్



టెల్ అవీవ్ : గాజాస్ట్రిప్‌లోకి అన్ని రకాల సాయాన్ని, వస్తువుల ప్రవేశాన్ని అడ్డుకుంటామని ఇజ్రాయిల్ ప్రకటించింది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు కోసం ఇజ్రాయిల్ చేస్తున్న ప్రతిపాదనను హమాస్ అంగీకరించకపోతే 'తీవ్రమైన పరిణామాలు' ఉంటాయని హెచ్చరించిన సంగతి తెలిసిందే. సాయం పూర్తిగా నిలిచిపోయిందా లేదా అనేది తెలియాల్సి వుంది. రంజాన్ మరియు పాస్ ఓవర్ లేదా ఏప్రిల్ 20 వరకు కాల్పుల విరమణ మొదటి దశను పొడిగించే ప్రతిపాదనకు మద్దతు ఇస్తున్నట్టు ఇజ్రాయిల్ ఆదివారం తొలుత ప్రకటించింది. అమెరికా పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ నుంచి ఈ ప్రతిపాదన వచ్చినట్టు ఇజ్రాయిల్ తెలిపింది. ఇజ్రాయిల్-హమాస్ కాల్పుల విరమణ మొదటి దశలో.. మానవతా సాయం కొనసాగింది. అయితే ఈ ఒప్పందం శనివారంతో ముగిసింది. కాల్పుల విరమణ రెండవ దశపై చర్చలు జరగాల్సి వుంది. రెండోదశలో ఇజ్రాయిల్ సైన్యం ఉపసంహరణ, శాశ్వత కాల్పుల విరమణకు బదులుగా హమాస్ మిగిలిన బందీలను విడిచిపెట్టాల్సి వుంది. ఈ ఒప్పందం ప్రకారం.. హమాస్ మొదటి రోజు సగం బందీలను విడుదల చేయాల్సి వుందనీ, శాశ్వతకాల్పుల విరమణపై ఒప్పందం కుదిరిన తర్వాత మిగిలిన వారిని విడుదల చేయాల్సి వుందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ కార్యాలయం తెలిపింది.ఇజ్రాయిల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ కోసం ఏడాది నుంచి మధ్యవర్తిత్వం వహిస్తున్న ఈజిప్టు, ఖతార్, అమెరికాలు ఈ ఒప్పందంపై వ్యాఖ్యానించాల్సి ఉంది. హమాస్ కూడా ఈ ప్రతిపాదనపై ఇప్పటికీ స్పందించలేదు.

మాధబి పూరి బుచ్‌కు షాక్

- సెబీ మాజీ చీఫ్‌పై కేసు నమోదు చేయండి
- ఏసీబీకి ముంబయి కోర్టు ఆదేశం



ముంబయి: స్టాక్ మార్కెట్ మోసం, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఆరోపణలపై సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధబి పూరి బుచ్, మరో ఐదుగురు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ)ను ముంబయిలోని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. "స్టాక్ మార్కెట్ మోసం, ఉల్లంఘన విషయంలో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. న్యాయమైన, నిష్పాక్షిక దర్యాప్తు అవసరం" అని ఏసీబీ ప్రత్యేక కోర్టు జడ్జి శశికాంత్ ఏక్‌నాథరావు బంగర్ తన ఆదేశాల్లో వివరించారు. ఈ దర్యాప్తును కోర్టు పర్యవేక్షిస్తుందనీ, 30 రోజుల్లోగా స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని కూడా ఆదేశాల్లో స్పష్టం చేశారు. సెబీలోని జరిగిన ఆర్థిక మోసాలు, నియమాల ఉల్లంఘన, అవినీతి నేరాలపై దర్యాప్తు చేయాలని ఒక మీడియా రిపోర్టర్ కోర్టును ఆశ్రయించారు. సెబీ చట్టం 1992ను ఉల్లఘించారనీ, ముఖ్యంగా సెబీ అధికారుల సహకారంతోనే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఒక కంపెనీ మోసపూరితంగా లిస్టయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్, నియంత్రణ సంస్థలను అనేక సార్లు సంప్రదించినా వారు ఎటువంటి చర్యా తీసుకోలేదని వివరించారు. ఈ విషయాలను పరిశీలించిన కోర్టు ముంబయి రీజన్‌లోని వర్లీలోని ఏసీబీని ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించింది. కాగా, సెబీకి తొలి మహిళా చీఫ్ అయిన మాధబి పూరి బుచ్ పదవీ కాలం శుక్రవారంతో పూర్తయింది. ఎన్ని విమర్శలు, ఆరోపణలు వచ్చినా మూడేండ్ల పదవీ కాలాన్ని ఆమె పూర్తి చేసుకున్నారు.

రావిర్యాల ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

- రూ.30లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు
- రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పీఎస్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-ఆదిభట్ల

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని రావిర్యాలలో ఎస్‌బీఐ ఏటీఎంలో సుమారు రూ.30లక్షల వరకు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆధిభట్ల పీఎస్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి, బ్యాంక్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రావిర్యాల ఎస్‌బీఐ ఏటీఎంలోకి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నలుగురు దుండగులు పక్కా ప్లాన్‌తో వచ్చారు. ముందుగా సీసీ కెమెరాలపై స్ప్రే కొట్టి, వైర్లు కట్ చేసి, సీసీకెమెరాల సైరాన్ మోగకుండా చేశారు. అనంతరం వారు తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను పగులగొట్టారు. ఏటీఎంలోని సుమారు రూ.30లక్షలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్‌బీఐ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఏటీఎంను పరిశీలించారు. బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మూడు బృందాలు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి.



గోదావరి నీళ్లేవీ..?

నిర్లక్ష్యంతో ఎండుతున్న పంట పొలాలు

- ఇంకిపోయిన చెరువులు, కుంటలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- ఎండిన పంటలను పరిశీలిస్తున్న సీపీఐ(ఎం) బృందాలు
- చెరువు, కుంటలను నింపాలని డిమాండ్

నవతెలంగాణ-జనగామ

'మాకున్న మూడు ఎకరాలతో పాటు మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని వరి పంట వేశా.. మా పొలంలో ఉన్న మూడు బోర్లతో పాటు కౌలుకు తీసుకున్న పొలంలో ఉన్న రెండు బోరు మోటార్లలో మూడు బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. మిగతా రెండు బోర్లు బాగున్నా నీరు సరిపోవడం లేదు. దాంతో నీళ్లు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఎకరానికి రూ.30 వేల చొప్పున ఆరు ఎకరాలకు రూ.1,80,000పైగా పెట్టుబడి పెట్టా..' అని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన కాసిజిత్ రెడ్డి వినోదరెడ్డి అనే మహిళా రైతు తన ఆవేదనను వెలిబుచ్చింది. అయితే జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. జనగామ జిల్లాలోని 12 మండలాల్లో 769 చెరువులు, కుంటలు, వీటి కింద 49,643 ఎకరాల ఆయకట్టు సాగు ఉంది. వీటికి తోడుగా 8 రిజర్వాయర్లు ఉన్నాయి. ప్రధానంగా జిల్లాలో గండిరామారం, బొమ్మకూర్, చిట్ట కోడూర్, నవాబుపేట, ఆర్ఎస్ ఘన్‌పూర్, అశ్వరావుపల్లి, కన్నెబోయిన గూడెం, వెల్దండ రిజర్వాయర్ల ద్వారా సాగు, తాగునీరు అందుతుంది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలోనే రిజర్వాయర్లలో ఉండాల్సిన సరాసరి కనీస నీటి మట్టం కన్నా లోతుకు పడిపోయాయి. ఇప్పటికే చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లకు నీరు అందకపోవడంతో రిజర్వాయర్లలోని నీటిమట్టమూ తగ్గిపోయింది. దాంతో కాలువల్లో నీళ్లు పారక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. యాసింగిలో జిల్లాలో 1.99 లక్షల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేయగా వాటిలో 1.66 లక్షల ఎకరాలు వరి పంటను వేశారు. రైతు సంఘాల పరిశీలనలో ఇప్పటికే 30 శాతం పంట పొలాలు ఎండిపోయాయని చెప్తున్నారు. భూగర్భ జలాల శాఖ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం ఇప్పటికే 7.86 కిలోమీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. ఎండల తీవ్రత ఇలాగే కొనసాగితే మరింత లోతుకు భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎండిన పంటలను సీపీఐ(ఎం) బృందాలు పరిశీలిస్తున్నాయి. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్లనే గోదావరి ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు అందడం లేదని, వెంటనే చెరువు కుంటలు నింపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గోదావరి నీటిని తీసుకువచ్చి పంటలు తడిపే వరకూ రైతులకు అండగా ఉంటామని సీపీఐ(ఎం) భరోసానిచ్చింది.

చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేదు : బి.రాజు, బచ్చన్నపేట



నీళ్లందక పంట పొలాలు ఎండిపోతున్నాయి. గోదావరి నీటితో చెరువులు, కుంటలను నింపి ఉన్న కాస్త వరి పంటలను అయినా కాపాడాలి. లేకుంటే పెట్టుబడులు పూర్తిగా నష్టపోయి అప్పుల ఊబిలో ఇరుక్కు పోయి ఆత్మహత్యలే శరణ్యం.

గోదావరి నీటితో చెరువులు, కుంటలు నింపాలి

జిల్లాలో పంట పొలాలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయిలేదు. వారం రోజుల్లో నీటితో నింపకపోతే 60 శాతానికి పైగా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని గమనించి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి వెంటనే జిల్లాలో ఉన్న 8 రిజర్వాయర్లకు నీళ్లు వదిలి వీటి ద్వారా చెరువులు, కుంటలను నింపాలి. పంటలు ఎండిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి.

- మోకు కనకా రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

మల్కపేట రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయకుంటే
రైతుల కోసం రోడ్డెక్కుతాం..

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇంటి ముందు కూర్చుంటాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల టౌన్

మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయకుంటే రైతుల కోసం రోడ్డు ఎక్కుతామని, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇంటి ముందు కూర్చుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవుని గుట్ట తండాలో సందర్శించారు. సాగునీరు అందక రైతుల పొలాలు ఎండిపోతున్నాయని, వారికి ధైర్యం ఇవ్వడానికి వచ్చానని అన్నారు. సంబంధిత మంత్రితో మాట్లాడటం జరిగిందని, రెండు రోజుల్లో నీటిని విడుదల చేస్తానని హామీ ఇచ్చారన్నారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేయకుంటే రైతుల పక్షాన ఉద్యమాలు చేస్తామన్నారు.

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ 1500 ఎకరాలను కాపాడడానికి ఈ కాలువను నిర్మించారన్నారు. కాళేశ్వరం నీళ్లు వచ్చాయని చాలా ఆశతో పంటలు వేసుకోవడమే కాకుండా కొత్తగా 150 కొత్త మోటర్లు కొనుగోలు చేసి కాలువల మీద మోటర్లు పెట్టుకొని 'ఆ నీళ్లు వస్తే సాగు అవుతాది, మా జీవితాలు మేము ఆశించిన విధంగా మంచిగా



అవుతాయి' అని రైతులందరూ డిసెంబర్, జనవరి మాసంలో వరి పంట నాటు వేశారన్నారు. వేసిన తరువాత కేసీఆర్ మీద కోపంతో కుట్రపూరితంగా అక్కడి నుంచి నీళ్లు తీసుకోకుండా కాళేశ్వరం పాడైపోయిందని చెప్పి అసత్యపు ప్రచారం చేశారని, దాని వల్ల రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటా.. : టీ స్టాల్ నిర్వాహకునికి కేటీఆర్ భరోసా

ఆధైర్యపడొద్దు అండగా ఉంటానని సిరిసిల్లలోని 'కేటీఆర్' టీ స్టాల్ నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. కొన్ని రోజుల క్రితం మున్సిపల్ అధికారులు బత్తుల శ్రీనివాస్‌కు చెందిన టీ స్టాల్‌ను తొలగించగా, సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన కేటీఆర్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులు కలిశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. రూ.10లక్షలు ఖర్చయినా సరే శాశ్వత ఉపాధి చూపిస్తానని, మంచి టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకోమని తెలిపారు. వారం రోజుల్లో వచ్చి తానే ప్రారంభిస్తా అని, అద్దె భారం లేకుండా ప్రత్యామ్నాయ మార్గం చూపిస్తా అని భరోసా కల్పించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెళ్లకు చెందిన అబ్బాడి రాజిరెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. గరీబొల్లమీద కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తుందన్నారు. తన వల్ల మీరు జైల్‌కు వెళ్లావంటూ రైతుకు కేటీఆర్ క్షమాపణ చెప్పారు. కేసుల గురించి భయపడవద్దని, అన్నీ తాను చూసుకుంటానన్నారు.

కుంభమేళాకు మోహన్‌భగవత్ వెళ్లారా?

- ఆర్ఎస్ఎస్ చీఫ్‌ని అడిగే ధైర్యం ఉందా
- ఏక్‌నాథ్ షిండేని నిలదీసిన సంజయ్ రౌత్



ముంబయి : యూపీలోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాపై శివసేన, శివసేన (యూబీటీ) మధ్య మాటల యుద్ధం కొనసాగు తోంది. హిందువుల ప్రతినిధులమని చెప్పుకునే ఆర్ఎస్ఎస్ నేతలు అస్సలు హిందూ సాంప్రదాయాలే పాటించరని శివసేన (యూబీటీ) నేత, రాజ్యసభ సభ్యులు సంజయ్ రౌత్ విమర్శించారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ మహాకుంభ్‌లో స్నానమాచరించినట్టు చిత్రాలేవీ బయటకు రాలేదని, అంటే ఆయన ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారా? లేదా? అని సంజయ్ సందేహం వ్యక్తం చేశారు. ఇదే ప్రశ్న అడిగే ధైర్యం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, శివసేన నేత ఏక్‌నాథ్ షిండేకు ఉందా? అని ఆయన నిలదీశారు. కొందరు హిందువులమని చెప్పుకుంటారని, కానీ కుంభమేళాకు మాత్రం వెళ్లరంటూ శివసేన (యూబీటీ) నేతలనుద్దేశించి ఏక్‌నాథ్ షిండే ఇటీవల చేసిన వ్యాఖ్యలకు సంజయ్ ఆదివారం కౌంటరిచ్చారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ని ఇలాగే ప్రశ్నించే ధైర్యం షిండేకు ఉందా? ఆయన హిందువు కాదా? అని ప్రశ్నించారు. హిందూ ధర్మ పరిరక్షణ గురించి మాట్లాడే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కుంభమేళాలో స్నానం చేసిన ఫొటోలు ఇప్పటి వరకు తాను చూడలేదన్నారు. ఆర్ఎస్ఎస్ ముఖ్యనేతలు కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, గోల్వాల్కర్, బాలాసాహెబ్ దేవరాస్, రజ్జుభయ్యా, కెఎస్ సుదర్శన్ కూడా సంగమంలో స్నానాలు చేస్తున్న ఫోటోలు తాము చూడలేదని సంజయ్ అన్నారు. ప్రధాని మోడీ కుంభమేళాలో స్నానం చేస్తున్న ఫోటోలను ఇప్పుడు హల్‌చల్ చేస్తున్నాయి కానీ..గతంలో ప్రధాని కాకముందు మోడీ కుంభమేళాను సందర్శించిన ఫోటోలు తాను చూడలేదని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. తమ పార్టీ నకిలీ హిందూత్వ, పబ్లిసిటీ స్టంట్‌లను నమ్మదని అన్నారు.

గ్లోబల్ లీడర్లతో భారత్ కంపెనీలు పోటీపడాలి

- కార్పొరేట్లు పరిశోధనలో పెట్టుబడి పెట్టాలి
- సృజనాత్మకత, ఆవిష్కరణలే భారత్ పెట్టుబడి
- ఆవిష్కరణలో ఐఐటీ హైదరాబాద్ అగ్రగామి
- కృత్రిమ మేధా నూతన శకానికి నూతన విప్లవం
- 'ఏక్ పేడ్ మాకే నామ్' పేరిట మొక్కను నాటిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు దేశ అభివృద్ధికి తోడ్పడాలని, ప్రస్తుతమున్న జనరేషన్ మార్పు, అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భారత కంపెనీలు గ్లోబల్ లీడర్లతో పోటీపడాలని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆయన ఆదివారం పర్యటించారు. ఐఐటీ హైదరాబాద్‌లో జరుగుతున్న పలు ఆవిష్కరణల నేపథ్యంలో ఉప రాష్ట్రపతి పర్యటించారు. ముందుగా 'ఏక్ పేడ్ మాకే నామ్' పేరిట ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందానుద్దేశించి మాట్లాడారు.

అభివృద్ధి, ఆవిష్కరణలపై కార్పొరేట్ పెట్టుబడి అవసరాన్ని ఎంతో ప్రాముఖ్యతగా తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు దేశ పురోగతి, భవిష్యత్‌ను తీర్చి దిద్దడానికి ఎంతో కీలకమవుతాయన్నారు. ఐఐటీల శాస్త్రీయ పరిశోధనలతో 20 కోట్ల మంది రైతులు నేరుగా బ్యాంకుల్లో ప్రోత్సాహం పొందుతున్నారని తెలిపారు. డిజిటల్ మార్కెటింగ్ అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థులు సృజనాత్మకతపై దృష్టి సారించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత దేశం ఒక గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ఆలోచనలు, ఆవిష్కరణ, సాధనలో ఐఐటీ హైదరాబాద్ అగ్రగామిగా నిలచినందుకు ప్రశంసించారు. మౌలిక సదుపాయాలు అవసరమైనప్పటికీ 300 మంది అధ్యాపక బృందం అంకితభావం, కృషి, సృజనాత్మకతతో ఎన్నో విజయాల్ని సాధిస్తున్నందుకు అభినందిస్తున్నానని తెలిపారు. కృత్రిమ మేధస్సు ప్రతి క్షణం ఆదర్శవంతమైన మార్పును తీసుకొస్తుందని అన్నారు. ఐఐటీ హైదరాబాద్ నినాదం, లోగోను పరిశీలించినప్పుడు రెండూ కీలకమైనవిగా కనిపిస్తున్నాయన్నారు. మానవాళి కోసం సాంకేతికతను కనిపెట్టడం, ఆవిష్కరించడం గొప్ప విషయాలని గుర్తు చేశారు. జ్ఞానం విస్తరణ, పెరుగుదల అనే పదాలు తెలుగు నుంచి తీసుకోవడ్డాయని, భారత దేశం గొప్ప భాషల భూమి అని అన్నారు. సంస్కృతం, బంగ్లా, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ అనేక భాషలున్నాయని, పార్లమెంట్‌లో 22 భాషల్లో ఏకకాలంలో అనువాదం చేయబడుతుందన్నారు. మనం ప్రతి భాషనూ పెంపొందించుకోవాలన్నారు. నేటి యువత సముద్ర ఉపరితలం, లోతైన సముద్రం, భూమి, భూగర్భం, ఆకాశం, అంతరిక్షాన్ని మాత్రమే చూడాలన్నారు. టెక్ టైకూన్‌లు ఉద్భవిస్తున్నాయని, ఏ స్థాయిలోనైనా ప్రపంచ అగ్రశేణి కార్పొరేట్‌లో పనిచేసే ఒక్క భారతీయ ఆత్మను మనం చూడలేనే పరిస్థితి ఉందన్నారు. నేటి యువతే ఆ మార్పును తీసుకురావాలన్నారు. మీ మనస్సులో అద్భుతమైన ఆలోచనలు ఉంచుకోవాలన్నారు. పశ్చిమ దేశాల్లో మీ సహచరులు ఏమి చేస్తున్నారో పరిశీలించమని కోరారు. ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులను పార్లమెంట్ సందర్శనకు తాను అతిథులుగా ఆహ్వానిస్తూ మేథోమథన సెషన్స్ నిర్వహిస్తున్నా మన్నారు. ఐఐటీ హైదరాబాద్ అధ్యాపక బృందం, విద్యార్థులు సైతం రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐటీ ఛైర్మెన్ బీవీ మోహన్‌రెడ్డి, ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ఎంపీ రఘునందర్‌రావు, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం



నవతెలంగాణ-శంషాబాద్

సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు ఆదివారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి భారత ఉప రాష్ట్రపతి దంపతులు జగదీప్ ధన్కర్, సుదేష్ ధనర్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయానికి చేరుకున్న ఉప రాష్ట్రపతి దంపతులకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్, ప్రొటోకాల్ జాయింట్ సెక్రటరీ ఎస్.వెంకట్రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.నారాయణరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఇతర నాయకులు స్వాగతం పలికారు. ఇక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉపరాష్ట్రపతి దంపతులు కంది ఐఐటీకి బయలుదేరి వెళ్ళారు. సాయంత్రం ఉపరాష్ట్రపతి దంపతులు శంషాబాద్ విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

హిందీని బలవంతంగా రుద్దుతారా?

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తమిళనాడు **కేంద్ర, రాష్ట్రాల మధ్య రగులుతున్న వివాదం**

న్యూఢిల్లీ : జాతీయ విద్యా విధానం, దాని త్రిభాషా సూత్రంపై చాలా కాలం నుండే చర్చ నడుస్తున్నప్పటికీ తమిళనాడు ప్రభుత్వం, కేంద్రం మధ్య రగులుతున్న వివాదంతో అది ఇప్పుడు తారా స్థాయికి చేరుకుంది. అసలు భాషా వివాదం ఈ నాటికి కాదు. 1960వ దశకంలోనే దాని మూలాలు ఉన్నాయి. హిందీని నిర్బంధ భాషగా రుద్దడాన్ని తమిళనాడు అప్పుడే వ్యతిరేకించింది. ఈ విధానం వివిధ భాషలను ప్రోత్సహిస్తుందని కేంద్రం అంటుంటే హిందీ యేతర భాషలు మాట్లాడే రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తుందని తమిళనాడు వాదిస్తోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రాన్ని, దానిపై వచ్చిన ఆరోపణలను 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక విశ్లేషించింది.

కొఠారీ కమిషనన్ ఏం చెప్పింది?

త్రిభాషా సూత్రాన్ని తొలుత విద్యా కమిషన్ (1964-66) ప్రతిపాదించింది. దీనినే అధికారికంగా కొఠారీ కమిషన్ అంటారు. ఈ కమిషన్ అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నేతృత్వంలో విద్యకు సంబంధించిన జాతీయ విధానం (ఎన్‌పీఈ)-1968లో త్రిభాషా సూత్రాన్ని ఆమోదించింది.

అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ నేతృత్వంలో ఎన్‌పీఈ-1986లో ఈ సూత్రాన్ని పునరుద్ఘాటించారు. భాషా పరమైన వైవిధ్యాన్ని, దేశ ఐక్యతను పెంపొందించడానికి పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1992లో దానిని సవరించింది. భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ దౌలత్ సింగ్ కొఠారీ నేతృత్వంలోని కమిషన్ మూడు భాషలు నేర్చుకోవాలని సిఫార్సు చేసింది. అవి....మాతృ భాష లేదా ప్రాంతీయ భాష, కేంద్ర ప్రభుత్వ అధికారిక భాష, ఈ రెండూ కాకుండా ఆధునిక భారతీయ లేదా యూరోపియన్ భాష.



జాతీయ విద్యా విధానం ఏం చెబుతోంది?

హిందీని, హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో అంగ్లాన్ని...వాటితో పాటు ఒక ఆధునిక భారతీయ భాషను (దక్షిణాది భాషల్లో ఒకటి) అభ్యసించాలని ఎన్‌పీఈ-1968 నిర్దేశించింది. హిందీ యేతర భాషలు మాట్లాడే రాష్ట్రాల్లో హిందీని, ఆంగ్లాన్ని, ప్రాంతీయ భాషను అభ్యసించాలని సూచించింది. ఎన్‌పీఈ-1986, 1992 ఈ విధానాన్నే కొనసాగించాయి. అయితే హిందీ వినియోగంపై రాష్ట్రాల మధ్య సాధారణ ఏకాభిప్రాయం అవసరమని తెలిపాయి. ప్రజలు హిందీని వాడడంలో నైపుణ్యాన్ని సాధించడానికి త్రిభాషా సూత్రాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరముందని కూడా ఆ విధానాలు నొక్కి చెప్పాయి. 1968వ సంవత్సరపు విధానం కింద త్రిభాషా సూత్రాన్ని సరిగా అమలు చేయడం లేదని ఎన్‌పీఈ-1992 అభిప్రాయపడింది. దానిని మరింత ఉత్సాహంగా, ఉపయుక్తంగా అమలు చేయాలని సూచించింది.

ఎన్ఈపీ-2020 ఏమంది?

వాస్తవానికి ఎన్ఈపీ-2020 హిందీని రుద్దలేదు. ఏ భాషను బలవంతంగా రుద్దడానికి అది సుముఖత చూపలేదు. రాజ్యాంగ నిబంధనలను దృష్టిలో పెట్టుకొని వివిధ భాషలను అభివృద్ధి చేయడానికి, దేశ ఐక్యతను చాటిచెప్పడానికి త్రిభాషా సూత్రం అమలును కొనసాగించాల్సిన అవసరం ఉన్నదని తెలిపింది. పిల్లలు మూడు భాషలు నేర్చుకోవాలా వద్దా అనేది రాష్ట్రాలు, ప్రాంతాలు, విద్యార్థుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని చెప్పింది. తద్వారా రాష్ట్రాలకు నిర్ణయాధికారం ఉన్నదని స్పష్టం చేసింది. స్థానిక భాషలో విద్యా బోధన జరపడం వల్ల అవగాహన పెరుగుతుందని, సంస్కృతి పరిరక్షించబడుతుందని, విద్యార్థుల పనితీరు మెరుగుపడుతుందని అభిప్రాయపడింది. కాగా నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్-2000, 2005, 2023 కూడా త్రిభాషా సూత్రాన్ని సమర్థించాయి.

తమిళనాడు వ్యతిరేకత

తమిళనాడు విషయానికి వస్తే త్రిభాషా సూత్రాన్ని అది చారిత్రకంగా వ్యతిరేకిస్తూ వస్తోంది. 1937లో సి.రాజగోపాలాచారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లో నిర్బంధ హిందీని ప్రవేశపెట్టినప్పుడు జస్టిస్ పార్టీ, పెరియార్ వంటి ద్రవిడ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. 1940లో ఆ విధానాన్ని రద్దు చేసినప్పటికీ స్వాతంత్ర్యానంతరం హిందీ వ్యతిరేక మనోభావాలు ప్రబలడం ప్రారంభమయ్యాయి. 1968లో త్రిభాషా సూత్రాన్ని ప్రవేశపెట్టినప్పుడు తమిళనాడు దానిని తిరస్కరించింది. ముఖ్యమంత్రి సీఎన్ అన్నాదురై నేతృత్వంలో ఆ రాష్ట్రం ద్విభాషా (తమిళం, ఆంగ్లం) సూత్రాన్ని ఆమోదించింది. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయని ఏకైక రాష్ట్రం తమిళనాడే. తాజాగా...ఎన్ఈపీలోని ముఖ్యమైన అంశాలను అమలు చేయనందుకు సమగ్ర శిక్షా అభియాన్ కింద తమిళనాడుకు రూ.573 కోట్ల సాయాన్ని కేంద్రం నిలిపివేసింది. దీంతో కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదం తీవ్ర రూపు దాల్చింది.

ఏడుకు చేరిన ఉత్తరాఖండ్ మృతుల సంఖ్య

మరొకరి ఆచూకీ కోసం గాలింపు



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లా మనా గ్రామంలో మంచు చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. మంచుదిబ్బల కింద కూరుకుపోయిన మరో మూడు మతదేహాలను ఆదివారం రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. దాంతో మృతుల సంఖ్య ఏడుకు పెరిగింది. రెండ్రోజుల క్రితం బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కార్మికుల శిబిరంపై మంచు చరియలు విరిగిపడిన ఘటనలో 58 మంది చిక్కుకున్న విషయం తెలిసిందే. వెంటనే ఆర్మీ సహాయక బందాలు రంగంలోకి దిగి 54 మందిని బయటకు తీశారు. వారిని ఎయిర్‌లిఫ్ట్‌తో జోషి మఠ్ ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. వారిలో తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికులు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆచూకీ దొరకని మిగతా నలుగురి కోసం గాలింపు కొనసాగించగా.. ఆదివారం ఉదయం మరో మూడు మృతదేహాలు బయటపడ్డాయి. మరో కార్మికుడి జాడ తెలియాల్సి ఉంది. రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనేందుకు జోషిమఠ్ నుంచి మరో ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుంది. థర్మల్ ఇంజిన్ కెమెరా సాయంతో మంచులో చిక్కుకున్న వారి కోసం గాలించారు.



పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ

నవతెలంగాణ - ముషీరాబాద్

సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ డిమాండ్ చేశారు. యూపీఎస్ విధానానికి వ్యతిరేకంగా హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆదివారం యుద్ధభేరి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు సీత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. యూపీఎస్ విధానమనేది కార్పొరేట్‌కు ధన ప్రవాహం కొనసాగించడం కోసమే వచ్చిందన్నారు. పెన్షన్ చెల్లించే బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకొని ఉద్యోగుల సొమ్మును పెన్షన్ ఫండ్ నుంచి తరలించి షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడమే సీపీఎస్, యూపీఎస్ ముఖ్య లక్ష్యమని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌తో ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా వసూలు చేసిన దాదాపు 10 కోట్ల రూపాయలను అప్పనంగా కార్పొరేట్ చేతుల్లోకి వెళుతున్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ప్రస్తుత కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేస్తున్నాయన్నారు. అదేవిధంగా తెలంగాణలోనూ సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. యూపీఎస్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 1న బ్లాక్ డేగా పరిగణించి దేశంలోని ప్రతి జిల్లా నుంచి ప్రధానికి లేఖ రాయాలని, కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని, మే 1న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 1న హైదరా బాద్‌లో ఉద్యోగ ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి లక్ష కలాలతో కవాతు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్య క్షులు కొరకుల శ్రీనివాస్, కోటకొండ పవన్, పూల శ్రీనివాస్, నరేందర్ రావు, శ్యాంసుందర్, కోశాధికారి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

152 మంది నకిలీ వైద్యులపె కేసులు : డీసీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చట్ట విరుద్ధంగా మందులను నిల్వ ఉంచి, అమ్ముతున్నందుకుగాను ఈ గత రెండు నెలల్లో 152 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) తెలిపింది. ఈ మేరకు డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాజాగా నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం, చిక్కడపల్లి గ్రామంలో నకిలీ వైద్యులు కుర్మ మల్లేశ్ నడుపుకుతున్న క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. సరైన అర్హతలు లేకుండా క్లినికల్ ప్రాక్టీస్ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచుకున్న రూ.20 వేల విలువైన 34 రకాల మందులను సీజ్ చేశారు.

సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఇంకెప్పుడు ప్రారంభిస్తారు?

- సీఎంకు మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఇంకెప్పుడు ప్రారంభిస్తారు? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మద్దతు ధర రూ.7280 ఉంటే.. దళారులకు రూ.5,500 నుండి రూ.6 వేలకే దళారులకు విక్రయిస్తూ క్వింటాల్‌కు రూ.వెయ్యికిపైగా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్‌తో ముడిపెట్టకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచేందుకు రైతుబంధు, సబ్సిడీలతో సాగును ప్రోత్సహించామని గుర్తుచేశారు. అప్పటి నుంచి రైతులు ప్రణాళికా బద్ధంగా నూనె గింజలను సాగు చేస్తున్నారని తెలిపారు.ప్రస్తుతం పొద్దుతిరుగుడు(సన్ ఫ్లవర్) పంట కోతకు వచ్చినా వాటి గింజలను గింజలను విక్రయించడానికి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాఫెడ్ ద్వారా సన్ ఫ్లవర్ నూనె గింజలకు గిట్టు బాటు ధర కల్పించి కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఈసారి కూడా రూ. 7,280 మద్దతు ధరను నాఫెడ్ ప్రకటిం చిందనీ, అయినా కూడా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగా తెలంగాణ వ్యవసాయం తిరో గమన దిశలో పయనిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నూనె పంటలు వేయాలం టేనే రైతులు ఆందోళన చెందే పరిస్థితులను కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

'నిజాయితీ' ఫలితంగానే మా పార్టీ ఆఫీసుకు తాళాలు : ఆప్

భోపాల్ : నిజాయితీగా వ్యవహరిస్తున్నందునే మధ్యప్రదేశ్‌లోని తమ పార్టీ కార్యాలయానికి తాళాలు పడ్డాయని ఆప్ ఆరోపించింది. భోపాల్‌లో లీజుకు తీసుకున్న నివాసం నుంచి ఆప్ తన కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే గత మూడు నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో యజమాని.. కార్యాలయానికి తాళాలు వేశారు. నిజాయితీ ఫలితమే ఇదని ఆప్ మాజీ ఎంపీ, జాయింట్ సెక్రెటరీ రమాకాంత్ పటేల్ అన్నారు. త్వరలోనే పరిస్థితి మెరుగు పడుతుందనీ, తాము నిజాయితీపరులమని చెప్పారు. తమ పార్టీకి నిధులు లేవనీ, దీంతో అద్దె చెల్లించలేకపోయమాని అన్నారు. స్థానిక నిధులతో పార్టీ వ్యవహారాలు నిర్వహిస్తున్నామని, కార్యకర్తల ఆర్థిక పరిస్థితి సరిగా లేదని చెప్పారు."ఆప్ ఎంపీ కార్యాలయానికి తాళం పడింది. తర్వాత కాంగ్రెస్ వంతు" అంటూ మధ్యప్రదేశ్ బీజేపీ ప్రతినిధి నరేంద్ర సలూజా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమిపాలైన విషయం విదితమే. అక్కడ మొత్తం 70 సీట్లకు గాను బీజేపీకి 48 సీట్లు రాగా, ఆప్ 22 సీట్లను గెలుచుకుంది.

అనుకున్నదొకటి...అయ్యిందొకటి..!

చిక్కుల్లో వీహెచ్

అన్ని పార్టీల్లోని మున్నూరుకాపు నేతలతో భేటీ

అధిష్టానం సీరియస్

కులగణనపై విమర్శల పట్ల అసహనం

అర్థాంతరంగా ప్రెస్‌కాన్ఫరెన్స్ వాయిదా వేసుకున్న హన్మంతన్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ లాయలిస్టు. గాంధీ కుటుంబానికి వీరవిధేయుడైన మాజీ ఎంపీ వి. హనుమంతరావు రాజకీయ చిక్కుల్లో ఇరుక్కున్నారు. అప్పుడప్పుడు పార్టీ గీసిన గీతను దాటుతుంటారు. ముఖ్యమంత్రి, మంత్రులపై కూడా ఆయన బహిరంగంగా విమర్శలు చేస్తుంటారు. ఈ కారణంగా ఎన్నో సార్లు పార్టీ నేతల నుంచి తీవ్రవిమర్శలు కూడా ఎదుర్కొన్నారు. వీటన్నింటిని లెక్క చేయకుండా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూనే ఉంటారు. అలాంటి హన్మంతన్న తాజాగా అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆయన వివిధ పార్టీలకు చెందిన మున్నూరు కాపు సామాజిక తరగతికి చెందిన నాయకుల సమావేశాన్ని తన నివాసంలో ఏర్పాటు చేసినట్టు తెలిసింది. బీసీ కులగణనపై వారితో చర్చించడం ద్వారా పార్టీ ప్రతిష్ఠను పెంచాలనుకున్న ఆయనకు చేదు అనుభవమే ఎదురైంది. అనుకున్నదొకటి...అయ్యిందొకటి అన్నట్టు ఆయన ఏదో మంచి చేద్దామను కుంటే, సమావేశానికి వచ్చిన నేతలు బీసీ కులగణనను తప్పుపడుతూ తీవ్ర విమర్శలు చేసినట్టు తెలిసింది. దీంతో



వీహెచ్‌పై అధిష్టానం సీరియస్ అయినట్టు సమాచారం. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మానస పుత్రిక అయిన బీసీ కులగణనను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. దేశ వ్యాప్తంగా బీసీ కులగణనను అమలు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టినట్టు పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణనలో బీసీల జనాభా తగ్గిదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ఊతమిచ్చేలా వీహెచ్ వ్యవహరించారని అధిష్టానం మందలిం చినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం గాంధీభవన్‌లో జరగాల్సిన ప్రెస్‌కాన్ఫరెన్స్‌ను ఆయన అర్ధాంతరంగా వాయిదా వేసుకున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ (మున్నూరుకాపు సామాజికతరగతి) ప్రతిపాదనతో కులగణన చేసినందుకు ప్రభుత్వం పట్ల కృతజ్ఞత సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే, కొంతమంది నేతలు కులగణన సరిగా జరగలేదనీ, తమ సంఖ్యను తగ్గించినట్లుగా అభిప్రాయపడ్డారు. ఇకపోతే ఈ సమావేశంపై ఏఐసీసీ ఆరా తీసింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఈ భేటీపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలను పిలిచి, ప్రభుత్వాన్ని విమర్శించడం ఏమిటని ప్రశ్నించినట్టు సమాచారం. బీసీ కులగణన చేసిన ప్రభుత్వాన్ని అభినందించాల్సిన పరిస్థితుల్లో, విమర్శించడం సరైంది కాదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించాల్సిన ఈ సమావేశానికి ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలను పిలవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో మున్నూరు కాపు నేతల అసంతృప్తి, కాంగ్రెస్‌లో అసహనం స్పష్టంగా కనిపించింది. ఈ సమావేశం తర్వాత ఏఐసీసీ కామెంట్లు ఇప్పుడు స్థానిక కాంగ్రెస్ నాయకుల్లో ఆందోళన కలిగించాయి. పార్టీ పట్ల నిబద్ధత ఉన్న నేతలు మాత్రమే ముందుకు రావాలని, పార్టీ నియమాలను పాటించవలసిన అవసరం ఉందని అధిష్టానం సందేశం పంపినట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి.

అవగాహనతోనే ఆరోగ్యం

సరైన ఆహారం, సరైన పద్ధతిలో తీసుకోవాలి

బీపీ, షుగర్‌తోనే అనేక జబ్బులు

ప్రభుత్వ పామోలిన్ ఆయిల్ విషమే : డాక్టర్ గోపాలం శివ నారాయణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సరైన ఆహారాన్ని, సరైన పద్ధతిలో తీసుకోకపోవడమే అనేక రోగాలు రావడానికి కారణమని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ గోపాలం శివ నారాయణ తెలిపారు. రాజకీయేతర పౌర సంస్థ హైదరాబాద్ సిటీజన్స్ ఫోరం (హైదరాబాద్ జిందాబాద్) నిర్వహిస్తున్న బీపీ, షుగర్ ఉచిత మెడికల్ క్యాంపులు వంద నెలలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "బీపీ-షుగర్ వ్యాధులు, జీవనశైలిలో మార్పులు" అనే అంశంపై సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు ఫోరం ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపాలం శివ నారాయణ మాట్లాడుతూ నూనెలు, ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్స్ సమపాళ్లలో తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పామోలిన్ ఆయిల్ విషంతో సమానమన్నారు. నిజమైన గానుగ నూనె వాడాలని సూచించారు. ప్రతి ఫలమంటూ, ఫీజులంటూ డాక్టర్లు రోగులను దూరం పెట్టడం సరికాదన్నారు. ఎంబీబీఎస్ చదివిన వారు మాత్రమే డాక్టర్లు కాదనీ, రోగులకు సహాయపడే ప్రతి ఒక్కరూ డాక్టర్లే అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ విశ్వనగరం కావాలంటే విద్య వైద్యం, మౌలిక సదుపాయాలు అన్ని అందుబాటులోకి రావాలని సూచించారు. మానవత్వం లేని ఆర్థికాభివృద్ధి కడుపు నింపని బంగారు మెతుకులతో సమానమని అన్నారు. మానవత్వం, సమానత్వ భావనల కలయికే కమ్యూనిజమన్నారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి మాట్లా డుతూ అన్ని జబ్బులు రావడానికి హైబీపీ, డయాబెటిక్ కారణమని చెప్పారు. పెరుగుతున్న వ్యాధుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎన్సీడీ క్లినిక్‌లను ప్రారంభించిందని చెప్పారు. అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయనీ, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. సిటీజన్స్ ఫోరం సలహాదారు, ప్రముఖ ప్రజా వైద్యు రాలు డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ బీపీ, షుగర్ క్యాంపులు ఎంతో ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. ఈ వ్యాధులు కలిగిన వారు ఆర్థిక స్థోమత లేక మందులు రెగ్యులర్‌గా వాడటం మానేస్తే స్ట్రోక్స్, పక్షవాతం బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సాధారణంగా డాక్టర్లు రెండు, మూడు కాంబినేషన్స్‌తో రాసే మందుల ధరలు బయటి మార్కెట్లో రూ.2,000 నుంచి రూ.3,000 వరకు ఉంటాయని చెప్పారు. జనరిక్ మందులు పని చేయవనేది కేవలం అపోహేనని కొట్టిపారేశారు. అవి పని చేయవంటూ పేద రోగులకు రూ.వేలు ఖర్చు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి మందులను డాక్టర్ గోపాలం శివ నారాయణ రూ.100కే ప్రజలకు ఇస్తున్నారని కొనియాడారు. ప్రజలు జీవనశైలిని మార్చుకోవడానికి పేదరికం అడ్డు కాదని తెలిపారు. తమకున్నదాంట్లో మెరుగైన జీవనశైలిని అలవర్చు కోవడం సాధ్యమేనని స్పష్టం చేశారు. హైదరాబాద్ సిటీజన్స్ ఫోరం ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ రమాదేవి సూచనల మేరకు డాక్టర్ గోపాలం శివ నారాయణ సేవలను హైదరాబాద్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. అనంతరం నిర్వాహకులు సేవలం దిస్తున్న అతిథులను, డాక్టర్లను, వాలంటీర్లను సన్మానించారు. వాలంటీర్ హస్మిత వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సదస్సు ప్రారంభానికి ముందు హైదరాబాద్ జిందాబాద్ ఉపాధ్య క్షులు మల్లం రమేష్ ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమానికి పి. నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, మోహన్ నాయుడు, సంగీత, లలిత, నగేష్, సుకుమార్ శంకర్, గోపాల్, సైదులు, రమేష్, శంకరయ్య నాయకత్వం వహించారు.

రెండున్నరేండ్లలో మామునూరు విమానాశ్రయం పూర్తి

కేంద్రమంత్రులు కే రామ్మోహన్‌నాయుడు, జీ కిషన్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

చారిత్రాత్మకమైన ఓరుగల్లు పట్టణానికి విమాన సేవలను ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర విమనాయాన శాఖ మంత్రి కే రామ్మోహన్‌నాయుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. దీనికోసం మామునూరు (వరంగల్) విమానాశ్రయాన్ని భూసేకరణ పూర్తయిన రెండున్నరేండ్లలో పూర్తిచేస్తామని చెప్పారు. ఆదివారంనాడిక్కడి కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో వరంగల్ ఎయిర్‌పోర్టు ఆసియాలోనే అతిపెద్దదిగా ఉండేదనీ, 1981 వరకూ అక్కడ ఏదో ఒక కార్యకలాపాలు జరుగుతూ ఉండేవన్నారు. దేశానికి నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక పౌర విమానయాన రంగంలో విప్లవం మొదలైందనీ, చిన్న చిన్న నగరాలకు విమానాశ్రయాలు మంజూరు అయ్యాయని తెలిపారు. గడచిన పదేండ్లలో దేశంలో విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 150కి పెరిగిందని చెప్పారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు 2,800 మీటర్ల రన్ వే అవసరమనీ, 280 ఎకరాలు అదనంగా భూసేకరణ చేయాల్సి ఉంటుందని కేంద్రం నుంచి ప్రతిపాదనలు పంపామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా భూసేకరణ చేస్తే విమానాశ్రయం పనులు వేగవంతం అవుతాయనీ, శంషాబాద్ విమానాశ్రయం నుంచి నిరభ్యంతర పత్రానికి (ఎన్‌ఓసీ) కూడా క్లియరెన్స్ ఇచ్చామన్నారు. భద్రాద్రి విమానాశ్రయం విషయంలో గతంలో ఒక స్థలాన్ని ప్రతిపాదించారనీ, కానీ అది అనువుగా లేకపోవడంతో, మరో స్థలాన్ని ప్రతిపాదించారని తెలిపారు. దానిపై ఫీజిబులిటీని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. విమానాశ్రయం ఏర్పాటు వల్ల వరంగల్‌లో టెక్స్‌టైల్స్, విద్యారంగానికి అపారమైన అవకాశాలు లభిస్తాయని చెప్పారు. వరంగల్ విమానాశ్రయాన్ని ఉడాన్ స్కీమ్‌తో అనుసంధానం చేస్తూ, కమర్షియల్ ఆపరేషన్స్‌కు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో వరంగల్, భద్రాచలం, నిజామాబాద్, ఆదిలాబాద్ వంటి ద్వితీయశ్రేణి నగరాల్లో విమాన సదుపాయాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తుందనీ, దీనివల్ల పర్యాటకం, వాణిజ్యం అనుసంధానమవుతాయని వివరించారు.



నాటకరంగ కళాకారులకూ అవార్డులు

ఉగాది రోజు గద్దర్ ఫిలిం అవార్డుల ప్రదానం


త్యాగరాజ ఆరాధనోత్సవాల మాదిరే భక్త రామదాసు జయంతి ఉత్సవాలు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నాటకరంగ కళాకారులకు కూడా అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. దీనికోసం విధివిధానాల రూపకల్పన జరుగుతున్నదని చెపారు. రానున్న ఉగాది పండుగ రోజు సినీ కళాకారులకు గద్దర్ ఫిలిం అవార్డులు అందిస్తామనీ, నాటక కళాకారులకు కూడా అదే రోజు ఇవ్వాలా, లేక మరోరోజు అవార్డులు ప్రదానం చేయాలో త్వరలో నిర్ణయిస్తామని వివరించారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యాన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన భక్త రామదాసు జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. తిరువాయూర్‌లో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాల తరహాలో రాష్ట్రంలో భక్త రామదాసు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో కళలు, కళాకారులను ఆదరిస్తుందనీ, వారికి కావలసిన అన్ని రకాల వసతులు, సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. భక్త రామదాసు 392 జయంతి ఉత్సవాలను ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రముఖ సంగీత విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, కళారత్న పురస్కార గ్రహీతలు హైదరాబాద్ బ్రదర్స్ రాఘవాచారి, హైదరాబాద్ సిస్టర్స్ హరిప్రియ, ప్రేమా రామమూర్తి, కోవెల శాంత, డీవీ మోహన్ కృష్ణ తదితరులను శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి తెలంగాణ నాటక అకాడమీ చైర్మెన్ అలేఖ్య పుంజాల అధ్యక్షత వహించారు.

నవజాత శిశువులకు వినికిడి పరీక్షలు తప్పనిసరి

- డాక్టర్ సతీష్ సకినాల




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నవజాత శిశువులకు వినికిడి పరీక్షలను తప్పనిసరి చేయాలని ప్రముఖ ఆడియోలాజీ డాక్టర్ సతీష్ సకినాల సూచించారు. ప్రపంచ వినికిడి దినోత్సవం (మార్చి 3న) నేపథ్యంలో ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024లో దేశ వ్యాప్తంగా చేసిన ఒక అధ్యయనం ప్రకారం ప్రతి వెయ్యి మంది నవజాత శిశువుల్లో ఐదుగురు శాశ్వత వినికిడి లోపంతో జన్మిస్తున్నారని వెల్లడైందని చెప్పారు. టీకాల తరహా శిశువులకు తప్పనిసరిగా వినికిడి పరీక్షలను నిర్వహించాలనీ, తద్వారా వినికిడి సమస్యను ముందే గమనిస్తే తగిన వైద్య చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. ఆరోగ్యానికి సంబంధించి గ్లోబల్ జాయింట్ కమిటీ ఒక నెల వయస్సులో వినికిడి స్క్రీనింగ్, రెండు నెలల వయస్సులో ఆడియోలాజికల్ డయాగ్నసిస్ చేపట్టాలని సూచించిందని గుర్తుచేశారు. కొంత మంది దంపతులు మూడేళ్ల వరకు పిల్లలు మాట్లాడుతారని ఎదురు చూస్తారనీ, దీంతో ఆలస్యమై చికిత్స చేసే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకవేళ అప్పటికీ ఫలితం లేకపోతే వినికిడి యంత్రాలను అమరిస్తే శిశువు మాటలను వినగలుగుతారని తెలిపారు. వినికిడి ఉన్నట్టు ధృవీకరిస్తే ప్రభుత్వం అందజేసే పెన్షన్ పథకం అమలు చేస్తే ఆయా కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతుందని డాక్టర్ సతీష్ సకినాల సూచించారు. పెద్ద శబ్దాల నుంచి దాదాపు దూరంగా ఉండాలనీ, పెద్ద సభలు, సమావేశాల్లో వచ్చే శబ్దాల నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలనీ, వినికిడి పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.

'మోడల్ రాష్ట్రం'లో వెనుకబాటు

మోడీ ఇలాకాలో అసమానతలు | సామాజిక రంగాలకు తగ్గిపోతున్న కేటాయింపులు | బీహార్ కంటే దారుణం

ప్రధాని నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న గుజరాత్ పారిశ్రామికంగా వేగంగా పురోభివృద్ధి సాధిస్తోందన్న మాట నిజమే. అభివృద్ధికి ఆ రాష్ట్రాన్ని ఓ మోడల్‌గా చెప్పుకుంటారు. కానీ అక్కడ సామాజిక, ఆర్థిక అసమానతలు కూడా అధికంగానే ఉన్నాయి. ఆరోగ్య, విద్య, పేదరిక నిర్మూలన విషయాలలో కూడా గుజరాత్ వెనుకబడే ఉంది. ఆయా రంగాలలో బీహార్ ఎంత అధ్వాన్నమైన పనితీరు కనబరుస్తోందో గుజరాత్ కూడా అలాంటి పనితీరునే ప్రదర్శిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీహార్ సామాజిక వ్యయంపై దృష్టి సారిస్తున్నప్పటికీ వెనుకబడే ఉన్నదని తాజా అధ్యయనం తెలిపింది. క్రిస్టోఫ్ జాఫ్రెలాట్, విగ్నేష్ రాజమణి, నీల్ భరద్వాజ్ సంయుక్తంగా మూడు రాష్ట్రాల్లోని... బీహార్, గుజరాత్, తమిళనాడు... పరిస్థితులను విశ్లేషించి నివేదికను రూపొం దించారు. ఆయా రాష్ట్రాల్లోని సామాజిక ఆర్థిక వైరుధ్యాలు, పరిపాలనా విధానాలను వారు పోల్చి చూశారు.



న్యూఢిల్లీ : దేశంలోని సంపన్న రాష్ట్రమైన గుజరాత్‌తో పోలిస్తే బీహార్ చాలా వెనుకబడిన రాష్ట్రం. గుజరాత్‌లో తలసరి ఆదాయం ఎక్కువ. అక్కడ మూలధన ప్రోత్సాహక పరిశ్రమలు, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూలమైన విధానాల కారణంగా పారిశ్రామికాభివృద్ధి వేగంగా జరుగుతోంది. అయితే విద్యపై ప్రభుత్వ వ్యయం తక్కువగా ఉండడంతో అసమానతలు కన్పిస్తున్నాయి. సామాజిక వ్యయానికి ఆయా రాష్ట్రాలు ఇస్తున్న ప్రాధాన్యతలను నివేదిక ప్రస్తావించింది. 'వనరులు అరకొరగా ఉన్నప్పటికీ సామాజిక వ్యయం విషయంలో బీహార్ ముందంజలో ఉంది. తమిళనాడు అంతకంటే ఎక్కువగానే ఖర్చు చేస్తోంది. ఈ రెండు రాష్ట్రాలకు భిన్నంగా గుజరాత్ బాగా వెనుకబడింది. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం వంటి సామాజిక రంగాలకు గుజరాత్ బడ్జెట్‌లో కేటాయింపులు చాలా తక్కువగా ఉంటున్నాయి. తమిళనాడు కంటే సరే...బీహార్ కంటే కూడా అవి తక్కువే' అని నివేదిక తెలిపింది.

ఉదాహరణకు ప్రజారోగ్య విధానాన్నే తీసుకుంటే... గుజరాత్ సంపన్న రాష్ట్రమే అయినప్పటికీ దానిపై చేస్తున్న ఖర్చు తక్కువే. 2012-13, 2019-20 మధ్య కాలంలో ఆరోగ్య రంగంపై గుజరాత్ పెట్టిన ఖర్చు కేవలం 10.5 శాతం మాత్రమే పెరిగింది. అదే బీహార్ చేసిన వ్యయం 29.5 శాతం పెరగడం గమనార్హం. తమిళనాడులో ఈ వ్యయం 20.5 శాతం...అంటే గుజరాత్ పెట్టిన ఖర్చు కంటే రెట్టింపు పెరిగింది. సామాజిక రంగాలపై బీహార్ చేసిన ఖర్చు హిందీ బెల్ట్‌లో దానికో స్థానాన్ని కల్పించింది. 'బీహార్ తన జీఎస్డీపీలో సామాజిక రంగాలకు గణనీయమైన కేటాయింపులు జరిపింది. 2021-22లో ఇవి 22.25 శాతానికి చేరాయి.

వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ అభివృద్ధి వ్యత్యాసాలను పూడ్చడంపై ఆ రాష్ట్రం పెడుతున్న శ్రద్ధకు ఇది నిదర్శనం. గుజరాత్ వైఖరి దీనికి భిన్నంగా ఉంది. ఆ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల వృద్ధి బాగానే ఉన్నప్పటికీ సామాజిక రంగాలపై పెట్టిన ఖర్చు తక్కువగానే ఉంది. 2021-22లో ఆ రంగాలకు గుజరాత్ పెట్టిన ఖర్చు జీఎస్డీపీలో కేవలం 4.46 శాతం మాత్రమే. మానవాభివృద్ధిపై దృష్టి సారించిన తమిళనాడు సామాజిక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉంది. ఆ కాలంలో సామాజిక రంగాలపై చేసిన వ్యయం 4.90-6.01 శాతం మధ్యన ఉంది' అని నివేదిక వివరించింది. తన తోటి దక్షిణాది రాష్ట్రాల మాదిరిగానే తమిళనాడు కూడా సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చింది. మౌలిక సదుపాయాల వృద్ధికి గుజరాత్ మోడల్ పనికి రాకుండా పోయింది. మౌలిక సదుపాయాలు, పరిశ్రమకు సంబంధించి గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలకు సామీప్యతలు ఉన్నాయి. విద్యుదుత్పత్తి, రహదారుల విషయంలో తమిళనాడు కంటే గుజరాత్ మెరుగైన ఫలితాలు సాధించింది. నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రోడ్లను అభివృద్ధి చేశారు. అయితే పోషకాహార లోపం, పేదరికం వంటి అనేక అంశాలలో గుజరాత్, బీహార్ ఒకేలా ఉన్నాయి. విద్య కూడా అంతంత మా త్రమే. ఆంగ్ల మీడియం విద్య గురించి ఎంత తక్కువ చెప్పు కుంటే అంత మంచిది. తమిళనాడు రాష్ట్రం పేదరికాన్ని దాదాపుగా నిర్మూలించింది. పారిశ్రామికీకరణ వేగవంతం అవుతోంది. పరిశ్రమ నుండి అనేక సేవలు లభిస్తున్నాయి. గుజరాత్‌లో ఇవేమీ కన్పించవు.



జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఉద్రిక్తత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలోఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి సంఘం ఎన్నికల తేదీలను వెంటనే ప్రకటించాలని స్టూడెంట్స్ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల నిరసన హింసాత్మకంగా మారింది. ఉపాధ్యాయ సంఘం కార్యాలయాన్ని వారు ముట్టడించి నిప్పంటించారు. దీంతో యూనివర్సిటీలో పరిస్థితులు అదుపుతప్పాయి. మార్చి 1న విద్యా శాఖ మంత్రి బ్రాత్య బసు, జాదవ్ యూనివర్సిటీని సందర్శించారు. విద్యార్థులు ఆయన వాహనాన్ని చుట్టుముట్టి దాడి చేశారు. కారు బానెట్‌ను ధ్వంసం చేశారు. దానిపై బ్రోకర్ అని రాశారు. వాహనంపైకి బూట్లు విసిరారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో మంత్రి బసు రెండు గంటలపాటు వాహనంలో చిక్కుకుపోయారు. పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులు ఇబ్బందిపడ్డారు. మరోవైపు మంత్రి కాన్వాయ్ ముందుకు కదలడంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. దీంతో స్టూడెంట్స్ మరింత రెచ్చిపోయారు. మంత్రి బసు కారు విండోను ధ్వంసం చేశారు. దీంతో అద్దం పగలడంతో మంత్రి బసు ఎడమ చేతికి గాయమైంది. ఆయనను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యూనివర్సిటీలో జరిగిన విధ్వంసకర సంఘటనలపై పోలీసులు ఏడు కేసులు నమోదు చేశారు. ఆదివారం ఒకరిని అరెస్ట్ చేశారు. విద్యార్థులను రక్షించడంలో యూనివర్సిటీ యాజమాన్యం విఫలమైందని స్టూడెంట్ సంఘాలు ఆరోపించాయి. విద్యా శాఖ మంత్రి బసు రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. మార్చి 3న పెద్ద ఎత్తున నిరసనకు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు ఎలాంటి విఘాతం కల్పించబోమని విద్యార్థి సంఘాలు తెలిపాయి. అయితే యూనివర్సిటీలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీగా పోలీసులను మోహరించారు.

మారుతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేష్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట్

గోల్నాక డివిజన్ మారుతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బీఆర్ఎస్ నాయకుడు ఏ. సురేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బస్తీవాసులు సమావేశమై సురేష్ గౌడ్ పేరును ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సురేష్ గౌడ్‌తో కలిసి జులూష్ తీశారు. బస్తీ వాసులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు బాలకిషన్, మాధవరెడ్డి, మోహన్ రెడ్డి, రాజులు, రమేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ ప్రారంభ దినోత్సవం ముస్లిం సోదరుల ఉపవాసా సందర్భంగా మోసిన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అంబర్‌పేటట్ కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్, నాయకులు మధుసూదన్ రెడ్డి, దావూద్, అజార్, సలీం, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్ తదితరు నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-అంబర్‌పేట్

రంజాన్ వేళలు

ఇఫ్తార్: సోమవారం సాయంత్రం : 6.23 గం.
సహర్: మంగళవారం ఉదయం : 5.19 గం.

వెరిఫికేషన్ షురూ..

- ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేయనున్న సిబ్బంది
- జిల్లాలో విచారణ చేయాల్సిన దరఖాస్తులు 1.35లక్షలు
- మరో లక్షకుపైగా మ్యుటేషన్స్ కోసం వచ్చిన దరఖాస్తులు
- అరకొర సిబ్బందితో సర్వే ఎలా? అధికారుల హైరానా..!

నేటి నుంచి రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి మరో కీలక అడుగు పడనుంది. ఇప్పటివరకు మీ సేవా కేంద్రాల ద్వారా కొత్త ఎఫ్ఎస్‌సీ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరించిన ప్రభుత్వం.. వాటి క్షేత్రస్థాయి విచారణకు చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించింది. ఈమేరకు సంబంధిత అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సోమవారం నుంచి కొత్త రేషన్ కార్డుల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులపై ఇంటింటికి వెళ్లి విచారణ జరపాలని నిర్ణయించారు. హైదరాబాద్ జిల్లాలోని సర్కిళ్ల వారిగా దరఖాస్తులదారుల అర్హతల పరిశీలనపై సివిల్ సప్లయ్ అధికారులు, సిబ్బంది విచారణ జరపనున్నారు. ఇందులో భాగంగా ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లనున్నారు. అనర్హులకు చెక్‌పెట్టే విధంగా ప్రధానంగా దరఖాస్తుదారుల స్థితిగతులపై ఆరా తీయనున్నారు. ఇంట్లో వస్తువులు దగ్గర నుంచి కారు, బైక్, ఇతర ఖరీదైన వస్తువులతో పాటు విద్యుత్ బిల్లు వివరాలు నమోదు చేయనున్నారు. అదేవిధంగా ఇంటి యాజమాని ఫోన్ నంబర్, కుటుంబ సభ్యుల పేర్లు, వారి నెలవారి ఆదాయ వివరాలు సైతం నమోదు చేయనున్నారని, విచారణకు వచ్చినప్పుడు దరఖాస్తుదారు అందుబాటులో లేకుంటే ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకోనున్నారు.

హైదరాబాద్ పరిధిలో మొత్తం 9 సర్కిల్ కార్యాలయాలుండగా.. వాటి పరిధిలో ఇప్పటివరకు 1.35లక్షల దరఖాస్తులు కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చాయి. ఇలా వచ్చిన దరఖాస్తులను ఆయా సర్కిళ ఆధారంగానే విచారణ చేపట్టనున్నారు. ఈ ప్రక్రియను సివిల్ సప్లయ్‌కు చెందిన ఆర్ఐలు, ఇతర అధికారులు పర్యవేక్షించనున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయి పరిశీలనకు పెద్దసంఖ్యలో సిబ్బంది అవసరం ఉంటుంది. ప్రస్తుతం సివిల్ సప్లయ్‌కు చెందిన తొమ్మిది సర్కిల్ కార్యాలయాల్లో సిబ్బంది సంఖ్య 80లోపే ఉందని సమాచారం. వారంతా ఎప్పుడు ఈ లక్షకుపైగా కొత్త కార్డుల సర్వే.. మరో లక్ష మ్యుటేషన్స్‌కు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తిచేస్తారో అర్థం కావడంలేదు. అదే సమయంలో పాత కార్డుల్లోని పేర్లు తొలగింపు ప్రక్రియ సైతం కొనసాగించాల్సిందే. రోజుకు వందలాది మందికి సంబంధించిన డిలిట్ ప్రక్రియ జరుగుతున్నా.. పాతబస్తీ లాంటి ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. పాత కార్డుల్లో పేర్లు డిలిట్ అయితేనే కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకోనే వీలుంటుంది. కాబట్టి ఈ పనులకు సిబ్బందిని సర్దుబాటు చేయాలి. కాగా ఈ మూడు పనుల్లో ఏ ఒక్క పని ఆపొద్దని పైనుంచి ఆదేశాలు ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఫీల్డ్ వేరిఫికేషన్ ప్రారంభంపై సంబంధిత జిల్లా హైరానా పడుతున్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌పై ఒక ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. అందుకోసం సోమవారం ఉదయం మరోసారి సమావేశమై.. ఎఫ్ఎస్‌సీ కార్డుల ఫీల్డ్ వెరిఫికేషన్ ఎలా చేపట్టాలి.. ఉన్న సిబ్బందితో ఎలా ప్లాన్ చేసుకుని.. ముందుకు వెళ్లాలనే దానిపై అధికారులు ఒక్క క్లారిటీకి రానున్నారు. ఆ తర్వాతే క్షేత్రస్థాయి పరిశీలన వెళ్లనున్నారు. అదే సమయంలో సర్వేకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ సిబ్బంది కేటాయింపు విషయాన్ని ఉన్నతాధికారుల అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నారు.

కార్డు ఉంటేనే.. ప్రభుత్వ పథకాలు..!

కొత్తగా రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుని.. లక్షలాది మంది ఏండ్ల నంది ఎదురుచూస్తున్నారు. ఏండ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా కొత్త కార్డులు మంజూరు కావడంలేదు. ఆరోగ్య శ్రీ, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికేట్, పింఛన్ తదితర పథకాలకు అన్నింటికి రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దీంతో రేషన్ కార్డులు లేక వేలాది మంది అర్హులు వీటిని పొందలేకపోతున్నారు.

ఫలితంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు దూరం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఏటా కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరిగిపోతోంది.. తప్ప తగ్గడం లేదు. ఇక కొత్త కార్డుల కథ ఇలావుంటే.. మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకొన్నవారి పరిస్థితి మరింత అధ్వానం. ఏదేమైనప్పటికీ నేటి నుంచి రేషన్ కార్డుల దరఖాస్తుల విచారణ చేపడుతున్న నేపథ్యంలో ఏండ్లుగా కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ఇది కొంత ఊరట కలిగించే విషయమే. కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే సంబంధిత అధికారులు అర్హులైన లబ్ధిదారులకు త్వరలో కార్డులు మంజూరు చేయనున్నారు.

పాన్ డబ్బాలో అగ్ని ప్రమాదం



- ఒక సిలిండర్ నుంచి ఇంకో సిలిండర్‌కు గ్యాస్ మార్పిడి చేస్తుండగా ఘటన

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

ఉప్పుగూడ జెండా బంగారు మైసమ్మ వైన్స్ ముందు గల పాన్ డబ్బాలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పాన్ డబ్బా పూర్తిగా ధ్వంసమైంది.

పాన్ డబ్బాలలో ఉపయోగించే లైటర్‌లలో ఉండే గ్యాస్‌ను ఫిల్ చేసి ఇవ్వడానికి ఒక పెద్ద సిలిండర్ నుంచి పాన్ డబ్బా దారుల తమవద్ద ఉన్న ఒక చిన్న సిలిండర్లకి మార్చుకొని ఆ చిన్న సిలిండర్‌ను పాన్ డబ్బాలలో ఒక పక్కన పెట్టుకుని లైటర్లలో గ్యాస్ ఫిల్ చేసి ఇస్తూ ఉంటారు. ఇది అక్రమంగా జరుగుతున్న వ్యవహారం. ఇలా చేయడం వల్ల గతంలో ఎన్నో పాన్ డబ్బా లలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అయినా వీటికి అడ్డుకట్ట పడడం లేదని ప్రజలు అంటున్నారు. తాజాగా ఉప్పుగూడ జెండా బంగారు మైసమ్మ వైన్స్ ముందు గల పాన్ డబ్బాలో ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌కు గ్యాస్ మార్పిడి చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటల ఎగిసిపడ్డాయి. మార్పిడి చేస్తున్న వ్యక్తి తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ ప్రమాదంలో పాన్ డబ్బా పూర్తిగా ధ్వంసమైంది. ఇలాంటి ఘటనలు జరగడం వల్ల ప్రాణాపాయం ఉందని ఇలాంటి జరగకుండా చూసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డిజిటల్ టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకుని వ్యాపార రంగంలో విప్లవాత్మకమైన మార్పులతో పురోగతిని సాధించాలని వక్తలు సూచించారు. కింగ్ కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఎంబ్రాసింగ్ ద డిజిటల్ ఏజ్ స్ట్రాటజీస్ ఫర్ ట్రాన్స్ ఫార్మింగ్ బిజినెస్ అండ్ బిల్డింగ్ రిసెలెంట్ ఈకో సిస్టమ్స్ అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీటీఓ రీసస్టైన బుల్ లిమిటెడ్ గ్లోబల్ ఛీఫ్ హెచ్ఎర్ ఆఫీసర్ డా.సుజీవ్ నాయర్, ఓయూ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం అధిపతి వై.జహంగీర్ పాల్గొన్నారు. వారు డిజిటల్ టెక్నాలజీని అన్వయించుకుని వ్యాపారాల అభివృద్ధి పాత్రపై ప్రసంగించారు. సాంకేతికత పురోగతితో వేగంగా ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, హ్యూమన్ రీసోర్సెస్ మేనేజ్మెంట్ వంటి పరిశ్రమలలో విప్లవాత్మక మార్పులను చేసుకుని సామర్థ్యాన్ని పెంచుకోవలసిన అంశాలపై లోతైన విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. స్థిరమైన పద్ధతులను అవలంభిస్తూ.. వ్యాపారాలు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రకృతి దృశ్యానికి ఎలా ఉంటాయనే దానిపై సదస్సులో పాల్గొన్న నిపుణులు తమ జ్ఞానాన్ని అనుభవాన్ని పంచుకున్నారు. నిపుణులు డా. సీమ నజీనీన్, వినోద్ జేమ్స్, యోగేశ్, శ్రీనివాస్ దుల్పల, డాక్టర్ ప్రమాద వర్శవి, ప్రొఫెసర్ ఎ. పాట్రిక్, డేవిడ్ మారియో, అనురాధారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కె. మర్రెడ్డి, ప్రిన్సిపాల్ ఆంటోనీ సాగయరాజా, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ప్రణీత, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ నగునూరి శ్రీనివాస్, ప్రొఫెసర్ అనిత పాల్గొని ప్రసంగించారు.



'కౌన్సిలింగ్ రంగంలో వినూత్న ఆవిష్కరణలు చేపట్టాలి'



- తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కౌన్సిలింగ్ రంగంలో వినూత్న ఆవిష్కరణలు చేపట్టవలసిన అవసరం ఉందని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్ నగర్ లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ లో అసోసియేషన్ రాష్ట్ర, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకాలజిస్టులు సమాజంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు తమ కౌన్సిలింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఇందుకుగాను కౌన్సిలింగ్ నందు వినూత్న ఆవిష్కరణలకు పరిశోధనలు చేయాలని సూచించారు.తమ సంఘం సభ్యుల నైపుణ్యాల పెంపుదలకు నిరంతరంగా శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10 నుంచి 13 వరకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 వరకు హైదరాబాద్ నందు 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' (శిక్షకుల శిక్షణ) ఈ శిక్షణ రెండు తెలుగు రాష్ట్రాల్లోని సైకాలజిస్టు, శిక్షకులు కావాలనుకునే వారికి ప్రత్యేకంగా నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో అందిస్తున్నామన్నారు.ప్రతి సైకాలజిస్టు నాయకత్వ లక్షణాలతో ఒక శక్తిగా ఎదగాలని, సమాజంలో పెట్రేగిపోతున్న విపరీత ధోరణులపై వెంటనే ప్రతి సైకాలజిస్టు స్పందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్ర మంలో అసోసియేషన్ రాష్ట ఉపాధ్యకులు ఎ.సుధాకర్, ఉమర్ ఖాన్, సంయుక్త కార్యదర్శులు రాజు ఆచార్య, డా.శశి కిరణ్, శ్రీపూజ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కృష్ణ సాహితీ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డా.నందూరి అర్చన, నాయకులు వైదేహి దలాల్, ఎం.రవీందర్, ఆర్. సునయన, దేదీప్య, రెబెక, శ్రీధర్, రోజా, అనిత, సోనాలి తదితరులు పాల్గొన్నారు.

మూగ చిన్నారులకు మాటలు నేర్పుతా..

- కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ దవాఖాన
- నేడు ప్రపంచ వినికిడి దినోత్సవం
- 15 లక్షల నుంచి 20 లక్షలు విలువచేసే ఆపరేషన్ ఉచితం...





నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మూగ చిన్నారుల్లో వెలుగులు నింపుతూ వారి జీవితంపై ఆశలు కల్పిస్తూ మూగ చిన్నారులకు నేను మాటలు నేర్పుతా అంటుంది కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టీ దవాఖాన. నేడు ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఈఎన్‌టీ ఆస్పత్రిపై ప్రత్యేక కథనం. తల్లి గర్భంలో ఐదవ వారం నుండే వినికిడి మొదలవుతుంది. పుట్టగానే పిల్లలు శబ్దాలకి ఉలిక్కి పడుతుంటారు. ఆరు నెలలు వచ్చేసరికి శబ్దానికి కదలికలు చేస్తారు. ఈ కాలంలో వినికిడి లోపం ఉందా లేదా అనేది వాళ్ళ కదలికల బట్టి తెలుస్తుంది. ఈ కాలంలో వినికిడి లోపం పిల్లల్లో ఉన్నట్టు కనిపిస్తుంది. పుట్టగానే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాలన్నారు. పిల్లల్లో వినికిడి ఎలా ఉంది అనేది, చిన్న ఇబ్బంది ఉన్న, మూడు నెలల తర్వాత బీరా టెస్ట్ ద్వారా వినికిడి లోపం ఏ స్థాయిలో ఉంది అనేది తెలుస్తుంది. వినికిడి లోపాన్ని పూర్తిస్థాయిలో గుర్తించవచ్చు. చిన్నారు లకు వినికిడి సంబంధించిన పరికరం ఆడియాలజిస్ట్ పరీక్ష చేసి తొందరగా గుర్తించి వారికి వినికిడి పరీక్ష తర్వాత చిన్న పిల్లలకు పూర్తిగా వినిపించట్లేదు అంటే కాంక్లియర్ ఇంప్లాంట్ అనే ఆపరేషన్‌ను ప్రభుత్వ ఆరోగ్యశ్రీలో మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు, సీఎంఆర్ఎఫ్ లో మూడు సంవత్సరాల పైబడిన చిన్నారులకు చేస్తారు. దాదాపు రూ.15 నుంచి 20 లక్షల విలువ చేసే ఆపరేషన్ ను ప్రభుత్వం ఉచితంగా చేస్తోంది. మూగ చిన్నారుల్లో మాటలు థెరపి (ఏవిటి) ఆడియో వీడియో తీసుకోవాలి. ఆపరేషన్ 20 శాతం, మిగతా 80 శాతం అంతా ఆడిటరీ వర్బువల్ థెరపీ మీద బాబు, పాప మాట్లాడే విధానం ఉంటుంది. థెరపీ సరిగ్గా తీసుకుంటే మామూలు పిల్లల్లాగానే మాట్లాడుతారు. ఈ సర్జరీ చెవిటి పిల్లలకి ఒక వరం. అందరి తల్లిదండ్రులకి వాళ్ల పిల్లల్ని మామూలు పిల్లల్లాగా చూసే ఒక అదృష్టం. వినికిడి లోపం 100 శాతం కాకుండా కొంతమంది పిల్లలు 50 శాతం వస్తుంది. ఏ కారణం చేతనో ఈ లోపం ఉంటే వినికి డి యంత్రాల ద్వారా 50 శాతం నివారించవచ్చు. వినికిడి సమస్యతో బాధప డుతున్న పిల్లల తల్లిదండ్రులకు విజ్ఞప్తి.. పిల్లలకు వినికిడి సమస్య ఉందని గుర్తిస్తే తల్లిదండ్రులు వెంటనే మీ పిల్లలకు కాంక్లియర్ ఆపరేషన్ ద్వారా వినికిడి యంత్రాలు పెట్టి మాటల థెరపి ద్వారా మామూలు పిల్లల వలె మాట్లాడ తారని కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి ఆడియాలజిస్ట్ డాక్టర్ డీకే వీణ తెలిపారు.

అంబేద్కర్ స్థాయిని కుదించే ప్రయత్నాలు మానుకోవాలి

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అంబేద్కర్ స్థాయిని కుదించే కుట్రపూరిత ప్రయత్నాలను మానుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని, బాబు జగ్జీవన్ రామ్ జయంతితో కలిపి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయడాన్ని తమ పార్టీ, జాతీయ కమిటీ వ్యతిరేకిస్తుందని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉత్సవాలను బాబు జగ్జీవన్ రామ్ జయంతితో కలిపి నిర్వహించే ప్రయత్నం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దేశం, పీడిత ప్రజల హక్కుల కోసం తన కుటుంబం, ఆయన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడి జయంతిని, గాంధీ కాంగ్రెస్, మనువాద దోపిడీ పాలక వర్గానికి ప్రతినిధిగా ఉన్న బాబు జగ్జీవన్ రామ్ జయంతితో ముడిపెట్టి ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహించడమంటే అంబేద్కర్ ను అవమానించడమేనని అన్నారు. ఐక్య రాజ్య సమితి ఆధ్వర్యంలో ఆయన జయంతి ఏప్రిల్ 14న ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా పాటిస్తూ 193 సభ్య దేశాలు పిలుపునిస్తుంటే తెలంగాణలో మాత్రం ఆయన స్థాయిని తక్కువగా చూపే ప్రభుత్వ ప్రయత్నాలు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఈసారి అంబేద్కర్ జయంతిని రాష్ట్ర సీఎం అధ్యక్షతన, కేంద్రంలో ప్రధాని అధ్యక్షతన నిర్వహించాలని, ఉత్సవ కమిటీల్లో కుల సంఘాల ప్రమేయాన్ని నిలువరించాలని, ఉత్సవాల నిర్వహణకు రాష్ట్రంలో రూ.500 కోట్లు, కేంద్ర స్థాయిలో రూ.5,000 కోట్లు కేటాయించి, ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

ఇంటి అద్దెదారుపై యజమాని దాడి..!

- విలువైన వస్తువులను ఇంటి యజమాని దోచుకున్నాడు : బాధితుడు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇంటి యజమాని తనపై దాడి చేయడమే కాకుండా తాను రెండు రోజులు ఇంట్లో లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి తనకు చెందిన విలువైన వస్తువులు, డబ్బు, బంగారు ఉంగరం ఇతర వస్తువులు దోచుకున్నారని ఇంటి అద్దెదారు, బాధితుడు పెండ్యాల సుచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హిమాయత్ నగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితుడు పెండ్యాల సుచంద్రరావు మాట్లాడారు. బంజారాహిల్స్, ఎన్ బీటీ నగర్‌లో ఉండే ఇంటి యజమాని డి.శ్రీకాంత్ తన వద్ద రూ.40 వేలు అప్పుగా తీసుకున్నాడని తెలిపారు. అయితే డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే తనపై దాడి చేయడమే కాకుండా తాను లేని సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి రూ.31,200, ఒక చేతి బంగారు ఉంగరం, కంప్యూటర్, లాప్ టాప్, ఓవెన్ వంటి ఇతర విలువైన వస్తువులు సైతం దోచుకున్నారని ఆరోపించారు. యజమాని నుంచి తనకు ప్రాణభయం ఉందని, దాని కారణంగా తాను ఇంటికి వెళ్లడం లేదన్నారు. ఈ విషయమై బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు విచారణ పేరుతో తన ముందే యజమానితో లాలూచీపడి తనను బెదిరించి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరించారని వాపోయాడు. ఈ విషయంలో నగర పోలీస్ కమిషనర్ ను ఆశ్రయించనున్నట్టు సుచంద్రరావు తెలిపారు. ఇంటి యజమాని డి.శ్రీకాంత్ వల్ల తనకు ప్రాణహాని ఉందని, పోలీసులకు చెప్పినా వారు పెడచెవిన పెట్టి దొంగకే మద్దతుగా నిలిచారని దుఃఖ పర్యాంతమయ్యారు.వెంటనే యజమానిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

మహిళలకు సహనం, ఓపిక ఎక్కువ...



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మహిళలకు సహనం, ఓపిక ఎక్కువగా ఉంటుందని కంటి వైద్య నిపుణురాలు శిరీష తెలిపారు. ఆదివారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. సృష్టికి ప్రతి సృష్టినిచ్చి సమాజానికి మార్గ నిర్దేశనం చేసేది మహిళ అన్నారు. సంసార సాగరంలో ఓర్పుకు, నేర్పుకు, ఓదార్పులో అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా ఆత్మీయతతో అనురాగాన్ని పంచుతుందన్నారు. మహిళలు ముఖ్యంగా విద్యను అభ్యసించాలన్నారు. మారుతున్న మరమనుషుల కాలంలో మానవత్వం రోజురోజుకు మంటగలుస్తున్న రోజుల్లో మహిళ తాను ఉన్నతంగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతి రంగంలో మహిళ ఉన్నత శిఖరాల వైపు పయనించాలని తెలిపారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళి



నవతెలంగాణ-ధూల్‌పేట్

మాదిగ అమరవీరుల సంస్మరణ దినంను పురస్కరించుకొని లంగర్ హౌస్ డివిజన్ ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల దగ్గర ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కుమ్మరి సత్యనారాయన మాదిగ, సానేం ప్రకాశ్ మాదిగ, వి యస్ రాజు మాదిగ, విష్ణు మాదిగ, మిర్యాల నవీన్ కుమార్ మాదిగ, చంద్ర మోహన్ మాదిగ, భోగి బాల్ రాజ్ మాదిగ, అశోక్ మాదిగ, శైలెందర్ మాదిగ, బీజేపీ సీనియర్ నాయకులు చేరుకుల ఉదయకుమార్, అల్వాల ఇంద్రసేనా రెడ్డి, ఆనంద్, జెన్న సుధాకర్, ఎంఐఎం నాయకులు మాతంగి రమేష్ కుమార్, సునంద, భోగి మహేష్ , బోగీ బాలక్ దాస్ తదితరులు పాల్గొన్నారు

ఏప్రిల్ 14 నుంచి జాతీయ ప్రచారోద్యమం

- డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నుంచి జాతీయ స్థాయిలో దళిత బహుజన హక్కుల సాధికారత ప్రచారొద్యమం చెపడుతున్నట్టు డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ తెలిపారు. ఆదివారం డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ ఎస్టీ బిసి సంక్షేమం, అభివృద్ధి, రక్షణ,బడ్జెట్ ,భూమి ఉపాధి,విద్య,కులగణన పై జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సు లో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ దేశంలో మెజారిటీ ప్రజలైన ఎస్సీ ఎస్టీ బీసీల పై తరతరాలుగా వివక్ష అణచివేత దోపిడి అన్యాయాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలులో పాలకులు నిర్లక్ష్యం, వివక్ష కొనసాగిస్తున్నారన్నారు.బడ్జెట్ కేటాయింపులలో ఖర్చులలో తద్వారా సంక్షేమం అభివృద్ధి లో ఆమడ దూరానికి నెట్టి వేస్తున్నారని తెలిపారు .ఇటివల కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లలో అణగారిన వర్గాలకు అన్యాయం చెసి కార్పొరేట్ శక్తులకు బాసటగా నిలిచారన్నారు. దేశ సంపదన అదాని,అంబానిలకు దొచి పెడుతున్నారన్నారు. ఉపాధి హమి పరిశోధకులు చక్రధర బుద్ద మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హమి కి నిధులు తగ్గిస్తున్నారన్నారు. కూలీల డిమాండ్ కు అనుగుణంగా బడ్జెట్ పెంచాలన్నారు. సంక్షేమం హక్కు అని సామాజిక భద్రత, ఆహర భద్రత ను అమలు చేయాలన్నారు. న్యాయవాది కొరివి వేణు గోపాల్ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వాలను మారుస్తున్నారని సామాజిక సంఘాల కీలక పాత్ర పోషించాలన్నారు. ఐక్య ఉద్యమాలను చేపట్టాలన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చెస్తూ.కుల,మత విద్వేషాలను పెంచుతు సమాజంలో శాంతి సామరస్యం, రక్షణ లను లేకుండా చేస్తున్నాయన్నారు.తెలుగు రాష్ట్రాలలో సైతం ఎస్సీ ఎస్టీ, బీసీల పై సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తున్నారని చెప్పారు. విద్యకు 15 శాతం బడ్జెట్ ను కేటాయించాలన్నారు. సామాజిక భద్రత చట్టాలను సక్రమంగా అమలు చెయాలని, కొత్త రెషన్ కార్డులను జారీ చేయాలన్నారు. చేవెళ్ళ ఎస్సీ,ఎస్టీ,కామారెడ్డి ల బీసీల డిక్లరేషన్ లను అమలు చేయాలని సదస్సు డిమాండ్ చేసిందని తెలిపారు. ప్రొఫెసర్ పట్టా వేంకటేశ్వర్లు, టీవీయూవీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటయ్య , డీబీఎఫ్ తెలంగాణ, ఏపీ అధ్యక్షులు రౌతు రమేష్, పూర్ణ చందరగ రావు, ఏపీ,తెలంగాణ డీబీఎఫ్ నాయకులు వేమగిరి నరసింహ మూర్తి,చెంగల్ రావు,పులి కల్పన,దుబాషి సంజీవ్,చుంచు రాజెందర్, దాసరి ఎగొండ స్వామి ,శారద ఉమ పాల్గొన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పరిధిలోని కేటీఆర్ కాలనీ వాస్తవ్యులు కొలన్ తులసి రెడ్డి ఆత్మీయులు సందీప్ మాదాల ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి కాలుకి ఆపరేషన్ చేయించుకున్నారు. వారిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. వారి ఇంటికివెళ్ళి పరామర్శించి ఆపరేషన్ వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలన్నారు. వారితో పాటు కాలనీ వాసులు ఏలూరి సత్య (నాని),పంగా శ్రీనివాసరావు, కోయన రామకృష్ణ,కోడూరి వెంకట్,శుధీర్ వర్మ,అల్లూరి రాజు,రేణుబాబు,వేమూరి నాగరాజు,రాఘవ తదితరులు ఉన్నారు. నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం పరిధిలోని పారడైజ్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన జర్నలిస్టు కుమార్తె వివాహానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోలన్ హనుమంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

కుటుంబాల సంక్షేమంలోనూ ముందున్న జర్నలిస్టులు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

ప్రజా సమస్యలు వెలుగులోకి తీసుకొస్తూ పరిష్కారం చూపిస్తున్న కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు వారి కుటుంబాల సంక్షేమంలోనూ ముందున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, సింగిరెడ్డి దన్‌పాల్ రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన చైతన్య కార్యక్రమాలతో పాటు జర్నలిస్టుల కుటుంబాలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం గ్రేటర్ హైదరాబాద్ లోనే ఆదర్శంగా ఉందని పేర్కొన్నారు. తన వంతుగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కుషాయిగూడ సబ్ ఇన్‌స్పెక్టర్ రాములు, చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు పద్మారెడ్డి, నాయకులు కాసం మైపాల్ రెడ్డి, బొజ్జ రాఘవ రెడ్డి, కుమారస్వామి,రహీం కొండూరి మురళి పంతులు ఏనుగు సీతారాంరెడ్డి గగన్, గంప కష్ణ, మొగిలి రాఘవరెడ్డి కాప్రా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐస్ క్రీమ్ పార్లర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

డా. ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని కమలా నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐస్ క్రీమ్ పార్లర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలోకార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు , బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి , డివిజన్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, మాజీ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



విశ్వం ఎడుటెక్ ఆధ్వర్యంలో 18వ స్కిల్ కార్నివాల్



నవతెలంగాణ-సిటీబ్యూరో

విభిన్న శ్రేణి నైపుణ్యం కలిగిన విద్యా ప్రొడక్ట్, కాన్సెప్ట్ అభివృద్ధి, అమలులో ప్రత్యేకత కలిగిన హైదరాబాద్ ఆధారిత నైపుణ్య పాఠ్యాంశాల సంస్థ విశ్వం ఎడుటెక్ సొల్యూషన్స్ ప్రయివేటు లిమిటెడ్ ఆదివారం హైదరాబాద్‌లో తన 18వ స్కిల్ కార్నివాల్‌ను నిర్వహించింది. 5 రాష్ట్రాల్లో 7వేల పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు ఈ జాతీయ స్థాయి పోటీకి అర్హత సాధించారు, ఇందులో అబాకస్, వేద గణిత, స్పెల్లింగ్ ఉన్నాయి. ఈ ఎంపిక ప్రక్రియలో పాఠశాల స్థాయిలో 5 లక్షల మంది విద్యా ర్థులు, జిల్లా స్థాయిలో జిల్లాకు దాదాపు 800 మంది విద్యార్థులు, రాష్ట్ర స్థాయిలో రాష్ట్రానికి 800 మంది విద్యార్థులు ఉన్నారు. "విశ్వం ఎడుటెక్ జాతీయ విజేతలను విదేశాల్లో ప్రయాణిం చడానికి, అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. వారి నైపుణ్యాలను ప్రదర్శించడానికి వారికి ప్రపంచ వేదికను అందిస్తుంది. మా కే-12 ఉత్పత్తులు ఎన్‌ఈపీ-2020తో అనుసంధానించారు. ఇప్పటికే నిరూపితమైన, పరీక్షించిన వ్యాపార నమూనా, మా ఫ్రాంచైజ్ మోడల్ 95 శాతం పునరుద్ధరణ నిష్పత్తితో అల్ట్రా-హై రిటర్న్స్, పునరావత వ్యాపారంతో తక్కువ పెట్టుబడిని ఆకర్షిస్తుంది" అని విశ్వం ఎడుటెక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హరి చరణ్ అన్నారు. "డబ్బు నిర్వహణ, బడ్జెట్, ఆర్థిక నిర్ణయం తీసుకోవడాన్ని అర్థం చేసుకోవడం ద్వారా, విద్యార్థులు వ్యక్తిగత ఆర్థిక స్వాతంత్ర్యానికి అవసరమైన సాధనాలను పొందుతారు. ఈ కార్యక్రమం వ్యవస్థాపక ఆలోచనను ప్రోత్సహిస్తుంది. సృజనాత్మకత, సమస్య పరిష్కార-భవిష్యత్ కెరీర్ విజయానికి అమూల్యమైన క్లిష్టమైన నైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది" అని మాజీ పబ్లిక్ అడ్మినిస్ట్రేటర్, లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో కోలాసాని తులసి విష్ణు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ నేషనల్ ఇండిపెం డెంట్ స్కూల్స్ అలయన్స్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూ సమస్యకు పరిష్కారం చూపండి

- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ దళితుల భూ సమస్యకు పరిష్కారం చూపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దష్టి సారించాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. ఆదివారం అంబేద్కర్ జ్ఞాన మాల 315 వారం సందర్భంగా బోడుప్పల్ అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ ఆనాడు ప్రభుత్వం దళితులకిచ్చిన భూములను నమ్ముకుని బతుకుతున్న దళితులు తరతరాలుగా అసైన్డ్ భూముల పట్టాల కోసం ఎదురు చూస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దళిత రైతులకు పట్టాలని అందించి సర్వహక్కులు కల్పించాలని అన్నారు.అదేవిధంగా దళితుల అభివృద్ధి కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భూ సంరక్షణ సమితి అధ్యక్షుడు బుగ్గ మైసయ్య,రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య,చిల్ల అంజయ్య, బెక్కం శివ,యేసు రాజు, శ్రీశైలం, సవరపు బయన్న, టిల్లు,తదితరులు పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్'ను సద్వినియోగించుకోండి

- పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావు

నవతెలంగాణ-బోడుప్పల్



అనాధికార లే అవుట్లలో ఉన్న ప్లాట్లు, లే అవుట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కల్పించిన ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగించుకోవాలని పీర్జాదిగూడ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అనాధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు గాను 2020 లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మార్చి 31 2025లోగా క్రమబద్ధీకరిం చుకోని ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. దానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.28 జారీ చేసిందని అన్నారు. ఫీజు చెల్లించేందుకు గాను మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు సెలవు దినాల్లో ఈ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులకు ఏమైనా సందేహాలుంటే ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌లో తెలియజేసి నివత్తి చేసుకోవాలని చెప్పారు. ఆన్ లైన్ సదుపాయం లేనివారు / ఆన్ లైన్ పేమెంట్ పై అవగాహన లేనివారు ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ భవనం నిర్మిస్తాం

- కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

నవతెలంగాణ-చర్లపల్లి



ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో సీనియర్ సిటిజన్స్ భవనం నిర్మిస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ హామీ ఇచ్చారు. నిరూపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో సీనియర్ సిటిజన్స్ కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, నాచారం డివిజన్ సీనియర్ సిటిజన్ సభ్యులు ఆదివారం కార్పొరేటర్‌కువినతి పత్రం అందజేశారు.కార్పొరేటర్ మాట్లాడుతూ తప్పకుండా సిటిజన్ భవనం నిర్మిస్తామనితెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, ప్రేమ్ కుమార్, ఎల్లేష్, శ్రీశైలం, జగన్నాథం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఎంసీసీ కార్యక్రమాలు

- నారాయణ పాఠశాల ఏజీఎం పురుషోత్తం రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

విద్యార్థుల ప్రతిభతో పాటు వాళ్ళ మేధాశక్తిని వెలికి తీసేందుకు ఎంసీసీ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని నారాయణ పాఠశాల ఏజీఎం పురుషోత్తం రెడ్డి తెలిపారు. ఈసీఐఎల్ నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపల్ మంజు భార్గవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీసీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజీఎం పురుషోత్తం రెడ్డి, రవీంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంసీసీ కార్యక్రమం మాస్టర్ ఓరియెంటెడ్, కాన్సెప్ట్,విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికి తీయడానికి వారి వారి తరగతుల స్థాయిని బట్టి నిపుణులు ఇచ్చిన అంశాలను వ్యాఖ్యానించడం ఎంసీసీ అని తెలిపారు. ఇలాంటి పోటీ పరీక్షలు ప్రపంచంలో ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ వనస్థలిపురం, ఫలక్‌నుమ కొంపల్లి బ్రాంచ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పలు సంస్కతి కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఏస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో రక్తదానం





నవతెలంగాణ - చర్లపల్లి

ఒకరి రక్తం దానంతో కొందరి ప్రాణాలను కాపాడుకోవచ్చునని రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్ఎస్ఎస్ యువసేన వ్యవస్థాపకుడు మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి ఉత్సవాలను ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో వారం రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో పలువురు యువకులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిలుగా పట్నం సునీత మహేందర్ రెడ్డి, బసవరాజు శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీపాదరావు రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. పెద్ద ఎత్తున విచ్చేసి పాల్గొన్న యువకులను, సహకరించిన కార్యకర్తలను నాయకులను రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలిచినా ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఎలైట్ నాచారం అధ్యక్షుడు మామిడాల రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సునీల్ రెడ్డి, ఎస్ఎస్ఎస్ యువసేన సభ్యులు కిషోర్ రెడ్డి, కరుణాకర్, సాయిచంద్, ఆరెళ్ల శ్రీధర్, అక్షంత్ పడాల, రాజేష్, సాయి కుమార్, రాజశేఖర్, ఉదయ్, కృష్ణ, ఆనంద్, సెబాస్టియన్, కమల్, జెస్సీ, ఆంద్రూ, సన్ని, యశ్వంత్, మహేష్, సృజల్ తధితరులు పాల్గొన్నారు.



కాప్రా మండల్ జమ్మిగడ్డ ప్రాంతం బి.జె.ఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో 144వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలతో జ్ఞానమాల సమర్పణ చేశారు. కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు ఎస్.ఏ.రహీమ్, నర్సింహ్మ చారి, నరేందర్ రావు పాల్గొన్నారు.
నవతెలంగాణ-కాప్రా

లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలి : వెన్నెల

నవతెలంగాణ-కల్చరల్



ఆత్మవిశ్వాసం పోటీ తత్వాన్ని పెంపొందించుకొని లక్ష్యం వైపు అడుగులు వేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల అన్నారు. చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ రచయిత్రి, పాత్రికేయురాలు డాక్టర్ వనిత ఆధ్వర్యంలో భాషా సంస్కృతిక శాఖ సౌజన్యాలతో మూడు నెలలుగా నిర్వహించిన జానపద గేయా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ వెన్నెల.. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ డాక్టర్ రియాజ్, నగర గ్రంథాలయం చైర్మెన్ ఉపేందర్ రెడ్డి లతో కలిసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ మానవులకు మానసిక ప్రశాంతాన్ని ఆనందాన్ని ఆనందాన్ని ఇచ్చేది జానపద గేయాలు మాత్రమే అని పేర్కొన్నారు. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల వర్గ విభేదాలతో బీసీలకు రాజ్యాధికారం సాధ్యం కాదు ..

- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్

నవతెలంగాణ - మెహిదీపట్నం

కుల వర్గ విభేదాలతో బీసీలకు రాజ్యాధికారం సాధ్యం కాదని.. సర్వ కుల సమ్మేళనమే బీసీ రాజ్యాధికారానికి పునాదని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెండ్ చేసిన ఘటనపై ఆదివారం ఆయన మాట్లాడారు. సస్పెన్షన్ పై వ్యక్తిగతంగా సంఘీభావం తెలుపుతున్నామని, మల్లన్నను విధానపరంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బీసీ నినాదాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో మరో వర్గాన్ని దూషించడం సరికాదన్నారు. బీసీల రాజ్యాధికారం కోసం ఉద్యమాలు నిర్మాణాత్మకంగా కొనసాగాలే తప్ప ఇతర వర్గాలను దూషిస్తే అది బీసీలకు అప్రదిష్టనే తప్ప గౌరవ సూచకం కాదని తెలిపారు . కాంగ్రెస్ పార్టీ వారి స్టాండ్ మేరకు మల్లన్నను సస్పెండ్ చేశారని దీనిని బీసీలకు ఆపాదించడం సరికాదన్నారు .బీసీలు దానిని వ్యక్తిగతంగా తీసుకోవద్దని సూచించారు. రాష్ట్రంలో తనను ఎమ్మెల్సీగా గెలిపించిన పట్టభద్రుల , నిరుద్యోగుల సమస్యలను తుంగలో తొక్కి బీసీ వాదమని మల్లన్న ప్రజలను మభ్యపెట్టడం ప్రజలు గమనిస్తున్నారన్నారు..రహస్య ఎజెండా తో కొనసాగడం,తన అహంకారంతో ఇతర వర్గాల వ్యక్తుల వ్యక్తిగత దూషణ, హేళన , దుర్భాషలాడటం, అమానవీయంగా వ్యవహరించాడాన్ని ఖండిస్తున్నామన్నారు.. మల్లన్న బీసీ ఉద్యమ ముసుగులో తన అవకాశవాదం దాగి ఉన్నదని ఇకనైనా నిజాయితీగా కొనసాగితే మల్లన్నకు మంచి మంచి ఫలితాలు ఉంటాయని హితవు పలికారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉప్పల్

రామంతపూర్‌లోని కామాక్షిపురంలో సంజీవ ఆంజనేయ కాశీ విశ్వనాథ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలలో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీనాయకులు వల్లపు జగన్ యాదవ్, శ్రీనివాసచారి, తిండిర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పరుగుతో ఆరోగ్యం పదిలం

- ఆరోగ్య తెలంగాణ కోసం అందరం కృషి చేయాలి
- పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి
- రాచకొండ రన్నర్స్ ఆధ్వర్యంలో ఆరోగ్యరన్-2025



నవతెలంగాణ-బోడుప్పల్

పరుగుతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం రాచకొండ రన్నర్స్" ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆరోగ్యరన్ -2025" ఈవెంట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏవీ కన్స్ట్రక్షన్, ది ఆనంద ఇన్ఫినిటి జాయ్, విజయరత్న స్కూల్, సహస్రం డవలపర్స్ వారి సౌజన్యంతో నారపల్లి లోని భాగ్యనగర నందనవనం రిజర్వు ఫారెస్ట్‌లో రాచకొండ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఈవెంట్స్‌లో 2కే, 5కే, 10కే రన్ ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానంలో నిలిచిన వారికి ఆయన మెడల్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాచకొండ రన్నర్స్ సంస్థ ప్రతినిధులు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు, యువత పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, నిర్వాహకులు ప్రభాకర్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల,జావీద్ ఖాన్, నర్సింహా, శ్యామల నర్సింహా, కిరణ్ నాయక్, రమేష్, శంకర్ రావు, మామిడి శ్రీధర్, ఆరోగ్య రన్ స్పాన్సర్స్ తో పాటు సుమారు 800 మంది పాల్గొన్నారు.



నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం: జక్క వెంకట్ రెడ్డి

నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైందని పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు.మేడ్చల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,పీర్జాదిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్.జీ.టీ శేషం రమాదేవి ఉద్యోగ విరమణ అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. పదవికి విరామం పొందిన తర్వాత కుటుంబంతో సంతోషంగా తీర్థ, పర్యటక యాత్రలు చేయడంతో పాటు సేవకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందించి, తన సర్వీస్ లో ఎందరో పేదింటి విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలు శేషం రమాదేవి సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్, పీఆర్టీయూటీఎస్, టీఎస్ యూటీఎఫ్, టీయూటీఎఫ్ ఉద్యోగ సంఘాల నాయకులు, మేడిపల్లి, ఘట్కేసర్ మండల పరిధిలోని ఉపాధ్యాయులు, మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

- ఏఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ

నవతెలంగాణ-కాప్రా



నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని ఏఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ లోని లయన్స్ క్లబ్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. ప్రస్తుతం దేశంలో కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో విభజన రాజకీయాలకు తెరలేపుతున్నారని.. ఈ తరుణంలో యువత కులాలు మతాలకు అతీతంగా ఐక్యమత్యంగా ఉండాలన్నారు. చెడు రాజకీయాలను, ధన రాజకీయాలను భూస్థాపితం చేస్తూ సమసమాజ స్థాపన కోసం కషిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ హామీ ఇచ్చిందన్నారు. ఏడాదిలో 55,143 ఉద్యోగాలను మాత్రమే రేవంత్ ప్రభుత్వం భర్తీ చేసిందని, రాష్ట్రంలో 1,91,126 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పీఆర్సీ కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 1.32 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని గత ప్రభుత్వం ప్రకటించింది కానీ 40 వేల ఉద్యోగాల భర్తీకి మాత్రమే నోటిఫికేషన్లు విడుదలయ్యాయన్నారు. అటు కేంద్రంలో బీజేపీ...రాష్ట్రంలో గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూత్ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, ఆ కమిషన్‌కు రూ.1000 కోట్ల గ్రాంట్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రాయితీలతో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది దాన్ని అమలు చేయాలన్నారు. అనంతరం యువ ప్రజాప్రతినిధి, పెద్ద అంబర్పెట్ మున్సిపల్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ మాట్లాడుతూ యువత రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని,తద్వారా ఆయా ప్రాంత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కునుకుంట్ల శంకర్, లింగం రవి, వెంకటేశ్వర్లు, నానబాల రామకష్ణ, టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్,...రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకష్ణ, ఎల్లంకి మహేష్, శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్‌లను సద్వినియోగించుకోవాలి

- మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్



ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. మిరాకిల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కమలా నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగి ప్రాథమిక స్థాయిలో వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం తీసుకోవడం వలన అనేక రోగాల బారి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా మహిళలు తమ కుటుంబానికి అవసరమైన అన్ని రకాల సేవలు అందించి, వారి ఆరోగ్యంను విస్మరిస్తున్నారన్నారు. ఇలాంటి హెల్త్ క్యాంపులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామల నర్సింహా, రమేష్, యాదగిరి మిరాకిల్ హాస్పిటల్ ప్రతినిధులు వరప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలోని శ్వేతా గార్డెన్స్‌లో దండముడి ప్రసాద్ కూతురి వివాహ వేడుకల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి




మూసాపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, అక్కలదేవ్ గోపాల్ యాదవ్, మల్లమ్మ కూతురు వివాహం ఆదివారం మూసాపేట ఆంజనేయ నగర్‌లోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై.. వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, గోపిశెట్టి రాఘవేందర్, సుధాకర్ రెడ్డి ,లక్ష్మయ్య, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సర్వం సిద్ధం..!

- ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- 5 నుంచి 25వ తేదీ వరకు నిర్వహణ
- 100 మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు
- 150 సెంటర్లు, 1,26,423 మంది విద్యార్థులు..
- నిమిషం అలస్యమైనా నో ఎంట్రీ : డీఐఈఓ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వ హణకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఇప్పటికే విద్య, వైద్య, ఆరోగ్య, పోలీస్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు, సలహా లు చేశారు. జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 150 పరీక్షా కేంద్రా లను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. జనరల్ విభాగంలో మొత్తం 1,24,115 మంది, ఒకేషనల్ విభాగంలో మొత్తం 2,308 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగు తాయి. విద్యార్థులను గంట ముందే ఎగ్జామినేషన్ హాల్‌లోకి పంపనున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అను మతించరు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల వరకు నిషేధాజ్ఞలు విధించనున్నారు.

జిల్లాలో ఏర్పాట్లు పూర్తి..

పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, ఫర్నీచర్ ఏర్పాట్లు చేశారు. లైటింగ్, ఫ్యా న్స్, టాయిలెట్స్ వంటి అవసరమైన వసతులను కల్పించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున, పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ షాపులను మూసేయనున్నారు. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు అధి కారులు వెల్లడించారు. నిరంతర పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేశారు.

పరీక్షలకు హాజరు ఇలా..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మొత్తం 64,107 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో జనరల్ 62,829 మంది, ఒకేషనల్ కోర్సులో 1,278 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ద్వితీయ సంవత్సరంలో 62,316 మంది విద్యార్థులు రాయనున్నారు. ఇందులో జనరల్ 61,286 మంది, ఒకేషనల్ కోర్సులో 1,030 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. హాల్ టికెట్లను ఇంటర్మీడియట్ వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కూడా కల్పించారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం..

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేస్తాం. పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి సమయం కంటే ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జె ట్స్‌ను అనుమతిం చం. నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థులు ఒత్తిడికిలోను కాకుండా ప్రశాంతమైన మైండ్‌తో పరీక్షలు రాయాలి.

-జి.కిషన్, ఇంటర్మీడియట్ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా

స్కిల్ సెట్ పెంపొందించుకోవాలి



- తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ సెక్రెటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ తమ స్కిల్ సెట్‌ను పెంపొందించుకోవాలని తద్వా రా అత్యుత్తమ అవకాశాలను అంది పుచ్చుకోవచ్చని తెలం గాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ సెక్రెటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాలలో 28వ వార్షిక దినో త్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీరామ్ వెంకటేష్, విశిష్ట అథితిగా లాజిక్ పర్సూట్ సీనియర్ మేనేజర్ శిరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి దిశగా వేస్తున్న అడుగుల గురించి మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన బీఎఫ్ఎస్‌టీ మైనర్ కోర్స్, దాని ప్రాముఖ్యత గురుంచి, దాని ద్వారా విద్యార్థుల అవకాశాల గురుంచి వివరించారు. చివరగా ప్రతి విద్యార్థి కఠోర శ్రమ వల్ల తనను, కుటుం బాన్ని తద్వారా దేశాభివద్ధికి పాటుపడాలని ఆకాంక్షిం చారు. శిరీష మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప గోల్స్ ఏర్ప ర్చుకోవడం ద్వారా జీవితం లో ఉన్నత శిఖరాలు చేరుకుని జాతి ఉన్నతికి తోడ్పడి మంచి పౌరులుగా ఉండాలన్నారు. అనంతరం ప్రతి ఏడాదీ ప్రథమంగా నిలిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. అలాగే బ్యాంకు అఫ్ బరో డా వారి ఆధ్వర్యంలో చీఫ్ మేనేజర్ డీఎస్ఎన్ రాజు చేతు ల మీదుగా ముగ్గురు అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జంధ్యా ల నారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ జ్యాగ్గే, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ శంకరబాబు, పాల్గొన్నారు.

నేటి విద్యార్థులు భావితరాలకు దిక్సూచి..



- బీఆర్ఎస్ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి విద్యార్థులు భావితరాలకు దిక్సూచిగా నిలవాల ని ఆ దిశగా వారు ఎంచుకున్న రంగాల్లో పట్టుదల కనబర చాలని బీఆర్ఎస్ విప్, స్థానిక ఎమ్మెల్యే కేపి.వివేకానంద్ సూచించారు. శనివారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, చింతల్ బాపునగర్‌లో గల ఆర్.ఎస్.కే. ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల చైర్మెన్ కరస్పాండెంట్,ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కే.రామేశ్వర్ రెడ్డి,అకాడమిక్ డైరెక్టర్ కె.అరుణ రెడ్డి,మాజీ కార్పొరేటర్ కేఎం.గౌరీష్, పలువురు ట్రస్మా, ట్రపస ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేదిస్తారన్నారు. కష్టపడే కంటే ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పాఠశాల కరస్పాండెంట్ లయన్ కె.రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో విద్య, క్రీడలు, సామాజిక విలువలు తెలుపుతూ వారిలో మనో ధైర్యాన్ని నింపుతున్నామన్నారు. విద్యార్థులు చేసిన సాం స్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రస్మ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఉపా ధ్యక్షులు బిర్రు ఆంజనేయులు, ట్రపస గ్రేటర్ కుత్బు ల్లాపూర్ చైర్మెన్ కోలా రవీందర్ ముదిరాజ్,అధ్యక్ష కార్యద ర్శులు లయన్ డాక్టర్.వినోద్ జాదవ్,దయాకర్,కోశాధికారి శ్రీశైలం, పలు పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది బాలరాజు గౌడ్, ప్రవీణ్ రెడ్డి, శ్యామ్, నరసింహ గౌడ్, మధు కుమార్, ఆంజనేయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రియుడితో వివాహిత పరార్..!

- భర్త,పిల్లలను వదిలి...

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సోషల్ మీడియా అనగానే చాలామందికి కలిగేది నెగిటివ్ ఆలోచనే అని చెప్పాలి. ప్రతిరోజు మనం చూసే వార్తలలో సోషల్ మీడియా ప్రభావంతో మోసాలు, నేరాలు, హింస, ఆ సాంఘిక చర్యలు ఎక్కువగా చోటు చేసుకోవడమే దీనికి ప్రధాన కారణం.

సామాజిక మాధ్యమాలు చక్కటి సంసారలలో కూడా చిచ్చు పెడుతున్నాయి. వివాహ బంధాలను బల హీన పరిచి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. సోషల్ మీడియాలో పరిచయమైన తనకంటే తక్కువ వయసు ఉన్న యువకుడితో ప్రేమాయణం సాగించింది ఓ వివాహిత. భర్త, పిల్లలను వదిలి ప్రియుడి చెంతకు చేరింది. భార్యపై నిఘా ఉంచిన భర్త వారిద్దరిని పట్టు కునే ప్రయత్నం చేయగా మస్కా కొట్టి పరారయ్యారు. సీరియల్ తరహాలో మలుపులు ఉన్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి.

ఏపీ పల్నాడు జిల్లా మిరియం పల్లికి చెందిన గోపి కంప్యూటర్ కోర్సులో శిక్షణ తీసుకునేందుకు నగరా నికి వచ్చి, కేపీహెచ్‌బీలోని హాస్టల్లో ఉంటున్నాడు. గోపికి యాప్ ద్వారా వరంగల్ జిల్లా బావోజి గూడెంకు చెందిన సుకన్య పరిచయం అయింది. సుకన్యకు భర్త జయరాజ్ , ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైనా వీరిద్దరూ ఫోన్ నెంబర్లు ఇచ్చి పుచ్చుకొని తరచూ మాట్లాడుకునేవారు. గమనించిన జయరాజ్ తన భార్యను మందలించాడు. ప్రియుడి పట్ల ఆకర్షితు రాలైన ఆమె గత నెల 5న భర్త, పిల్లలను వదిలి గోపి వద్దకు వెళ్ళింది. ఏపీ 39 జెఎఫ్ 0742 బైక్ మీద వారు మేడ్చల్ ఆక్సిజన్ పార్కుకు వచ్చారు. భార్య కదిలికలపై నిఘాపెట్టిన జయరాజ్ పార్క్ వద్ద వారిద్దరినీ రెడ్ హ్యాండ్‌గా పట్టుకునే ప్రయత్నం చేశాడు.ప్రేమ జంట బైకుపై వెళ్తుండడంతో...వారిని భర్త వెంబడించాడు. దాంతో సుచిత్రలో బైకును వదిలి ప్రేమ జంట పరారయ్యారు. భర్త బైకును తీసుకొని పేట్ బషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బైక్ నెంబర్ ఆధారంగా గోపి తండ్రిని పిలిపించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆదర్శంగా ఉండాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మంచి, చెడులను తెలియజేస్తూ నేటి తరానికి సీనియర్ సిటిజన్స్ ఆదర్శంగా ఉండాలని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. 132 - జీడి మెట్ల డివిజన్ వేంకటేశ్వర కాలనీ వెస్ట్ నందు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశానికి ఆదివారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంట సిద్దిరాము లు, సుధాకర్ గౌడ్, ఎల్లా గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, విజయ్ హరీష్, సీని యర్ సిటిజన్స్ సభ్యులు సమ్మయ్య, శంకరయ్య, రామ్ చందర్‌పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన అద్వితీయ రుచికి చిరునామాగా "నాయుడు కిచెన్" నిలవాలి..



129 - సూరారం డివిజన్ సాయిబాబా నగర్ చౌరస్తాలో నూత నంగా ఏర్పాటు చేసిన "నాయుడు కిచెన్" ను బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ... నాణ్యతతో కూడిన అద్వితీయ రుచులకు చిరునామాగా "నాయుడు కిచెన్" నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, వెంకటస్వామి, మహమ్మద్ యూసుఫ్, తారా సింగ్, కావాలి రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మధవరం కృష్ణరావు, ఎమ్మెల్సీ నవీన్ రావు, కార్పొరేటర్లు ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ తదితరులు కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

జూపల్లి జన్మదిన వేడుకల్లో ఎర్రబెల్లి..

కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారా యణ జన్మదినం సందర్భంగా.. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం..



- ఎంపీ.ఈటల రాజేందర్

నవతెలంగాణ-దుండిగల్

రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో అధికారులు రైతులకు భయభ్రాంతులకు గురి చేస్తే ఊరుకునేది లేదని మాల్కాజిగి ఎంపీ.ఈటల రాజేందర్ అన్నారు. 50 సం॥ లుగా వ్యవసాయం చెసుకుంటు అనుభవిస్తున్న భూము లను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రైతుల భూము లను లాక్కునే అధికారం ఎవరిచ్చారని రాష్ట్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు.

దుండిగల్ సర్వే నంబర్ 453,454లోని 40 ఎకరాల అసైన్డ్ భూమిని ఎటువంటి సమాచారం ఇవ్వ కుండా ఆర్టీఓ కార్యాలయానికి కేటాయించారు. అందుకు నిరసనగా దుండిగల్ వార్డు కార్యాలయం ఎదుట రైతులు దీక్ష చేపట్టారు. దీక్షకు మద్దతుగా ఈటల రాజేందర్ పాల్గొని రైతులకు సంఘీ భావం తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములు రైతులకు కేటాయించేం దుకు కోనేరు రంగారావు కమిటీని వేశారన్నారు. రైతులకు పూర్తి హక్కు కల్పించాలని అప్పట్లో ప్రతిపాదిం చినట్టు గుర్తు చేశాడు. 50 సంవత్సరాలు కష్టపడి కాపుడుకున్న భూమిని లాక్కుంటామంటే ఊరుకోమన్నారు. తరుపున న్యాయ పోరాటం చేస్తామన్నారు. మహారాష్ట్రలో 18 సం॥ లకే రైతులకు హక్కు కల్పించారని, కర్ణాటకలో 22 సం॥లకే రైతులకు అసైన్డ్ భూమిపై హక్కు కల్పిస్తే తెలంగాణలో 50 సంవచ్చారాలు దాటినా హక్కు కల్పించకపోవడం దారుణమన్నారు. 5 ఎకరాలు గ్రేవీయార్డుకు కేటాయిం చిన ప్రభుత్వం మిగతా భూమిని లాక్కొని వ్యాపార సంస్థ లకు కేటాయించాలని చూస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మాల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్, దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణా రెడ్డి, మాజీ కౌన్సిలర్లు అమరం గోపాల్ రెడ్డి, రాజీ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు విజయలక్ష్మి, మహేందర్, మాజీ సర్పంచ్ కావలి గణేశ్, పాల్గొన్నారు.

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో ఆదివారం ముస్లిం సోదరులు రంజాన్ నెల ప్రారంభమైన సందర్భంగా.. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌస్, పంగా శ్రీనివాసరావు, కుమార్ యాదవ్, ఎం.శ్రీనివాస్, సుధాకర్, దామోదర్, రమేష్ పాల్గొన్నారు.



నవతెలంగాణ-దుండిగల్

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం..



- యోగ గురూజీ శాంతి దూత్ నరేంద్ర బంధూజి

నవతెలంగాణ-దుండిగల్

బాచుపల్లి పరిధిలోని సింహపురి కాలనీలో బాచుపల్లి యోగా సాధన కేంద్రం రెండవ వార్షికోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మల్ సాధన జ్యోతి మందిర్ వ్యవస్థాప కులు యోగా గురూజీ శాంతిదూత్ నరేంద్ర బంధుజి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన ప్రస్తుత సమాజంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే యోగా ద్వారానే పరిపూర్ణ ఆరోగ్యం పొందుతారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 23 బ్రాంచీలు గా నిర్మల్ సాధన జ్యోతి మందిర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇక్కడి బాచుపల్లి యోగా సాధన కేంద్రం రెండవ వార్షికోత్సవం దిగ్విజ యంగా కొనసాగుతున్నట్టు తెలిపారు. యోగ శిక్షణ కేంద్రంలో కేవలం నామ మాత్రపు మెయింటెనెన్స్ కోసం చార్జీల ఫీజు మాత్రమే ఉంటుంద న్నారు. ప్రజల ఆరోగ్యం పరిపూర్ణత పెంపొందించడం కోసమే నని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఇన్‌చార్జి జి.కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ ఓం.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవని 5 కే రన్ విజయవంతం చేయండి



- మంత్రి సీతక్క

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన 5కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క తెలిపారు. శనివారం రోజున అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు, శిరీష సత్తూర్ ఆధ్వర్యంలో జాతీ య మహిళా దినోత్సవం సందర్భంగా.. మార్చి 16 వ తేదీ ఆదివారం 5 కే రన్ నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యుఎస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ క్యాబినెట్ మంత్రులు ధనసరి సీతక్కతో, తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, శేర్లింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా, 5కే రన్ ఫ్లయర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళలకు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, మహిళలని గౌరవిస్తూ చేసే, ఫై కె రన్ కార్యక్రమానికి, అధిక సంఖ్యలో అందరూ హాజరు కావాలన్నారు.ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ భాను ప్రసాద్, కూన సత్యం గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మధు, ఎల్లాజీ, యశ్వంత్, పద్మ, గాయత్రి, అవని స్వచ్ఛంద సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

- జర్నలిస్టు కాలనీ వాసులు
- కొలను హనుమంత్ రెడ్డికి వినతి



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట జర్నలిస్టు కాలనీలో స్థానికుల సామాజిక అవసరాల కొరకు స్థలం కేటాయింపుపై సహకరించాలని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డిని, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు అభ్య ర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలైన జర్నలిస్టులకు ఇందిరమ్మ పథకం కింద స్థలాలను కేటాయించిందన్నారు. అందులో జర్నలిస్టులు నివాసాలు ఏర్పరచుకొని, నివసిస్తు న్నారని కొలనుకు జర్నలిస్టు కాలనీ వాసులు వివరించారు. నివాస స్థలాలను ఇచ్చి, సామాజిక అవసరాల నిమిత్తం స్థలాన్ని కేటాయించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని వారు హనుమంత్ రెడ్డికి తెలి పారు. దీంతో కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే సహాయం చేస్తుందన్నారు. 2007లో అప్పటి వైఎస్ ప్రభుత్వం పేదలైన జర్నలిస్టులకు కాలనీ ఏర్పాటు కొరకు కృషిచేసిం దని తెలిపారు. జర్నలిస్టు కాలనీ వాసుల అభ్యర్థన మేరకు అధికారులను సంప్రదించి కాలనీవాసులకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. హనుమంత్ రెడ్డిని కలిసిన వారిలో జర్నలిస్టు కాలనీ ఫౌండర్ అధ్యక్షులు అస్కాన్ని మారుతి సాగర్, అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, ఎండేవేందర్, ఎం.జీతయ్య, ఏ.గోవిం దరావు, పి.శ్రీనివాసరావు, కే.రమేష్ పాల్గొన్నారు.

10

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | మార్చి 03, 2025 | www.navatelangana.com

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన కార్పొరేటర్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళ్‌రావ్ డివిజన్ జవహర్‌నగర్‌కు చెందిన సీ.సాయి ప్రసన్నకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రెండున్నర లక్షల చెక్కును ఆదివారం రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తన పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పేద, మధ్యతరగతి ప్రజలకు వరంగా మారిందని, అనారోగ్యంతో ఉన్నవారు వెంటనే సంప్రదించాలని ఆయన డివిజన్ ప్రజలను కోరారు.



టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్ ఆదివారం చంపాపేట్‌లోని సాగర్ రోడ్‌లోని విజయ్ కన్వేన్షన్‌లో జరిగిన వివాహానికి హాజరై నూతన వధువు వరులు ప్రతీక్ రాజ్, మనీషాలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. బాలాజీ గోస్వామి, మాజీ సర్పంచ్ బి. పెంటయ్య, శివకుమార్, మహేష్, పరమేష్ బాబు నూతన వధువరులను ఆశీర్వదించారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

సమస్యల పరిష్కారమే ధ్యేయం



- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతున్న బస్తీ పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం తిరుమలగిరి (వార్డు 7) ఇన్ఫంట్ జీసస్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎన్నో ఏండ్లుగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీ వాసులతో కలసి కాలనీ మొత్తం తిరిగారు. ఆయనకు 30 ఏండ్ల క్రితం వేసిన తాగునీటి పైపులైన్ తుప్పు పట్టినందున నీరు కలుషితం అవుతున్న తీరు, వాంబే ఇండ్లపై స్లాబు పగుళ్ళు, వాటర్ ట్యాంక్ లీకేజీ, వీధి దీపాలు లేకపోవడం తదితర సమస్యలను కాలనీ వాసులు చూపించారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడినుంచే కంటోన్మెంట్ బోర్డులోని సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కారం చేయాలని సూచించారు. కాలనీలో బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాలు అవసరాన్ని గుర్తించి వాటి ఏర్పాటుకు తాను వెంటనే చర్యలు చేపట్టి పూర్తి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ బస్తీ పర్యటనలో ఎమ్మెల్యే వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు మేరీ మాన్యుల్, ముదిరాజ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని, రాకేష్, చాముండేశ్వరి, జెన్నిఫర్, అశోక్, విజయ్, జాన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత జంక్షన్‌గా విప్రో సర్కిల్

- సర్వేజనా ఫౌండేషన్ చైర్‌పర్సన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి
- 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్' యాప్‌ను ప్రారంభించిన పివి.సింధు



నవతెలంగాణ-బేగంపేట్

ఒక మోకాలు అరిగిపోతే కొత్త మోకాలు వేయగలం కానీ తల పోతే ఇంకో తల రాదని సర్వేజనా ఫౌండేషన్ చైర్‌పర్సన్, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా సర్వేజనా ఫౌండేషన్ ఆదివారం 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్' అనే కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించని వారికి హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలిలోని విప్రో జంక్షన్ సర్కిల్‌ను సురక్షితమైన ప్రమాద రహిత జంక్షన్‌లుగా మార్చి రోడ్డు భద్రతా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సోలార్ క్యాట్ ఐస్, జీబ్రా క్రాసింగ్ లైన్‌లు, సిగ్నేచర్ బోర్డులు, డిలైనేటర్స్ ఏర్పాటు చేయడం. గచ్చిబౌలిలోని విప్రో జంక్షన్ సర్కిల్‌ను పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రమాద రహిత జంక్షన్‌గా ప్రకటించడంతో పాటు స్టాప్ యాక్సిడెంట్ యాప్‌ను ప్రముఖ బ్యాట్మింటన్ క్రీడాకారిణి పివి.సింధు ఆదివారం ఉదయం గచ్చిబౌలిలోని విప్రో సర్కిల్ వద్ద ఉన్న పీనిక్స్ లాబీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా పివి.సిందు. మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టాప్ రోడ్ యాక్సిడెంట్స్ యాప్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అందరికి అర్థమయ్యే విధంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి అవగాహన కల్పించడంతో పాటు ఎంతో మంది విద్యార్థులకు ఆవగాహన కల్పించడం గొప్ప కార్యక్రమంగా అభివర్ణించారు. విప్రో జంక్షన్‌ను ప్రమాద రహిత జంక్షన్‌గా తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. నేను ప్రాక్టీస్ చేసే సమయంలో ఈ జంక్షన్ నుంచి వెళ్లే సమయంలో యాక్సిడెంట్స్ చూశానని అప్పుడు చాలా బాధపడ్డానని, ఇప్పుడు జంక్షన్‌ను ప్రమాద రహిత జంక్షన్‌గా మార్చినందుకు సంతోషంగా ఉందన్నారు. సందర్భంగా యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని సరైన సమాధానం ఇచ్చిన వారిని ఆరు మందిని ఎంపిక చేసి మొదటి బహుమతిగా రూ. 50వేలు మరో ఐదు మందికి పదివేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. సందర్భంగా పీవీ సింధు కార్యక్రమానికి విచ్చేసిన తన తండ్రితో రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తానని ప్రమాణం చేయించింది. ఇలాగే ప్రతి కూతురు కూడా తండ్రితో హెల్మెట్ వాడాలని, సీట్ బెల్ట్ ధరించాలని ప్రతిజ్ఞ చేయించాలని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి మాట్లాడుతూ.. సర్వేజనా ట్రస్ట్‌ను 2021లో ప్రారంభించి ఉచితంగా పేదలకు సేవా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఉచితంగా నిరుపేదలకు మొకాళ్ల మార్పిడి, యంగ్ సర్జన్లకు రీప్లేస్‌మెంట్‌లో ట్రెయినింగ్, స్టాప్ యాక్సిడెంట్స్ అనే మూడు లక్ష్యాలతో ఫౌండేషన్‌ను ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. యాక్సిడెంట్లను 50శాతం వరకు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని వాటిని సరైన అవగాహన కల్పించడం ద్వారా తగ్గించవచ్చనే ధ్యేయంతో మహాత్మాగాంధి 'చెప్పిన విధంగా ఒక్క అడుగుతో ముందడుగు వేయాలని ఇవాళ పివి.సిందు. చేతుల మీదుగా స్టాప్ రోడ్ యాక్సిడెంట్ యాప్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సర్వేజనా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ బి.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఫౌండేషన్ అధ్వర్యంలో ఇప్పటివరకు ఉచితంగా 108 మోకాళ్ల, తుంటి(హిప్) జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్ర చికిత్సలు, అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 46 మెడికల్ హెల్త్ క్యాంపులు నిర్వహించి 3,800 మందికి చికిత్సలు అందించినట్లు తెలిపారు. దేశంలో 26కోట్ల మంది విద్యార్థులు చదువుతుంటే దాదావు అంతే మొత్తంలో ద్విచక్రవాహనాలు ఉన్నాయని, మానవ తప్పిదాలు, (ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రతి సంవత్సరం 1.5లక్షల మంది చనిపోతున్నారని, ఇందులో 50వేల మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల, దాదావు 16వేల మంది సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల జరుగుతన్నాయి. ప్రభుత్వం వైపు నుంచి ఎన్ని చర్యలు చేపడుతున్న చలాన్లు కడుతున్నారు తప్ప వాహనదారుల్లో మార్పు రావడంలేదని, తల్లిదండ్రుల ప్రవర్తనలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో కూతురి ద్వారా తండ్రి ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమానికి పీవి సింధు తండ్రితో కలిసి ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో, దేశంలో ఉన్న అన్ని పాఠశాలల్లో విద్యార్థుల ద్వారా అవగాహన తీసుకువచ్చి అమలు చేస్తామని జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ ఆఫ్ హానర్లుగా టీజీఐఐసీ వీసీ అండ్ ఎండి డాక్టర్ ఈ. విష్ణువర్ధన్‌రెడ్డి, సర్వేజనా ఫౌండేషన్ వైస్ చైర్మెన్ రాము ఎలమంచి, సీఓఓ ప్రవీణ్ కుమార్, బోర్డు మెంబర్లు, కిషోర్ సేతురామన్, డాక్టర్ ఆదర్శ్ అన్నవపెడ్డి, డాక్టర్ కుషాల్ హాప్పాల్‌గావ్‌కర్, డాక్టర్ దివాకర్‌రెడ్డి, డాక్టర్ భవాణి, డాక్టర్ కావ్య తదితరులు పాల్గొంటారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం ఆరున్నర గంటలు సమయంలో పంజాగుట్ట పోలీసులకు శ్రీనగర్ కాలనీలో హెచ్.పీ గ్యాస్ షాప్ ముందర ఒక గుర్తు తెలియని వ్యక్తి వయసు సుమారు 55 నుంచి 60 ఏండ్ల వ్యక్తి చనిపోయి ఉన్నాడని సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. మార్చురీ గదిలో భద్రపరచామని పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ శోభన్ కుమార్ తెలిపారు. మృత దేహానికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందని తెలిసినా వారెవరైనా పంజాగుట్ట పోలీస్ స్టేషన్ నెంబర్‌కు 8712661275 కాల్ చేయ్యాలని కోరారు.



బేగంపేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బి. ప్రసాద్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను బేగంపేట డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమేష్, శాంతికుమార్, చిన్న బాబు, దుర్గా, కరుణాకర్, శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి ఇన్‌స్పెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.
నవతెలంగాణ-బేగంపేట్

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి

- జేఎస్‌టీ సాయి దంపతులను పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్

సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు జేఎస్‌టీ సాయి దంపతులను, మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సాయి సతీమణి వరలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ.. చికిత్స అనంతరం ఇటీవల ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సనత్‌నగర్‌లోని మోడల్ కాలనీలో గల వారి నివాసానికి వెళ్లి వరలక్ష్మిని కలిసి పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకుంటారని సాయి దంపతులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు మాణిక్ రావు, పార్థసారధి, రాములు, ఆనంతరెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, ఖలీల్, శేఖర్, జమీర్ తదితరులు ఉన్నారు.

టాయిలెట్లు ఏర్పాటు చేయాలి



- ఎమ్మెల్యేకు భవన నిర్మాణ కార్మికుల వినతి

నవతెలంగాణ-కంటోన్మెంట్

రసూల్‌పురా భవననిర్మాణ కార్మికుల అడ్డాలో టాయిలెట్లు ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతూ రసూల్‌పురా భవన నిర్మాణ కార్మికులు ఆదివారం ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపు 250 మంది కార్మికులు ప్రతి రోజు పనికోసం ముదిరాజ్ భవన్ ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వేచి ఉంటారు. ఈ సమయంలో అత్యవసర పరిస్థితిలో మహిళా కార్మికులు కూడా అక్కడ టాయలెట్లు లేక గంటల కొద్ది అలాగే వేచి చూస్తూ చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ కారణంగా అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. గతంలో ఈ ప్రాంతంలో టాయిలెట్లు ఉన్నా వాటిని కూల్చి ముదిరాజ్ భవనం నిర్మించారని ఈ నేపథ్యంలో ముదిరాజ్ భవన్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో తమకోసం టాయిలెట్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం సమర్పించారు. సమస్యపై స్పందిచిన ఎమ్మెల్యే వెంటనే వారికోసం తగిన ఏర్పాటు చేస్తానని హామి ఇచ్చారు.

ముస్లిం సోదరులకు సహేరి విందు ఏర్పాటు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

పవిత్రమైన రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా సహేరీ కార్యక్రమం మొదటి రోజు ఎస్ఆర్ఆర్ పురం వద్ద గల కమాన్ సమీపంలో మోహమ్మద్ బాబా ఫసియుద్దీన్, బోరబండ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ మాజీ ఉప మేయర్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. గత పదేండ్లుగా ముస్లిం సోదరులకు రంజాన్ మాసంలో ఉచితంగా, ఉదయం నాలుగు గంటలకు విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా మొదటి రోజు నుంచే సహేరి ఏర్పాటు చేయటం జరిగింది. ఈ వంటకాలను హిందూ సోదరులు ప్రతిరోజు రాత్రి తయారుచేసి, ఉదయాన్నే ముస్లిం సోదరులకు స్వయంగా అందించడం ఎంతో గొప్ప ఆప్యాయత అని, హిందూ-ముస్లిం సోదరులు బోరబండలో భాయ్-భాయ్‌గా ఉంటారని మరొకసారి నిరూపించుకున్నారు.

గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డేను జయప్రదం చేద్దాం



- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

మార్చి 10న జరిగే తెలంగాణ మిలియన్ మార్చ్ డే ను విజయవంతం చేద్దామని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి పిలుపునిచ్చారు. ముషీరాబాద్ నియోజకవర్గం లోని కవాడిగూడ డివిజన్ బీమా మైదానం కమ్యూనిటీ హాల్లో మిలియన్ మార్చ్ డే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు తమ మేనిఫెస్టోలో ప్రకటించినట్టు 250 గజాల ఇంటి స్థలంతో పాటు, ఉద్యమకారులకు రూ. 30,000 గౌరవ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు .ప్రభుత్వం వెంటనే రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, తెలంగాణ స్వతంత్ర సమరయోధుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం కోసం కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఉద్యమకారులను విస్మరిస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కోసం ఏకమవుదామని పిలుపునిచ్చారు.మిలియన్ మార్చ్ డేకు తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య, క్రిస్టఫర్, మహిళా అధ్యక్షురాలు కోతి మాధవి, కళాబృందం ప్రెసిడెంట్ వేముల యాదగిరి, జర్నలిస్ట్ ఫ్రంట్ మోహన్ బైరాగి, గంటి చంద్రుడు, అంజలి, కుమారి, వెంకటలక్ష్మి ,సుజీ స్వరూప, రాణి ,అరుణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో రజకులకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలి

- రజక వృత్తిదారుల సంఘం డిమాండ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

రాష్ట్ర బడ్జెట్‌లో రజక వృత్తిదారులకు వెయ్యి కోట్లు కేటాయించాలనీ జూబ్లీహిల్స్ జోన్ రజక వృత్తిదారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి బిక్షపతి, కే యాదగిరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీ సాయి గణేష్ ఐలమ్మ రజక సంఘం సమావేశం అమీర్‌పేట్ నాగార్జున నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు బిక్షపతి యాదగిరి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టిందని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రజకులకు వెయ్యి కోట్లు కేటాయించి, రజక వృత్తిదారులను ఆదుకోవాలని తెలిపారు. రజక వృత్తిదారులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, విద్యా, వైద్యం, వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన 250 యూనిట్ల ఉచిత విద్యుత్తు బకాయిలు ఇవ్వటం లేదని, విద్యుత్ అధికారులు రజక వృత్తిదారుల మీటర్ల కరెంటు కట్ చేస్తున్నారని, బకాయిలకు నిధులు కేటాయించి బకాయిలు చెల్లించాలన్నారు. రజక వృత్తిదారుల సమస్యలు, ప్రజా సమస్యలపై రజక వృత్తిదారులందరూ ఐక్య పోరాటాలు చేయాలని, సొసైటీలు ఏర్పాటు చేసుకొని వారిని రెన్యువల్ చేసి సమావేశాలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం నాయకులు రాపర్తి అశోక్, శివ, ఆంజనేయులు, పాండురంగ రాజు, వీరబాబు సత్యనారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆరోగ్యం కోసం మజ్జిగ ప్యాకెట్లు..



నవతెలంగాణ-కంటోన్మెంట్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఉత్తర మండల ట్రాఫిక్ పోలీసులకు సంక్షేమం కోసము ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఏసీపీ జి.శంకర్ రాజు, పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ జోయల్ డేవిస్, హైదరాబాద్ డిప్యూటీ కమీషనర్ ట్రాఫిక్ రాహుల్ హెగ్డే, బి.కె.అదనపు డిప్యూటీ కమీషనర్ ట్రాఫిక్ సి. వేణు గోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నార్త్ జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీస్ సిబ్బందికి వేసవి కాలం ఆరోగ్యం కాపాడే ప్రయత్నంలో భాగంగా సిబ్బంది అందరికీ ఈ మూడు నెలల పాటు ప్రతి రోజూ ఒకరికి రెండు మజ్జిగ పాకెట్లను ఇస్తారని జి.శంకర్ రాజ్ తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యం దృష్ట్యా సంక్షేమం అందించటానికి హైదరాబాద్ నగర పోలీస్ సీనియర్ అధికారులు ముందుంటార చెప్పారు.

మహిళల ఎండోమెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



- డీజీపీ షీకా గోయెల్, సంగీత రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

మహిళల ఎండోమెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలనీ సీఐడీ, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీపీ షీకా గోయెల్, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి తెలిపారు. ఎండోమెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ.. ది ఎండోమెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్ వద్ద 3కే, 5కే, 10కే విభాగాల్లో ఎల్లో రిబ్బన్ రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ విమ్మి బింద్రా, సామాజికవేత్త, సినీనటి డాక్టర్ సాయి కామాక్షి భాస్కర్లతో కలిసి ప్రారంభించారు. డీజీపీ షీకా గోయెల్, సంగీత రెడ్డిలు 10కే, 5కే, 3కే రన్‌లలో ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువతీయువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రోబోటిక్స్ ఎగ్జిబిషన్‌లో రాణించిన ఓయూ విద్యార్థులు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా మోడల్ హైస్కూల్ విద్యార్థులు రోబోటిక్స్ ఎక్సిబిషన్‌లో తమ ప్రతిభ చాటుకున్నారు. శనివారం ఉప్పల్ శిల్ప రామంలో శోహం అకాడమీ వారి ఆధ్వర్యంలో సైన్సు దినోత్సవం సందర్భంగా జరిగిన 4వ, యనివల్ రోబోటిక్స్ ఎక్సిబిషన్‌లో పాల్గొన్న ఓయూ మోడల్ హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ కనబరుస్తూ ప్రశంసలు పొందారు. ఈ విద్యార్థులు వాటర్ ఫాల్స్ వద్ద ప్రమాదాలు జరిగినప్పుడు అలారం వచ్చి ఇతరుల అప్రమత్తం చేసే ప్రాజెక్ట్‌ను ప్రదర్శించారు. దీనిలో 230 స్కూల్ పాల్గొన్నగా 60 స్కూల్స్ విద్యార్థులను ఉత్తమ ప్రదర్శన కింది ఎంపీక చేశారు. ఈ ప్రదర్శనలో సత్త చాటిన విద్యార్థులను స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు జ్యోతి శ్రీ, అధ్యాపకురాలు వై.శ్రీలతలు ఉత్తమ ప్రదర్శన కనపరిచిన 9వ, తరగతి విద్యార్థులు రాహుల్, వసంత రావులను అభినందించారు.

తీన్మార్ మల్లన్న సస్పెండ్‌ను ఖండిస్తున్నాం

- సదవరి సాయి తేజ



నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదవరి.సాయి తేజ తెలిపారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో సాయి మాట్లాడుతూ.. కులగణనపై కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించినందుకుగాను కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయమన్నందుకు బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అడిగినందుకు ఇలా చేసినట్టు ఆరోపించారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం కేటాయించమన్నందుకు ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అంత చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు తీన్మార్ మల్లన్న సస్పెండ్ చేసి ఉంటే మా బీసీల తడాక్ ఏందో చూపిస్తాం. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 50 శాతం అది పార్టీ పదవుల్లో కావచ్చు నామినేట్ పోస్టుల్లో కావచ్చు బీసీ ఐఏఎస్‌లకు పోస్టులు కేటాయించే విషయంలో కావచ్చు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో ఇవి ఏవి చేయకున్నా కాంగ్రెస్ పార్టీ బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయం అన్నారు. ఇప్పుడు భర్తీ చేసే నాలుగు ఎమ్మెల్సీలు బీసీలకే కేటాయించాలని, క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు మంత్రు పదవులు బీసీలకే కేటాయించాలని, బీసీలు ఎంతో అంత వాటా ఇవ్వాల్సిందిగా కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు గంగాపురం కర్ణాకర్, కిరణ్, మహేష్, ప్రదీప్, సాయి, వేణు, ప్రకాష్, ఉదయ్, వెంకటేష్, జగన్‌లు పాల్గొన్నారు.



దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్‌లో ఆదివారం శ్రీపెద్దమ్మ తల్లి బోనాల జాతర ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొని సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ మాజీ ఎంపీపీ చిన్నంగి వెంకటేష్ ముదిరాజ్, తాజా మాజీ కౌన్సిలర్లు అమరం గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ నల్తూరి కృష్ణ, మాజీ ఏంపీటీసీ మహేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు తలారి రాజ్ కుమార్ ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు మాజీ ఉప సర్పంచ్ చెల్కల లక్ష్మణ్ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు పిట్ల శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

హైదరాబాద్

HMDA

సోమవారం | మార్చి 03, 2025 | www.navatelangana.com



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారి కళ్యాణము జాతర మహోత్సవ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, అర్కల అనంత స్వామి, గాజుల రామారం డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రామ్ రెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

శ్రీ పాదరావు చరిత్ర నేటి వారికి కర దీపిక

- శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద రావు



నవతెలంగాణ-కల్చరల్

గ్రామ పంచాయతీ స్థాయి నుంచి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ సభాపతి గా ఎదిగిన దుద్దిల్ల శ్రీ పాద రావు జనం మనిషి అని శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద రావు కోనియడారు. ఆయన చరిత్ర రాజకీయాల్లో రావలనుకొనే వారికి రాజకీయాలలో ఉన్న వారికి కర దీపిక అని వారు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ పూర్వ సభాపతి శ్రీ పాద రావు 88వ జయంతి ఉత్సవం రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ రంగం లో ప్రజలలో మమేకమైన నాయకులను ప్రజలు మరువారు అనేందుకు శ్రీ పాద రావు జీవితం ఉదాహరణ అన్నారు. నాటి రాష్ట్ర మంత్రి ఎలిమినేటి మాధవ రెడ్డి శ్రీ పాద రావు వంటి తెలంగాణ ప్రాంత గొప్ప నాయకులు అకాల మరణం బాధా కరం అన్నారు. మరొక ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద రావు మాట్లాడుతూ అజాత శత్రువు శ్రీ పాద రావు సభా పతిగా సమర్ధ వంతం గా పదవికి న్యాయం చేసారుని అన్నారు. తాను సభా పతి గా శాసన సభ వ్యవహారాల మంత్రి గా ఉన్నశ్రీధరబాబు సూచనలు తీసుకుంటానని ఆయన కూడా తండ్రి శ్రీపాద రావు కు తగ్గ తనయుడు అన్నారు.

ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గాంధేయ వాదాన్ని కాంగ్రెస్ సిద్ధాంతాలను నమ్మి ఆచరించిన శ్రీ పాద రావు మూడు సార్లు శాసనసభకు ఎన్నికయ్యారని అదే నియోజక వర్గం నుంచి అయన కుమారుడు శ్రీధర్‌బాబు ఐదు సార్లు ఎన్నిక కావటం విశేషం అన్నారు. వారి కుటుంబం ప్రజాభిమానం చూరగొన్నదన్నారు. రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నీతి వంత రాజకీయాలకు మార్గ దర్శి శ్రీ పాదరావు అన్నారు. శాసన సభ సభ్యుడు కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ మానవీయతా మూర్తి శ్రీ పాద రావు అన్నారు. శాసన సభలో బీజేపీ సభ్యుడు హరీశ్ మాట్లాడుతూ గతానికి భిన్నం గా శాసన సభలో ప్రతి పక్ష సభ్యులు మాట్లాడే అవకాశం లభించటం శ్రీ పాద రావు బాటలో నేడు సభ నిర్వహణ అన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్ పలువురు శాసన సభ మండలి సభ్యులు పాల్గొన్న వేదిక పై మంత్రి శ్రీధర్ బాబు స్వాగతం పలికారు. ఈసందర్భంగా సామాజిక ఉద్యమ కారుడు బీఎస్ రాములు సాంస్కృతిక కార్య కర్త గోవింద హరిలను జీవన సాఫల్య పురస్కారం తో సత్కరించారు.

'అంతర్జాతీయ స్థాయికి మహిళలు ఎదగాలి'



నవతెలంగాణ-కల్చరల్

రెండు తెలుగు రాష్ట్రాలలోనీ స్త్రీలు జాతీయ స్థాయి లో క్రీడలు కళలు సాహిత్యం ఇతర సాంకేతిక రంగాల్లో గుర్తింపు తెచ్చుకొంటున్నారని వారు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కోలేటి దామోదర్ గుప్త ఆకాంక్ష వ్యక్తం చేశారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గీత ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజ న్యంతో రాబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వివిధ రంగాలకు చెందిన ప్రతిభా వంత మహిళలుకు స్త్రీ శక్తి పురస్కారాలు ప్రధానోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా దామోదర్ మాట్లాడు తూ ఆకాశంలో సగం స్త్రీ అని చెప్పినా ఇంకా వారు పురుషాదిపత్య సమాజంలోనే వున్నారని చెప్పారు. అడ పిల్లలు మగ పిల్లలతో సమానంగా విద్యా రంగంలో పో టీ పడుతున్నారని ఇది ఆహ్వానించ తగ్గ పరిణామం అన్నారు. యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తొందరపడి ఒక కోయిల ముందే కూసింది. అన్న గొప్ప గీత రచయిత దేవులపల్లి పాటకు అనుగుణంగా గీత ఆర్ట్స్ సంస్థ ముందుగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తూ మహి ళలు అన్నింటా ముందే వుంటారని నిరూపించారన్నారు సంస్థ అధ్యక్షురాలు గీత నిర్వహణలో గాయనులు సురేఖ, ఆమని వి ఏ లక్ష్మి, ఇందు నయన,విద్యావేత్త ప్రొఫెసర్ సుధా రాణి,నాట్య గురువు నిర్మల ప్రభాకర్ లకు స్త్రీ శక్తి పురస్కారాలు అతిథులు బహుకరించారు. వేదిక పై కలాభిమానులు కుసుమ భోగ రాజు వెంకట రావు గాయకులు లక్ష్మణ్ రాజన్ శ్యామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. తొలుత సంస్థ కార్యదర్శి రమేష్ కూతురు నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా సినీ గీతాల విభావరి జరిగింది.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

132 డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవ చేయడం అభినందనీయమని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామం బీజేపీ కార్పొరేటర్ కార్యాలయం వద్ద బిగ్ టీవీ, రష్ హాస్పిటల్ వారు డాక్టర్ నవీన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ 132 జీడిమెట్ల డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, వీరారెడ్డి, నార్లకంటి దుర్గయ్య,పెద్దింటి సాయిలు, ప్రభాకర్ రెడ్డి,శ్రావణ్ గౌడ్,సందీప్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం , 132 జీడిమెట్ల డివిజన్ పరిధి వుడ్స్ ఎంక్లేవ్ , వైష్ణవి ఎంక్లేవ్‌లలో రోడ్లు, శానిటైజేషన్, డ్రయినేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డికి తెలిపారు.అనంతరం ఆయన కాలనీ వాసులతో కలిసి కాలనీలలో పర్యటించి కాలనీలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో తోట బిక్షపతి, నర్సింహా రెడ్డి, శ్రీహరి రెడ్డి, నాగరాజు, శివకుమార్, రవీందర్ గౌడ్, విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలు సమాజంలో ముఖ్యపాత్ర పాత్ర పోషించాలి

- శ్రీరంగం ఫౌండేషన్ కో-చైర్‌పర్సన్ ఇందుమతి శ్రీరంగం



నవతెలంగాణ-బాలానగర్

ఉమెన్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్షిప్, బి2బిఎక్స్‌పో 2025 హైదరాబాద్‌లోని గచ్చిబౌలి లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఓడబ్ల్యూఈ నేషనల్ కాన్ఫరెన్స్‌కు శ్రీరంగం ఫౌండేషన్ కో-చైర్‌పర్సన్ ఇందుమతి శ్రీరంగం హాజరై.. మహిళా వ్యాపారవేత్తలకు బి2బి కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరంగం ఫౌండేషన్, సీఓడబ్ల్యూఈ (కాన్ఫరెన్స్ ఆఫ్ ఉమెన్స్ ఎంట్రప్రెన్యూర్షిప్) మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భవిష్యత్తులో ఇద్దరు సంస్థలు కలిసి నూతన మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధికి, వ్యాపార అవకాశాల విస్తర ణకు సహకరించనుంది. ఈ కార్యక్రమంలో మొత్తం 108 మంది మహిళా వ్యాపారవేత్తలకు శక్తి అవార్డులు ప్రదానం చేయబడింది. అలాగే 40 పైగా బయ్యర్లు (ప్రభుత్వ కార్పొరేట్ సంస్థలు) 70 పైగా సెల్లర్లు పాల్గొన్నాయి. బి2బి ఎక్స్ పో ఈవెంట్ నిర్వహించారు. ఇందుమతి శ్రీరంగం ఈ సమ్మిట్‌లో శ్రీరంగం ఫౌండే షన్ తరఫున రెండు రోజుల పాటు పూర్తిగా పాల్గొని మహిళా వ్యాపారవేత్తల అభివృద్ధికి మద్దతుగా ఫౌం డేషన్ చేసే కృషిని వివరించారు. శ్రీరంగం ఫౌండేషన్ మహిళా సాధికారత, విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక అభివృద్ధిలో విశేష సేవలు అందిస్తున్న సంస్థ అని అన్నారు. మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడంలో శ్రీరంగం ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఇందుమతి శ్రీరంగం తన ప్రసంగంలో తెలిపారు. సీఓడబ్ల్యూఈతో కలిసి పని చేయడం ద్వారా మరికొంతమంది మహిళలకు మద్దతు అందించేందుకు శ్రీరంగం ఫౌండేషన్ కట్టుబడి ఉందని ఆమె వెల్లడించారు.

భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రభుత్వం కృషి చేయాలి



- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యూసుఫ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.యూసుఫ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగో మహాసభలు ఆదివారం జగద్గిరిగుట్ట సమీపంలోని ఆస్బెస్టస్ కాలనీ అడ్డా వద్ద నిర్వహిం చారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఆయన తోపాటు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్ రావులు హాజరయ్యారు.ఈ మహాసభలకు జిల్లాలోని అన్ని మండలాల భవన నిర్మా ణ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారని తెలిపారు. నిర్మాణ కార్మికులకు సుమారు 13 రకాల సంబంధించి ప్రభుత్వం నుంచి సంక్షేమం పొందవచ్చని కానీ నేడు బీజేపీ మోడీ ప్రభుత్వం సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసే విధంగా కుట్రలు పన్నుతున్నదని ఆరోపి ంచారు. భవన నిర్మాణ కార్మికులు సంఘటితమై ఈనెల 28న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో సుమారు 5 వేల కోట్లు ఉన్నాయని వాటిని భవననిర్మాణ కార్మికులకు ఉపయోగిస్తే నెలవారిగా రూ.5 000 వేలు పెన్షన్ ఇవ్వవచ్చని అన్నారు. పై అంశాలను తీర్మానాలుగా ఈ మహాసభల సందర్భంగా ప్రవేశపెట్టి వాటి అమలు కోసం పోరాటాల నిర్వహించాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.ఉమామహేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్వామి, వంగాల శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యద ర్శులు నాగప్ప, పరమేశ్వర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, నియోజకవర్గ అధ్యక్షుడు వి. హరినాథ్, సుమారు 150 మంది భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

CHANG OF NAME

I, NAGA DUTTA SATYA VENKATA RAMANA GUNDAMRAJ (Old Name), S/o.GUNDAMRAJ RAJENDRANATH, R/o.H.No, 13-8-20/A, F.No 101, SRI SAI RESIDENCY APARTMENTS PATEL NAGAR, ASMANGADH, HYDERABAD-060, T.S. I have changed my name as GUNDAMRAJ VENKATA RAMANA

గౌరవ నీయులైనా సినియర్ సివిల్ జడ్జి చేవేళ్ళ రంగారెడ్డి జిల్లా
O.S.No. 25 OF 2022

మధ్యన
విజయలక్ష్మి ...వాది
మరియు
ఎస్. నర్సింలు మరియు ఇతరులు ....ప్రతివాదులు

శ్రీయుత
D6. గౌతమ్ చంద్ తండ్రి శ్రీ ఇందెర్నల్, వయస్సు 63 సం॥లు, వృత్తి వ్యాపారం,
D7. లలిత్ కుమార్ తండ్రి గౌతమ్ చంద్, వయస్సు : 40 సం॥లు, వృత్తి : వ్యాపారము, ఇద్దరి నివాసం. హౌస్ నెం. 3-5-855/10,హైదర్‌గూడ, హైదరాబాద్.
D8. ఎండి. అబ్దుల్ శకీల్ తండ్రి : అబ్దుల్ సత్తార్, వయస్సు : 48 సం॥లు, వృత్తి : వ్యాపారము, నివాసము : 11-3-608/11, హబీబ్‌నగర్, మల్లేపల్లి, హైదరాబాద్.
D9. సయ్యద్ ఫజిలుద్దీన్ ఖైరీ తండ్రి : సయ్యద్ యూసుఫుద్దీన్ ఖైరి, వయస్సు : 39 సం॥లు, వృత్తి : వ్యాపారము, నివాసము : 9-4-61/అ/17/1, మహారాజ్ కాలనీ/టోలిచౌకి, హైదరాబాద్

పైన తెలిపిన వాది గౌరవనీయ సీనియర్ సివిల్ జడ్జి చేవేళ్ళ కోర్టులో ప్రతివాదులు పైన Suit For Partition and Separate Possession దావా, భూమి సర్వే నెం.83/అ విస్తీర్ణం ఏకరములు 4-08 గుంటలు, మరియు సర్వే నెం. 81/ఇ1 విస్తీర్ణం ఏకరములు 6-07 గుంటలు, మల్కాపూర్ గ్రామము, చేవేళ్ళ మండలము రంగారెడ్డి జిల్లాలో కలదు. ఇట్టి భూమి పైన తెలిపిన వాది దావా వేసియున్నారు. అందులో మిమ్మల్ని ప్రతివాదులు నెంబర్ 6 to 9 గా చేర్చియున్నారు. గౌరవనీయ కోర్టు ఆర్డర్ ప్రకారం O.S.No.25 OF 2022 తమరి హాజరుకై తేది : 17-03-2025 నాడు ఉదయం 10.30 గంటలకు గౌరవనీయ కోర్టుయందు స్వయముగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కాగలరు లేదా కోర్టువారు ఏకపక్ష నిర్ణయముగైకొందురు.

కోర్టు ఆదేశానుసారము ఈ ప్రకటన జారీ చేయడమైనది.

పి. సంపూర్ణ ఆనంద్ అడ్వకేట్
హౌస్.నెం. 4-2-879/10/1, నియర్ గౌతమి జూనియర్ కాలేజి, వికారాబాద్ మున్సిపాలిటీ & టౌన్, వికారాబాద్ జిల్లా
ఫోన్ : 9440356499

గౌరవ నీయులైనా సినియర్ సివిల్ జడ్జి చేవేళ్ళ రంగారెడ్డి జిల్లా
IA No. 164 OF 2028 IN O.S.No. 25 OF 2022

మధ్యన
విజయలక్ష్మి ...వాది
మరియు
ఎస్. నర్సింలు మరియు ఇతరులు ....ప్రతివాదులు

శ్రీయుత
D6. గౌతమ్ చంద్ తండ్రి శ్రీ ఇందెర్నల్, వయస్సు 63 సం॥లు, వృత్తి వ్యాపారం,
D7. లలిత్ కుమార్ తండ్రి గౌతమ్ చంద్, వయస్సు : 40 సం॥లు, వృత్తి : వ్యాపారము, ఇద్దరి నివాసం. హౌస్ నెం. 3-5-855/10,హైదర్‌గూడ, హైదరాబాద్.
D8. ఎండి. అబ్దుల్ శకీల్ తండ్రి : అబ్దుల్ సత్తార్, వయస్సు : 48 సం॥లు, వృత్తి : వ్యాపారము, నివాసము : 11-3-608/11, హబీబ్‌నగర్, మల్లేపల్లి, హైదరాబాద్.
D9. సయ్యద్ ఫజిలుద్దీన్ ఖైరీ తండ్రి : సయ్యద్ యూసుఫుద్దీన్ ఖైరి, వయస్సు : 39 సం॥లు, వృత్తి : వ్యాపారము, నివాసము : 9-4-61/అ/17/1, మహారాజ్ కాలనీ/టోలిచౌకి, హైదరాబాద్

పైన తెలిపిన వాది గౌరవనీయ సీనియర్ సివిల్ జడ్జి చేవేళ్ళ కోర్టులో ప్రతివాదులు పైన Suit For Partition and Separate Possession దావా, భూమి సర్వే నెం.83/అ విస్తీర్ణం ఏకరములు 4-08 గుంటలు, మరియు సర్వే నెం. 81/ఇ1 విస్తీర్ణం ఏకరములు 6-07 గుంటలు, మల్కాపూర్ గ్రామము, చేవేళ్ళ మండలము రంగారెడ్డి జిల్లాలో కలదు. ఇట్టి భూమి పైన తెలిపిన వాది దావా వేసియున్నారు. అందులో మిమ్మల్ని ప్రతివాదులు నెంబర్ 6 to 9 గా చేర్చియున్నారు. గౌరవనీయ కోర్టు ఆర్డర్ ప్రకారం I.A.No. 164 OF 2018 IN O.S.No.25 OF 2022 తమరి హాజరుకై తేది : 17-03-2025 నాడు ఉదయం 10.30 గంటలకు గౌరవనీయ కోర్టుయందు స్వయముగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కాగలరు లేదా కోర్టువారు ఏకపక్ష నిర్ణయముగైకొందురు.

కోర్టు ఆదేశానుసారము ఈ ప్రకటన జారీ చేయడమైనది.

పి. సంపూర్ణ ఆనంద్ అడ్వకేట్
హౌస్.నెం. 4-2-879/10/1, నియర్ గౌతమి జూనియర్ కాలేజి, వికారాబాద్ మున్సిపాలిటీ & టౌన్, వికారాబాద్ జిల్లా
ఫోన్ : 9440356499

IN THE COURT OF THE HON'BLE I ADDL DISTRICT JUDGE, KADAPA, A.P.
I.A..NO. 70/2023
A.S..NO. 33 /2019

A.P.
(O.S.No. 51 of 2006 on the file of Additional Senior Civil Judge, Kadapa), A·P.

Kokkarapalle Lakshmi Narayana Reddy S/o Gangi Reddy, aged about 65 years, Hindu, landlord, resident of Ramarajupalli Village, Kadapa City having died his lrs K. Sreenivasulu Reddy S/o late Lakshmi Narayana Reddy, Hindu, aged about 45 years, Business, resident of D.No. 76/128, Ramrajupalli, Kadapa City, Kadapa District and respondent No. 18 to 20.
: Petitioner/Appellant
VS
19. P. Thulasi W/o Mallikarjuna Reddy, Hindu, Housewife, aged about 52 years,
20. A. Swaraja Lakshmi W/o Suryanarayana Reddy, Hindu, Housewife, aged about 48 years, resident of D.No.39/443-18, Plot No.5, Aravinda Nagar, Beside Indusind Bank, Kadapa City and District,
No.19 & 20 Both are now residing at residing at D.No. 3-5-199/A/5, Harivihar Colony, Narayanaguda, Near Police Station, Hyderabad

NOTICE TO RESPONDENT No. 19 & 20

పైదావలోని పిటీషనర్ తండ్రి అయిన కె. లక్ష్మీ నారాయణ రెడ్డి చనిపోయినందున పిటీషనర్‌ను మరియు మిమ్ములను వారసులుగా చేర్చమని పై దావాలో పై పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటీషన్‌లో మీ హాజరు నిమిత్తమై వాయిదా 06-03-2025న ఉన్నది కావున మీరు 06-03-2025న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున [illegible] తీర్మానించబడును.

// BY ORDES OF COURT //
Aduocate for Petition / Applet
RAJENDRA PRASAD
B. Com., BA
ADVOCATE
3/368-2 MARUTHI NAGAP
KADAPA - 516001 (A.P .)

IN THE COURT OF THE HONBLE XVIII SENIOR CIVIL JUDGE COURT, CITY CIVIL COURT, AT: HYDERABAD.
E.P.NO. 22 OF 2025
IN
A.S. No. 34 OF 2020
IN
O.S.NO. 51 OF 2006

BETWEEN:
R.K. PARLEKAR (DIED AS PER LRS) ... DECREE HOLDERS/ PLAINTIFFS
AND
V. SUBHASH CHANDRA REDDY & ANOTHER ... JDR'S/ DEFENDANTS

NOTICE

To,
1. V. SUBHASH CHANDRA REDDY S/o V.M.M.REDDY, Aged about: 35 years, Occ: Software Engineer, R/o Ashburn, V.A., U.S.A,20147, Rep by his G.P.A Holder Ch.Dayanand Reddy S/o Late Ch.Linga Reddy Aged about: 55 years, Occ: service,
2.Ch.Dayanand Reddy S/o Late Ch.Linga Reddy, Aged about: 55 years, Occ: service, R/o S-2, mch No. 2-2-647/125/A, Central Excise Colony, Hyderabad

Please take Notice that the above said Decree Holders/Plaintiffs have filed an E.P against you on the file of Hon'ble XVIII Senior Civil Judge court, Civil Court, Hyderabad vide E.P.No. 22 OF 2025, being aggrieved by the judgment and decree in A.S.No. 34/2020, The said E.P. is posted on 17.03.2025 for your appearance. Please be present in the court on the above said date either in person or through your authorized representative at 10.30 A.M. on **17.03.2025,** failing which, the Hon'ble Court shall pass appropriate orders placing you exparte.

//BY THE ORDER OF THE COURT//
SRI.DEEPAK DESHPANDE,
K. SANDEEP,
ADVOCATES.
H.No:3-5-167/1/4A, First Floor, Narayanaguda,Hyderabad
Cell : 9849054599,9014703889

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJ-GIRIDISTRICT
AT: MEDCHAL
O.S. No. 42 OF 2025

Between :
M.Vijay S/o Late M.Madan Mohan
Rep. by his .G.P.A Holder
A. Laxma Reddy
...Plaintiff
AND
T.Nageswara Rao and Another
...Defendants

To,
1. T.Nageswara Rao S/o Lakshmi Narayana,Aged about 80 Years Occ : Business,R/o. H.No.5-8-31, Nampally , Hyderabad–12.
...Defendant No.1

The Plaintiff herein filed the above suit against the Defendants before the Hon'ble Additional Senior Civil Judge, Medchal-Malkajgiri District at Medchal. That the above Suit i.e., O.S.No.42 of 2025 and an application filed under order 39 Rule 1 & 2 of C.P.C. in the above suit is posted on 13-03-2025 at 10:30A.M., for the appearance of Defendant No.1 before the Hon'ble Additional Senior Civil Judge, Medchal-Malkajgiri District at Medchal. That incase of your absence on **13-03-2025** before the above said court, the matter will be decided on merits.

(BY ORDER OF THE COURT)
M/s. M. RAVI KUMAR
Advocate
H.No.5-11-22,Sanjay Gandhi Nagar , Shapur Nagar, IDA Jeedimetla Hyderabad-500055.
Mobile No: 9700389333

LOSS OF DOCUMENT

I, **P.VEDAVYAS REDDY, S/O.SRI P.SUBBA REDDY,** R/O.H.No.10-2-289/21, Shanthi Nagar, Masab Tank, Behind JNTU, Asif Nagar, Hyderabad-500028, Telangana State,I lost my Bag which contains **my Original Regd Sale Deed bearing Document No.7874/ 2019, dt: 02-05-2019 (Sale Deed), Link Documents Vide Regd Doc No.7781/ 2019(Gift Deed), dated. 12-03-2019, and Doc No. 2435/08, Dated.26-03-2008.** The Above Sale deeds and Link Documents are registered at SRO of Rangareddy, If any body found **Call: 7989138158**

PUBLIC NOTICE

The general public is hereby informed that my client **Sri.KARNATI MUTHYAM REDDY S/o K.YADAVA REDDY** aged about 66years Occ:Business, R/o H.No.7-2-104/15/2, Yashodara Nagar , Near Medicare Hospital Bairamlguda, Chintalkunta, L.B Nagar Reanga Reddy District. are entered into an agreement of sale to purchase the all that piece and parcel of open land bearing Plot No.290 Western Part, admeasuring an area of 200Sq.yards & Plot No.290 Eastern Part, admeasuring an area of 100 Sq.Mtrs, in Sy. No.59 Part, Situated at Vishveshwaraiah Engineering Colony, in Karmanghat Village Saroor nagar Revenue Mandal, under Ward No.8, Block No.7 of L.B Nagar Circle of G.H.M.C., Ranga Reddy District, with MAKKAPATI VENTESHWAR RAO S/o MAKKAPATI BHAGAVANTH RAO age about 73years occ: Retd employee, R/o H.No.16-1-18/30/A, Saidabad colony, Saidabad Hyderabad, Presently R/o Plot No.84, Road No.4 jayakrishna Enclave, Hasthinapuram, Karmanghat, Saroornagar Mandal, Ranga Reddy district-500079 and MAKKAPATI SREEMATHI W/o MAKKAPATI VENKATESHWR RAO age about 64 years occ: House hold R/o H.No.16-1-18/30/A, Saidabad Colony, Saidabad, Hyd-59 and paid considerable sale consideration as advance. If any person or persons who are having any objections over the title and possession over the above mentioned plot, may approach the below given addressee with relevant documents, within ONE WEEK from the date of this publication, otherwise, my clients shall go ahead with the said purchase by getting the above mentioned plot registered as per law and any objections thereafter shall be deemed invalid and illegal.

SCHEDULE OF PROPERTY

All that the open land bearing Plot No.290 Western Part, admeasuring an area of 200Sq.yards & Plot No.290 Eastern Part, admeasuring an area of 100 Sq.Mtrs, in Sy. No.59 Part, Situated at Vishveshwaraiah Engineering Colony, in Karmanghat Village Saroornagar Revenue Mandal, under Ward No.8, Block No.7 of L.B Nagar Circle of G.H.M.C., Ranga Reddy and bounded as follows:North: 30'Wide Road
South: Plot No.305
East : Plot No.291
West : Plot No.289

G. Ramachander Rao,
G. Vishnu Vardhan.
Advocates.
Office @ H. No. 10-1-74/2, Srinivasa Nagar Colony, Lingojiguda, Karmanghat, Hyderabad. 035.
© 8977882895. 9502069281.

FORM NO.2 SUMMONS FOR SETTLEMENT OF ISSUES
(Order V Rules 3 &5)
IN THE COURT OF THE HON'BLE XITH JUNIOR CIVIL JUDGE , CITY CIVIL COURT.
AT:: SECUNDERABAD
O.S.No. 266 OF 2024

BETWEEN:
Mr Sikkam Venkat Rao S/o Late Mr Rama Swamy, aged about 47 years, Occ: Private and Resident of H.No 12-1-1119/283, Indiranagar, North Lallaguda, Secunderabad. - 500017.
..Petitioner/Plaintiff
AND
1). Mrs Gajula Anitha W/o Late Mr Gajula Srinivas, aged about 52 years, Occ: House Wife and R/o H.No 109/C, Second Floor, Barthan Compound, Secunderabad, Telangana State, Aadhar No: 7590-5172-0770,PAN No: ARLPG5734B, Mobile No: 8125666214.
2). Mr.P.V.Tusi Sai Ram S/o Mr P.V.Vishwanatham, aged about 32 years, Occ; Business and R/o H.No 12-1-1119/281/1, Indira Nagar Colony, North Lallaguda, Secunderabad, Telangana state, Aadhaar No 2608-6446-2833, PAN No: EUBPP9818J, Mobile No: 8125666214.
3). Mr Diddi Vidyanandh S/o Mr Didi Atmaram, aged about 35 years, Occ: Business and R/o H.No 13-110/2, Katamaya Nagar, Alair, Yadadri-Bhongir District - 508101, Aadhaar No: 9310-7954- 3037, PAN No: bogpd0385A, Mobile No: 9948738605.
..Respondent/Defendant

Whereas the above mentioned plaintiff has instituted as suit against you all for Suit For Cancellation Of Registered Sale Deed Document No 3503 Of 2022, Dated 19 th October, 2022, As The Same Is Null And Void. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions on the 04th day of March, 2025, at 10–30 hrs, in the forenoon to answer the claim, and further, you are hereby directed to file within 30 days of service of summons a written statement of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense. Take notice that in default of your appearance and to file your written Statement within 30 days the suit will be heard and determined in your absence.

(BY ORDER FO THE COURT)
K.R.VIJAY & ASSOCIATES
ADVOCATES FOR THE PLAINTIFF'S
H.NO 12-5-35/A/B, Flat No S-7, Ballad Estate Tarnaka, Secunderabad-500017.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, MED-CHAL-MALKAJGIRIDISTRICT
AT: MEDCHAL
O.S. No. 42 OF 2025

Between :
M.Vijay S/o Late M.Madan Mohan
Rep. by his .G.P.A Holder
A. Laxma Reddy ...Plaintiff
AND
T.Nageswara Rao and Another
...Defendants

To,
1. M/S. Padmaja Ventures and Financial Services Represented by its Managing Partner,
Ch. Padma Kishore W/o Ch. Kishore Babu,Aged about 60years Occ: Business,Office at Plot. No. 160, A.W.H.O Colony, Sector A, Phase-III, Gautam Enclave,Secunderabad, 500009
....Defendant No. 2

The Plaintiff herein filed the above suit against the Defendants before the Hon'ble Additional Senior Civil Judge, Medchal-Malkajgiri District at Medchal. That the above Suit i.e., O.S.No.42 of 2025 and an application filed under order 39 Rule 1 & 2 of C.P.C. in the above suit is posted on **13-03-2025** at 10:30A.M., for the appearance of Defendant No.2 before the Hon'ble Additional Senior Civil Judge, Medchal-Malkajgiri District at Medchal. That incase of your absence on **13-03-2025** before the above said court, the matter will be decided on merits.

(BY ORDER OF THE COURT)
M/s. M. RAVI KUMAR
Advocate
H.No.5-11-22,Sanjay Gandhi Nagar , Shapur Nagar, IDA Jeedimetla Hyd-500055.
Mobile No: 9700389333

IN THE COURT OF THE HON'BLE SPECIAL J.F.C.M. EXCISE-CUM-V ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-V ADDL. METROPOLITAN MAGISTRATE,
AT ::L.B. NAGAR
E.P. No. 1 OF 2024
IN
O.S. No. 706 OF 2021

Between:
Sri. R. Devaiah and another
....Decree Holders/Plaintiffs
AND
Smt. T. Rama
.. Judgment Debtor/Defendant

To,
Smt. T. Rama, W/o. T. Sanjeeva Yadav,R/o. Plot No. 265, Chaitanya Nagar,Karmanghat Village, Hyderabad – 500 079.

Madam,
The Decree Holders have filed the above Execution Proceedings against you praying the Hon'ble Court to execute and register a sale deed in their favour in respect of the E.P. Schedule Property and to hand over vacant possession of the same. The case is posted to **10.04.2025** for your Appearance. You are required to attend the Hon'ble Court on the said date at 10.30 a.m., failing which, the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
A SANJAY,
ADVOCATE
H. No. 2-4-215, Road No. 9A, Snehapuri Colony, Nagole, Hyderabad – 500 035,
Cell : 99660 88568

IN THE COURT OF THE HON'BLE VIII ADDL JUNIOR CIVIL JUDGE RANAGA REDDY DISTRICT: AT: KUKATPALLY
O.S NO. 355 OF 2023

BETWEEN:
D.ChandrasekharNaik and another .....Plaintiffs
AND
M.Sudheer Kumar & 6
.... Defendants

To,
1. M. Sudheer Kumar, S/o. M.M. Rao, Aged 32 years, Occ; Advocate, R/o. F-14, Shettipally Apartments, Street No.6, Himayathnagar, Hyderabad, Telangana State. Defendant No.1
2. Rajeshwari Omprakash Molankar, W/o. Sri Omprakash Ramchandar Molandar, aged about 47 years, Oce: House-wife, R/o. H.No. 11-4-167/1/A Bazarg hat, Hyderabad, Telanga na State.
..Defendant No.3
3. S. Vishnu, S/o. Late Brahmai ah, aged 54 years, Occ: Business, R/o. H.No. 1-23, Nallagandia Village, Seri LingampallyMandal Municipality, R.R. District, Telangana State
...Defendant No.4
4. MandagaddaBalajah, S/o. Late M. Lingaiah, aged 86 years, Occ: Agriculture, R/o. Chandanagar Village, R.R.District, Telangana State. ....Defendant No.7

Please take Notice in the above suit, in the above suit filed by the Plaintiffs above suit against the Defendants seeking for the for the Perpetual Injunction & for Declaration of the Agreement of sale Cum General Power of Attorney No. 1977 of 2008, Sale Deed No.9046 of 1998,AGPA bearing No:6682 of 1998, sale Deed bearing No.9020 of 1990 as Null and Void And not binding upon us, and said the case OS 355/2023 is posted to 24-003-2025 for your appearance, written. statement and hearing.
Hence, You are appear before the above Ho'ble Court on
24-03-2025 at 10.30 am either in person or through counsel in the above suit, failing which the suit will be heard and decided to ex-parte.

V.M.KRISHNA REDDY
(Counsel for Plaintiffs)
Advocate



సైన్స్ దినోత్సవం సందర్భంగా కుంట్లూరు సన్ రైస్ హై స్కూల్లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను స్కూల్ డైరెక్టర్ గిరిధర్ పరిశీలించారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు విద్యుత్‌కు అంతరాయం

నవతెలంగాణ- నాగోల్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా నాగోలు డివిజన్‌లోని పలు కాలనీలల్లో విద్యుత్ మరమ్మత్తులు చేస్తున్నందున (నేడు) సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సరూర్‌నగర్ విద్యుత్ డీఈ రామకృష్ణ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11 కెవి నాగోల్ విద్యుత్ లీడర్ లైన్ లో న్యూ నాగోల్, నాగోల్ ఎక్స్ రోడ్, నాగోల్ మెయిన్ రోడ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అదేవిధంగా లెవెన్ కె.వి హనుమాన్ నగర్ లీడర్‌లో సాయి నగర్‌లోని రోడ్ నెంబర్ 1, 2, 3, చాణిక్యపురి కాలనీ, హనుమాన్‌నగర్ పరిసర ప్రాంతాలలో, లెవెన్ కె.వి గోటేటి ఫంక్షన్ హాల్ ఫీడర్లో రాక్ టౌన్ రోడ్ నెంబర్ 1 ,2, 3, లలిత నగర్ గోటేటి ఫంక్షనల్ పరిసర ప్రాంతాలలో, 11 కెవి సాయి నగర్ ఫీడర్లో చాణిక్యపురి కాలనీ, సాయి నగర్ రోడ్ నెంబర్ 1 ,2, పరిసర ప్రాంతాలలో ఉదయం 11 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు, 11 కెవి కమల నగర్ ఫీడర్లో సరస్వతీ నగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, కమలానగర్, వివేకానంద నగర్ లతోపాటు పరిసర ప్రాంతంలో, 11 కెవి జైన్ మందిర్ ఫీడర్ లైన్‌లో న్యూ మారుతి నగర్, బాబు కాంప్లెక్స్, పోస్ట్ ఆఫీస్ పరిసర ప్రాంతంలో మధ్యాహ్నం రెండు నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ నిలిచిపోతుందని తెలిపారు.

గ్రంథాలయాన్ని ప్రారంభించిన మల్‌రెడ్డి రాంరెడ్డి





నవతెలంగాణ- నాగోల్

నాగోల్ డివిజన్‌లోని శ్రీ సాయి నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆదివారం రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలు సామాజిక ఆవశ్యకత మాత్రమే కాకుండా, అన్ని వయస్సుల వారికి విజ్ఞానాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని అన్నారు. సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయం వారికి సమాజంతో మరింత మమేకమయ్యేలా చేస్తుందని, పుస్తక పఠన సంస్కృతిని ప్రోత్సహించడంలో ఈ తరహా గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సాయి నగర్‌లోని ప్రస్తుత సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటికి త్వరలోనే పరిష్కార మార్గం చూపేందుకు తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా 44 కాలనీల వాసులు ఎదుర్కొంటున్న జీవో 118 సమస్యను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గతంలో డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్మాణాలతో కూడిన స్థలాన్ని క్రమబద్ధీకరించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో జీవో 118 తీసుకొచ్చి కన్వీయన్స్ డీడ్‌తో పూర్తి హక్కులు అని చెప్పి గజానికి రూ.250 లెక్కన నివాసితుల వద్ద ఫీజును వసూలు చేశారని అన్నారు. రిజిస్ట్రేషన్ చేసిన కన్వీయన్స్ డీడ్ లోపభూయిష్టంగా ఉండడం వలన అనేక కొత్త సమస్యలు తలెత్తాయని అన్నారు. కేవలం ప్లాటు క్రమబద్ధీకరించి, నిర్మాణాన్ని క్రమబద్ధీకరించకపోవడం వలన సమస్యలు వచ్చాయి అని తెలిపారు. పాత విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వివరించారు. ఈ సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థాయిలో ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మంజుల రెడ్డి, సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, గ్రంథాలయ ఫోరం ప్రతినిధులు దయానంద్ రెడ్డి, శ్రీనివాస చార్యులు, రామచంద్రా రెడ్డి, కాలనీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రేవంత్, ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు లోకేష్ రెడ్డి, జేబీ గౌడ్, అరుణ్, కిరణ్, శివ, సీనియర్ సిటిజన్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-ఎల్బీనగర్

లింగోజిగూడ డివిజన్ పరిధిలోని శాతవాహన కాలనీలో దాదాపు 53 లక్షల రూపాయలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎల్బీనగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో చిన్నపాటి వర్షానికి కాలనీలు జలమయం అయ్యేవి అని గుర్తుచేశారు. నూతన డ్రైన్స్ వ్యవస్థ ఏర్పాటు చేసి వరదనీటి ముంపు సమస్యల నుంచి విముక్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు తిలక్ రావు, చిత్తలూరి వెంకటేశ్వర్లు, మధు సాగర్, రాజేందర్, మురళి, ఆశిష్, చిత్రం సాయి, కాలనీ వాసులు గోపాల్ రెడ్డి, అధ్యక్షులు శ్రీపతి రావు, జనరల్ సెక్రటరీ అశోక్ గౌడ్, రవి కుమార్, జగదీష్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, రాఘవేందర్ రాజు, వెంకట్, రమణచారి పాల్గొన్నారు.

సమాజ సేవలో అక్షిత ఫౌండేషన్





9 ఏండ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు

అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపాక సన్నీ కుమార్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో ఎంతో మంది కన్న తల్లీదండ్రులకు సైతం సేవ చేయడం కష్టంగా మారింది. ఎంతో మంది వృద్ధాప్యంలో ఉన్న తల్లీదండ్రులకు కన్న బిడ్డల ఆలనా పాలనా లేకపోవడంతో వారు కొన్ని సంవత్సరాల తరబడి చలి, ఎండ, వాన అనే తేడా లేకుండా హైదరాబాద్ మహా నగరంలో రోడ్లకు ఇరువైపులా దిక్కు మొక్కు లేని అనాథలుగా జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారికి అండగా ఉండేందుకు "అక్షిత ఫౌండేషన్" అనే ఒక సంస్థను రాపాక సన్నీ కుమార్ స్థాపించారు. ఇతను మనకు తోచినంతలో సాటి వారికి సహాయం చేయాలన్న మంచి మనసు ఉంటే సరిపోతుందని భావించి.. ఎవరి దగ్గర చేయి చాచకుండా తమవంతు సహాయం చేస్తున్నాడు. మానవ సేవే మాధవ సేవగా భావించి మానవతా హృదయంతో సేవ చేయడం అది మన గొప్పతనం కాదని మన బాధ్యత అని గుర్తు చేశాడు సన్నీ కుమార్ రాపాక...తన ఫౌండేషన్ ద్వారా రోడ్ల పక్కన భిక్షాటన చేసే కొన్ని వందల మందికి భోజనాన్ని అందచేయడం, వృద్ధులకు, బీదవారికి దుప్పట్లు పంపిణీ చేయడం, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ష, బాగ్స్ , నోట్ బుక్స్, జామెట్రిక్ బాక్స్, గ్రాఫ్స్ లాంటివి అందజేసి తన ఉదారతను చాటుకుంటున్నారు. అంతే కాకుండా అనాథ ఆశ్రమంలో ఉండే అనాథలకు విశేష అన్నదాన కార్యక్రమాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, తల్లీదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పిల్లలను బడిలో చేర్పించడం, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందించడం, వృద్ధ కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేయడం, వృద్ధులను హాస్పిటల్స్‌లో చేర్చడం,పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు పెద్దలకు బట్టలు పంపిణీ చేయడం లాంటి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో సమాజ మార్పు కోసం తనవంతు కృషి చేస్తున్నాడు.






సమాజంలో ఎంతో మంది ఆర్థికంగా కోటీశ్వర్లుగా ఉన్నారని, వారు చేయలేని సహాయ కార్యక్రమాలను చేస్తూ పేద ప్రజల ఆదరాభిమానాన్ని పొందడం గొప్ప అనుభూతిగా అవకాశంగా భావిస్తున్నట్లు సన్నీ కుమార్ తెలిపారు. పేద ప్రజలను ఆదుకోవడం తన జీవిత లక్ష్యం అని సన్నీ కుమార్ అంటున్నాడు. నేటి సమాజంలో ఎంతో మంది తినడానికి తిండి లేక, కన్న బిడ్డల ఆదరణ లేక, దిక్కు మొక్కు లేని అనాథలుగా జీవనం సాగిస్తున్న వారిని చేరదీసి వారికి అండగా ఉండి మానవతా హృదయంతో అన్నదానం చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. మాట్లాడే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అని భావించి.. తనకు తోచిన విధంగా సహాయం చేయడమే తన జీవిత లక్ష్యంగా భావించడం జరుగుతుందని సన్నీ కుమార్ అంటున్నారు.

పరీక్షల్లో టెన్షన్ వద్దు...

5వ తేదీ నుంచి 24 వరకు ఇంటర్ పరీక్షలు





నవతెలంగాణ-హయత్‌నగర్

ఈ నెల 5వ తేదీ నుండి 24 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం వేసేది ఈ పరీక్షలు. ప్రతి విద్యార్థి మంచి మార్కుల కోసం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందే.. అయితే పరీక్షలు దగ్గర పడుతున్న కొద్ది విద్యార్థులు ఆందోళన చెందుతుంటారు. సిలబస్‌ను పూర్తిగా చదవలేదు అని కొందరు, రివిజన్ కాలేదని మరికొందరు టెన్షన్ పడుతుంటారు. ఈ సమయంలో టెన్షన్ పడొద్దు అని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటి వరకు చదివిన పాఠాలను రివిజన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. కొత్త పాఠాల జోలికి వెళ్ళకూడదు. కొందరు విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అవుతామని, తల్లిదండ్రులు ఏమంటారోనని ఆందోళన చెందుతుంటారు. అలాంటి విద్యార్థులకు తల్లిదండ్రులు అండగా నిలచి, భరోసా నివ్వాలి. అప్పుడే వారు ప్రశాంతగా పరీక్షలు రాయాగలుగుతారు.

క్యూ ఆర్ కోడ్‌తో పరీక్ష సెంటర్ తెలుస్తుంది



హాల్ టికెట్‌లో ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే, పరీక్ష రాసే విద్యార్థులు టెన్షన్ పడకుండా పరీక్ష సెంటర్ ఎక్కడ పడిందో తెలిసిపోతుంది. హయత్‌నగర్ ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల నుండి మొత్తం 486 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే హాల్ టికెట్ పై ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 924కు తెలియజేయాలి. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 12 పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. సుమారు 6వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ప్రతి పరీక్ష కేంద్రం సీసీ కెమెరా నిఘాలో ఉంటుంది. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

- ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్ రెడ్డి

టైం టేబుల్ అనుసరించండి...

టైం టేబుల్ పెట్టుకొని సరిగ్గా అమలు చేయాలి. ప్రతి సబ్జెక్టుకూ నిర్ణీత సమయం కేటాయించాలి. చదివేది ఎన్ని గంటలైనా అర్థం చేసుకుని చదవాలి. గత సంవత్సరపు ఇంటర్ పరీక్ష పేపర్లు, మోడల్ పేపర్లు, ప్రతి చాప్టర్ తర్వాత ఇచ్చే ప్రశ్నల్ని ప్రాక్టీస్ చేయాలి. పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున రివిజన్ అనేది చాలా ముఖ్యం. ఇప్పటి వరకు చదివిన వాటిని రివిజన్ చేసుకోవాలి. దీనివలన ఇంతకు ముందు చదివిన పాఠాలు వెంటనే మదిలో మెదులుతాయి. పరీక్షలకు ప్రిపేర్ అయ్యేటప్పుడు అలిసిపోకుండా బలవర్ధకమైన, తేలికపాటి ఆహారం తీసుకోవాలి. రోజు కనీసం ఏడు గంటలు నిద్రపోయేటట్టు చూసుకోవాలి. నిద్ర లేకపోతే పరీక్షలప్పుడు సరిగ్గా రాయలేక టెన్షన్ పడాల్సి వస్తుంది. హ్యాండ్ రైటింగ్ బాగా ఉండేటట్లు చూసుకోవాలి. సోషల్, బయాలజీ, లాంగ్వేజ్ రాసేటప్పుడు సైడ్ హెడ్డింగ్స్ ఉండే విధంగా చూసుకోవాలి. దీంతో ఆన్సర్ పేపర్ నీట్‌గా కనిపిస్తుంది. పరీక్షలు రాసేటప్పుడు కన్ఫ్యూజ్ కావద్దు. ముందుగా తెలిసిన ప్రశ్నలకు సమాధానం రాయాలి. చివర్లో వదిలేసిన ప్రశ్నలపై మాత్రమే దృష్టి పెట్టాలి.

టిప్స్ పాటించాలి..

ముఖ్యమైన చాప్టర్లకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. లెక్చర్ నోట్స్, మెటీరియల్స్‌ను చదవాలి. ప్రతి కాన్సెప్టును నిర్వచించడం, విశ్లేషించడం, అనువర్తించడం వంటి విధానంలో చదవాలి. అంశాన్ని చదువుతున్నప్పుడు సమయపాలన, కచ్చితత్వం అవసరం. వీటిని తప్పకుండా పాటించాలి. ప్రతి సబ్జెక్టుకు ఒక నిర్దిష్ట ప్రణాళికను రూపొందించుకోవాలి. తగినట్లుగా ఏ రోజు చదవాల్సిన అంశాలను ఆరోజు చదివేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేయకూడదు. దీర్ఘ సమాధాన, స్వల్ప సమాధానం, అతి స్వల్ప సమాధాన ప్రశ్నలతో ఉదాహరణలపై దృష్టి సారించాలి. పాఠ్య పుస్తకాలను చదువుతున్నప్పుడు ముఖ్యమైన అంశాలను అండర్ లైన్ చేయాలి. ఇలా చేస్తే చివర్లో క్విక్ రివిజన్‌కు ఉపయోగపడుతుంది. అంతా చదివానుకోకుండా వీలైనంత రివిజన్ చేయాలి.

ఉత్సాహంగా డిసిబెల్ డాష్ రన్

వినికిడి సమస్యలపై అవగాహనా పరుగు

నవతెలంగాణ-సిటీబ్యూరో

డెసిబెల్ డ్యాష్-2025 ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా మౌర్య ఫౌండేషన్, మైక్రో కేర్ ఈఎన్ టీ ఆస్పత్రి వారి నేతృత్వంలోని హియరింగ్ అవేర్‌నెస్, కేర్ కోసం గ్లోబల్ మూవ్‌మెంట్ లిడిసిబుల్ డాష్ 2కే, 5కే, 10కే, వర్చువల్ రన్‌ను ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివ సేన రెడ్డి, ప్రకాష్ కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ ఈ రన్ ఫర్ హియరింగ్ అనేది వినికిడి ఆరోగ్యం గురించి అవగాహన పెంచడానికి, వినికిడి లోపం ఉన్న వ్యక్తులకు సహాయం చేయడానికి మౌర్య ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమం అని తెలిపారు. సమస్యలను ముందస్తుగా గుర్తించడాన్ని ప్రోత్సహించడం, యాక్సెస్ చేయగల వినికిడి సంరక్షణను అందించడం, ధ్వని-అవగాహన కమ్యూనిటీ కోసం చర్యను ప్రేరేపించడం ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్, కేపీహెచ్‌బీ బ్రాంచ్‌లలో ఉన్న మైక్రోకేర్ ఈఎన్‌టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో నేటి నుంచి 10వ తేదీ వరకు ఉచిత ఇయర్ స్క్రీనింగ్ చెక్ అప్ చేయనున్నట్టు తెలిపారు. డాక్టర్ అశ్వినీ అమరేశ్వర్ మాట్లాడుతూ "వినికిడి ఆరోగ్యం గురించి ప్రపంచవ్యాప్త అవగాహనను



పెంపొందించడం, ముందస్తుగా గుర్తించడాన్ని ప్రోత్సహించడం, వినికిడి లోపాలతో ఉన్న వ్యక్తులను కలుపుకుని, ఆకర్షణీయమైన కార్యక్రమం ద్వారా మద్దతు ఇవ్వడం మా లక్ష్యం" అని తెలిపారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి



హైకోర్టు జడ్జి సురపల్లి నంద

నవతెలంగాణ -నాగోల్

మహిళలు వంటింటికే పరిమితం కాకుండా.. అన్ని రంగాలలో రాణిస్తూ ప్రధానంగా రాజకీయాలలో ముందుకు సాగుతూ ఉన్నత పదవులను స్వీకరించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ సురపల్లి నంద మహిళలకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నాగోల్ డివిజన్‌లోని పిపిఆర్ కన్వెన్షన్‌లో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ భాగస్వామ్యం చాలా విస్తృతమైన పదం అని, దీని అర్థం కూడా చాలా విస్తృతమైనదని, భాగస్వామ్యం అంటే ఓటు హక్కుకి పరిమితం కాదు, అన్నింటికీ సంబంధించిందని, అంటే నిర్ణయం తీసుకోవడం రాజకీయ క్రియాశీలత రాజకీయ స్పృహ మొదలైనవి అని వివరించారు. భారత దేశంలోని మహిళలు ఓటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలోనూ దిగువ స్థాయిలలో పురుషుల కంటే ఎక్కువ పోటీ చేస్తారని చెప్పారు. రాజకీయ క్రియాశీలత ఓటింగ్ రంగాలలో మహిళల రాజకీయ భాగస్వామ్యం బలంగా ఉంటుందన్నారు. రాజకీయాల్లో లింగ అసమానతలను రూపుమాపడానికి భారత ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ స్థానాలలో మహిళల కోసం రాజకీయ రిజర్వేషన్లు ఏర్పాటు చేసిందని అన్నారు.

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ ప్రెసిడెంట్ అశోక్ అగర్వాల్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలు రాజకీయ రంగాలలో రాణిస్తున్నారని, ఉదాహరణకు న్యూఢిల్లీ శాఖ కన్వీనర్‌గా ఉన్న గీత గుప్తా ఈరోజు ఢిల్లీ ముఖ్యమంత్రిగా కావడం చాలా అభినందనీయమని అన్నారు. అదే కోవలో తెలంగాణలో రాష్ట్రంలో కూడా మహిళలు ముఖ్యమంత్రి స్థాయికి ఎదగాలని అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ శాఖ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ వైస్ చైర్మెన్, పూర్వపు టూరిజం శాఖ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త మాట్లాడుతూ.. నేడు స్త్రీలు బయటకు వచ్చి పురుషులతో పోటీగా చదువుతూ ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. అయితే స్త్రీ సాధికారత వల్ల గృహిణి పాత్ర మాత్రం కాస్త తక్కువైందని, పిల్లలకు తల్లి శిక్షణ కొరబడిందని, స్త్రీ ఆర్థిక స్వేచ్ఛ దుర్వినియోగం వల్ల కుటుంబ వ్యవస్థ కాస్త బలహీన పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ సలహా కమిటీ చైర్మెన్‌గంజి రాజమౌళి గుప్తా, తెలంగాణ ఐవీఎఫ్ చీఫ్ అడ్వైజర్ ముత్యాల సత్తయ్య, ఐవీఎఫ్ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంటు కక్కిరాల రమేష్, ఐవీఎఫ్ సెంట్రల్ ఈసీ మెంబర్లు గట్టు మహేష్, జి.చంద్రయ్య, మహిళా చైర్ పర్సన్ ఉప్పల స్వప్న, అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి లెంకలపల్లి మంజుల, కోశాధికారి సేగు నలిని కుమారి, అడ్వైసర్ కలకొండ మనిమాల, ఐవీఎఫ్ ప్రధాన కార్యదర్శి పబ్బా చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారి కొడిపాకా నారాయణ గుప్త, అధనపు ప్రధాన కార్యదర్శి కటకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మైండ్ స్పేస్ 'ఆర్ఈఐటీ' ఈకో రన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ విశాలమైన విశ్వంలో మనకున్న ఏకైక భూగ్రహాన్ని కాపాడుకోవాలనే విలువైన సందేశాన్ని ఇస్తూ.. మైండ్ స్పేస్ ఆర్ఈఐటీ, రేడియో మిర్చి సంయుక్తంగా నిర్వహించిన మైండ్ స్పేస్ ఆర్ఈఐటీ ఈకో రన్ ఆద్యంతం ఆకట్టుకుంది. 4 వేలకు పైగా రన్నర్లతో... మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్‌లో ఆదివారం తెల్లవారు జామున మొదలైన ఈ ఈకో పరుగు... తిరిగే అదే గమ్య స్థానంలో ముగిసింది. హైదరాబాద్‌తో పాటు రాజస్థాన్, పాండిచ్చేరి, మదురై, తిరునెల్వేలితో సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అథ్లెట్లు ఈ రన్‌లో పాల్గొన్నారు. వ్యర్థాలను తగ్గించడం, చెట్లు నాటడం, ఆరోగ్యంతో పాటు ప్రకృతిని రక్షించడం వంటి విషయాలపై తీసుకోవాల్సిన చర్యల ప్రాముఖ్యతను చాటుతూ ఈ రన్ సాగింది. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయల సంస్థ-టీఎస్ఐఐసీ ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఈ.విష్ణు వర్ధన్ రెడ్డి



21 కిలోమీటర్ల పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ కే.రహేజా కార్పొరేషన్ సీవోవో శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో పర్యావరణ హిత అలవాట్లు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి నొక్కి చెప్పారు. మిర్చి ఆర్జేలు స్వాతి, గౌరిక ఈకో రన్‌లో పాల్గొన్న వారిని తమ మాటలతో నిత్యం ఉత్సాహపరుస్తూ... కార్యక్రమాన్ని కోలహాలంగా మార్చేశారు. సినీనటులు విక్రాంత్ రెడ్డి, చాందిని చౌదరి, కూడా ఈ రన్‌లో పాల్గొని, తమ అభిమానులను పలకరించారు. మైండ్ స్పేస్ ఆర్ఈఐటీ సీఈవో రమేశ్ నాయర్ మాట్లాడుతూ "మైండ్ స్పేస్ ఆర్ఈఐటీ ఈకో రన్ కేవలం ఒక పరుగుల పోటీ కాదు. పర్యావరణ పరిరక్షణ కోసం, భూమి కోసం ఈ రోజు ఒక అడుగు పడింది. ఈ పరుగులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పర్యావరణంపై తమకు ఉన్న ప్రేమను చాటుకున్నారు. మన ఆరోగ్యంతో పాటు ప్రకృతిని కూడా మన బాధ్యత అని రన్నర్లు ప్రపంచానికి తెలియజేశారు" అని అన్నారు. అన్ని స్థాయిల రన్నర్లకు అనుగుణంగా 5కే, 10కే, 21కే విభాగాల్లో మైండ్ స్పేస్ ఆర్ఈఐటీ ఈకో రన్ నిర్వహించారు. 18 ఏండ్లు పైబడిన వారి కోసం 21 కిలోమీటర్ల, 10 కిలోమీటర్ల పరుగు, 8 ఏండ్లు పైబడిన వారి కోసం 5 కిలోమీటర్ల పరుగులో పాల్గొన్నారు.


నవతెలంగాణ
మానవి
సోమవారం
3 మార్చి 2025
హైదరాబాద్
www.navatelangana.com

వారి త్యాగాల రూపమే ఉమెన్స్ డే



ఎందరో మహిళా మూర్తుల త్యాగఫలమే నేడు మనం జరుపుకుంటున్న మహిళా దినోత్సవం. ఈనాడు మనం కొద్దో గొప్పో స్వేచ్ఛ అనుభవిస్తున్నామన్నా, మన సమస్యలపై గొంతు విప్పుతున్నామన్నా వారు అందించిన స్ఫూర్తి ఫలితమే. మహిళల కోసం ఓ రోజు ఉండాలని, మహిళల హక్కులు సమాజం గుర్తించాలని ఎన్నో పోరాటాలు చేశారు. ప్రాణాలకు తెగించి ఉద్యమించారు. చివరకు మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా నిలబెట్టారు. మరికొద్ది రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోబోతున్న సందర్భంగా ఆనాటి మహిళా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన త్యాగమూర్తుల పరిచయాలు క్లుప్తంగా...

పోరాటపటిమను రాజేసి



క్లారా జెట్కిన్... ఆమెకు వచ్చిన ఓ ఆలోచన వేలాది అడుగులకు బాటగా మారింది. వేలాది మహిళల జీవితాల్లో వెలుగులు నింపింది. జర్మనీలోని వైడెరౌలో 1857లో జన్మించిన క్లారా జర్మన్ మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, కమ్యూనిస్ట్ కార్యకర్త, మహిళల హక్కుల కోసం పోరాడిన ధీర. ఇలా ఆమె గురించి చెప్పుకుంటూ పోతే మహిళా హక్కుల కోసం ఆమె చేసిన కృషి అంతా ఇంతా కాదు. క్లారా లీప్‌జిగ్ టీచర్స్ కాలేజీ ఫర్ ఉమెన్‌లో చదువుకున్నారు. అక్కడే ఆమె సోజియాల్డెమోక్రాటిస్చె పార్టీ డ్యూచ్‌లాండ్స్ (సోషల్ డెమోక్రటిక్ పార్టీ)తో పరిచయాలను ఏర్పరచుకున్నారు. శతాబ్ద కాలానికి ముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భావానికి ఆమె ఆలోచనలే నాంది పలికాయి. మహిళ కోసం ఓ రోజు ఉండాలని.. ఆమె చేసిన ప్రతిపాదనకు వేలాదిమంది మహిళలు ఏకగ్రీవంగా ఆమోదించారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ రంగాల్లో ఎదగటానికి ఆమెకు వచ్చిన ఆ ఆలోచనలే బీజం వేశాయి. మహిళలు కూడా తమ హక్కుల కోసం పోరాడగలిగే ధైర్యాన్ని, తెగింపును, పోరాటపటిమను రాజేశాయి. సోషలిస్ట్ సమావేశాల్లో పాల్గొన్న కొద్ది నెలల్లోనే ఆమె పార్టీకి పూర్తిగా కట్టుబడి, మహిళా విముక్తి కోసం మార్క్సిస్ట్ విధానాన్ని అనుసరించారు. సోషలిజం ద్వారానే మహిళలకు సమాన అవకాశాలు, ఓటు హక్కు వస్తుందని క్లారా బలంగా నమ్మారు. అందుకే జర్మనీలో మహిళా ఉద్యమాన్ని అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించారు. 1907లో ఆమె ఎస్‌పీడీలో కొత్తగా స్థాపించబడిన 'ఉమెన్స్ ఆఫీస్'కి నాయకురాలయ్యారు. ఆమె అంతర్జాతీయ మహిళా దినోత్సవం(ఐడబ్ల్యూడి)లో కూడా ముఖ్యపాత్ర పోషించారు. ఆగష్టు 1910లో డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్‌లో సోషలిస్ట్ సెకండ్ ఇంటర్నేషనల్ సాధారణ సమావేశానికి ముందు అంతర్జాతీయ మహిళా సదస్సు నిర్వహించారు. అమెరికన్ సోషలిస్టుల ద్వారా ప్రేరణ పొంది జెట్‌కిన్, కేట్ డంకర్‌తో పాటు మరికొందరితో కలిసి 'ప్రత్యేక మహిళా దినోత్సవం'ను ఏటా నిర్వహించాలని ఆమె ప్రతిపాదించారు. అయితే ఆ సమావేశంలో తేదీని నిర్ణయించలేదు. తర్వాత 1911లో జరిగిన సమావేశాల్లో అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని ప్రతీ ఫిబ్రవరి 28వ తేదీన జరుపుకోవాలని నిర్ణయించారు. ■

మహిళా హక్కుల కోసం తపించారు




కృపస్కయా... సోవియట్ యూనియన్‌లో విద్యా వ్యాప్తికోసం ఎంతో కృషి చేశారు. కార్మికులకు అక్షరాలు నేర్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. విద్యనే వారిలో రాజకీయ చైతన్యం నింపే ఆయుధం అని విశ్వసించారు. అలాగే మహిళా హక్కుల కోసం అహర్నిశలూ తపించారు. గొప్ప విప్లవకారుడు లెనిన్‌కు భార్యగానే గాక అతని రచనలు ప్రపంచం ముందుకు వచ్చేందుకు నిరంతరం శ్రమించారు. కమ్యూనిస్టు పార్టీలో అనేక బాధ్యతలు నిర్వహించిన ఈమె సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిరుపేద కులీన కుటుంబంలో జన్మించారు. ఆమెలో మొదటి నుండి పేదల జీవితాలను మెరుగుపరచాలనే బలమైన కోరిక ఉండేది. తర్వాత కాలంలో మార్క్సిజంలోకి అడుగుపెట్టారు. 1894లో మార్క్సిస్ట్ చర్చా బృందంలో లెనిన్‌ను కలుసుకున్నారు. విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తూ 1896లో ఇద్దరూ అరెస్టయ్యారు. లెనిన్ సైబీరియాకు బహిష్కరించబడిన తర్వాత కృపస్కయా 1898లో ఆయన్ని వివాహం చేసుకున్నారు. 1905 విప్లవంలో పాల్గొనడానికి రష్యాకు తిరిగి వచ్చే ముందు వారిద్దరూ కొంత కాలం మ్యూనిచ్, లండన్‌లో నివసించారు. 1917 విప్లవం తర్వాత కృపస్కయా రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. 1924లో కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. 1929 నుండి 1939 వరకు డిప్యూటీ ఎడ్యుకేషన్ కమీషనర్, సోవియట్ అభివృద్ధితో సహా సోవియట్ విద్యా వ్యవస్థపై బలమైన ప్రభావం చూపించారు. 1939లో ఆమె మాస్కోలో మరణించింది. ■

మహిళల స్థితి మెరుగుపరిచేందుకు



అలెగ్జాండ్రా మిఖైలోవ్నా కొలోంటై... కొల్లోంటై ఇంపీరియల్ రష్యన్ ఆర్మీ జనరల్ కూతురు. ఈమె 1872, మార్చి 31న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జన్మించారు. 1890లలో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఆనాడు ఆమె కార్మికుల పక్షాన పోరాడుతున్న లెనిన్ ప్రతిపాదనలకు మద్దతుగా నిలిచారు. మొదటి సోవియట్ ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమానికి పీపుల్స్ కమీషనర్‌గా నియమితులయ్యారు. 1919లో సోవియట్ యూనియన్‌లో మహిళల స్థితిని మెరుగుపరచడానికి ఉద్దేశించిన సెంట్రల్ కమిటీ ఓ కొత్త మహిళా విభాగం జెనోట్‌డెల్ ఏర్పాటు చేశారు. దీన్ని నిర్మించడంలో ఈమె ముఖ్య పాత్ర పోషించారు. మహిళా విముక్తికై పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీపై నిప్పులు చెరిగే వారికి ఆమె ధైర్యంగా సమాధానం చెప్పేవారు. కార్ల్ కౌట్స్కీ, క్లారా జెట్‌కిన్, రోసా లక్సెంబర్గ్, కార్ల్ లైబ్‌నెచ్ట్ వంటి వారితో పరిచయం పెంచుకుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సం కోసం అహర్నిశలూ పోరాడిన వారిలో కొల్లోంటై కూడా ఒకరు. 1922 నుండి ఆమె నార్వే, మెక్సికో, స్వీడన్‌లలో దౌత్యవేత్తగా బాధ్యతలు నిర్వహించారు. 1943లో స్వీడన్‌కు రాయబారిగా పదోన్నతి పొందింది. 1945లో ఆ బాధ్యతల నుండి రిటైర్ అయ్యారు. కొల్లోంటై మాస్కోలో 9 మార్చి 1952న తన ఏనభై ఏండ్ల వయసులో మరణించింది. ■

ఆనాటి దుస్థితికి వ్యతిరేకంగా...



రోసా లక్సెంబర్గ్... జర్మన్ విప్లవకారిణి. అనేక విప్లవ సంస్థల స్థాపనలో కీలక పాత్ర పోషించారు. పోలిష్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ, స్పార్టకస్ లీగ్, జర్మనీ కమ్యూనిస్ట్ పార్టీలు స్థాపించి శ్రామికుల పక్షాన నిలిచారు. రాజకీయ సిద్ధాంతకర్తగా, మార్క్సిజం, మానవతావాద సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయంలో తన వంతు కృషి చేశారు. ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని అంతర్జాతీయంగా సాధించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రోసా 1871, మార్చి 5వ తేదీనా రష్యా పాలనలో ఉన్న పోలాండ్‌లోని దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఐదుగురు పిల్లలలో రోసా అందరికంటే చిన్నవారు. జార్ చక్రవర్తి నియంతృత్వ పాలను వ్యతిరేకంగా ఆనాడు ఎన్నో ఉద్యమాలు జరిగేవి. ఆడా, మగా తేడా లేకుండా ఎంతో మంది ఆ ఉద్యమాలకు ప్రభావితమయ్యారు. అలాంటి వారిలో రోసా కూడా ఒకరు. 1905 నాటి రష్యన్ విప్లవం రోసా జీవితాన్ని మరో మలుపు తిప్పిందని చెప్పవచ్చు. మహిళల ఆనాటి దుస్థితికి వ్యతిరేకంగా వారిని ఏకం చేసేందుకు, రాజకీయ చైతన్యం నింపేందుకు, ఉద్యమాల్లో భాగస్వామ్యం చేసేందుకు ఎంతో కృషి చేశాసింది. క్లారా జెట్కిన్‌తో పాటు మహిళలకు ఓ ప్రత్యేకమైన రోజు అవసరమంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది. 1919 జనవరి 15న ఆమె బెర్లిన్‌లో మరణించారు. ■

ట్రంప్ రాకతో..అమెరికాలో అదానీ పెట్టుబడులకు బాట

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన తర్వాత.. యూఎస్‌లో 15వేల ఉద్యోగాలను సృష్టించే 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు గౌతమ్ అదానీ హామీ ఇచ్చారు. అయితే, ఆ తర్వాత యూఎస్ యంత్రాంగాలు అదానీతో పాటు మరో ఏడుగురిపై తీసుకున్న చర్యల తర్వాత ఈ ప్రణాళికలు కార్యరూపం దాల్చలేకపోయాయి. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. కొన్ని మార్పులను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా అవినీతి పద్ధతుల చట్టం(ఎఫ్‌సీపీఏ)ను గతనెలలో నిలిపివేశారు. అయితే, ఇది అదానీ గ్రూపునకు కలిగిన పెద్ద ఉపశమనమని మార్కెట్ నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. అదానీ గ్రూపునకు చెందిన కొన్ని విశ్వసనీయ వర్గాలు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నాయి. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంతో అదానీతో పాటు ఇతరులపై ఉన్న కేసులు కొట్టుడుపోతాయని భావిస్తున్నాయి. ట్రంప్ వచ్చాక మేము కొన్ని ప్రణాళికలను రీయాక్టివేట్ చేశామని అదానీకి చెందిన కొన్ని వర్గాలు చెప్తున్నాయి. అయితే, దర్యాప్తు నిరవధిక స్వభావం మాత్రం ఇప్పటికీ ఆందోళనను కలిగిస్తుందని వివరించాయి. పెట్టుబడులు పెట్టాలని మాకు ఉన్నా.. కేసుల పరిష్కారమయ్యేంత వరకు మేము ఎదురు చూస్తామని అదానీ గ్రూపునకు చెందిన కొన్ని వర్గాలు తెలిపినట్టు నివేదికలు పేర్కొంటున్నాయి.

గౌతమ్ అదానీ యూఎస్ కష్టాలు

అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, ఇతర ఉన్నతాధికారులకు అమెరికా న్యాయ శాఖ లంచం కేసులో నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. 250 మిలియన్ డాలర్ల(సుమారు రూ. 2000 కోట్లు) లంచం ఇచ్చి భారత ప్రభుత్వ అధికారుల నుంచి సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, అదానీ గ్రూపు ఈ ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నది.

నా కుమార్తెను పోకిరీలు వేధించారు

(మొదటిపేజీ తరువాయి)

కలిసి వెళ్తానని నా కుమార్తె కోరడంతో సెక్యూరిటీ సాయంతో అక్కడకు పంపించా. ఆ సమయంలో కొందరు యువకులు వారిని వెంబడించి వేధించారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందిపైనా దురుసుగా ప్రవర్తించారు. గుజరాత్ పర్యటన నుంచి నేను ఇంటికి రాగానే మా అమ్మాయి ఈ విషయం చెప్పింది. ఓ ఎంపీ లేదా కేంద్ర మంత్రి కుమార్తెకే ఇటువంటి దుస్థితి ఎదురైతే.. సాధారణ మహిళల రిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశా" అని కేంద్ర మంత్రి ఖడ్సే మీడియాకు వెల్లడించారు.

మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి: మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే

ఇదే అంశంపై రక్షా ఖడ్సే మామ, మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే మాట్లాడుతూ.. "మహారాష్ట్రలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. నేరస్థులు పోలీసులకు భయపడటం లేదు. బాధిత అమ్మాయిలు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. వారి తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెల పేర్లు బయటకు రావద్దని భావిస్తున్నారు. ఇటీవల మా అమ్మాయిని వేధించిన యువకులపై గతంలోనూ పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. మాకు ప్రత్యామ్నాయం లేకనే ఫిర్యాదు చేశాం" అని అన్నారు. "పోలీస్ స్టేషన్‌కు వెళితే రెండు గంటలు మమ్మల్ని కూర్చోబెట్టారు. అమ్మాయిల విషయం కావడంతో పునరాలోచించుకోవాలని పోలీసులు మాకు చెప్పారు. యువకులు పోలీసులపైనా దాడి చేసిన సందర్భాలున్నాయి. వాళ్లు ఎంతగా తెగిస్తారో దీన్ని బట్టి ఊహించుకోవచ్చు. వీళ్లకు రాజకీయ నాయకుల అండ ఉంది. ఇదే విషయంలో డీఎస్పీ, ఐజీతోనూ మాట్లాడా" అని ఖడ్సే ఆవేదన వ్యక్తం చేశారు.

కఠిన చర్యలు తీసుకుంటాం: సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

ఈ ఘటనపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. నిందుతులు ఓ రాజకీయ పార్టీకి చెందినవాళ్లని, అందులో కొందర్ని పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తాజా పరిణామంపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్దన్ సప్కాల్ మాట్లాడుతూ.. మహాయుతి ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు.

హర్యానాలో ఘోరం

చండీగఢ్ : హర్యానాలో దారుణం చోటు చేసుకున్నది. ఒక బస్టాండ్ సమీపంలో సూట్‌కేస్ పడి ఉండటం కలకలం రేపింది. తెరిచి చూసిన పోలీసులు అందులో యువతి మృతదేహం ఉండటంతో షాకయ్యారు. మృతురాలిని కాంగ్రెస్ మహిళా కార్యకర్తగా గుర్తించారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఆమె పాల్గొన్నట్టు కాంగ్రెస్ నేతలు తెలిపారు. హర్యానాలోని రోహతక్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఇప్పుడిది తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం సాంప్లా బస్టాండ్ సమీపంలో బ్లూ కలర్‌లో ఉన్న పెద్ద ట్రావెల్ బ్యాగ్ పడి ఉంది. అనుమానించిన స్థానికులు పోలీసులకు సమాచారమి చ్చారు. పోలీసులు, ఫోరెన్సిక్ ల్యాబ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సూట్‌కేస్‌లోని యువతి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలిని 22 ఏండ్ల హిమానీ నర్వాల్‌గా గుర్తించారు. ఆమెను హత్య చేసి మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి బస్టాండ్ సమీపంలో పడేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మహిళ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు హతురాలు హిమానీ నర్వాల్ కాంగ్రెస్ కార్యకర్త అని ఆ పార్టీ ఎమ్మెల్యే భరత్ భూషణ్ బాత్రా తెలిపారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఆమె చురుకుగా పాల్గొన్నట్టు చెప్పారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల సమయంలో భూపిందర్ హుడా, దీపిందర్ హుడా ప్రచారంలో కూడా ఆమె పాల్గొన్నట్టు వెల్లడించారు. తన కుమార్తె రాజకీయంగా ఎదుగుతుండటం చూసి కొందరు సహించలేక ఆమెను హత్య చేసి ఉంటారని ఆమె తల్లి సవితా నర్వాల్ ఆరోపించింది.

జనం అడుక్కోవడానికి అలవాటుపడ్డారు

(మొదటిపేజీ తరువాయి)

పటేల్ వ్యాఖ్యలను ఖండించారు. ఆయన రాష్ట్ర ప్రజలను అవమానించారని అన్నారు. ప్రజలను భిక్షగాళ్లు అనే స్థాయికి బీజేపీ అహంకారం పెరిగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలు, ఆశలు, కన్నీళ్లను ఆయన అవమానించారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తే భిక్షగాళ్లంటూ అవమానిస్తారా అని అన్నారు. త్వరలో బీజేపీ నేతలే ఓట్లు అడుక్కుంటూ వస్తారనీ, అప్పుడు ప్రజలు గుణపాఠం చెప్పాలని అన్నారు.

42 పైసలు కాదు...చారణానే

(మొదటిపేజీ తరువాయి)

రూ.5 వేల కోట్లు పోను...మిగతా రూ.16 వేల కోట్ల కోసం ఎదురు చూస్తున్నామని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. మరి ఆ శాఖ ఆశలను కేంద్రం నెరవేరుస్తుందా? లేదా? అనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది.



బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టిందని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సాంకేతిక సమస్యలను పరిశీలించి నిపుణులను పిలిపించి ఇక్కడి సొరంగం పనులు ఎలా పూర్తి చేయాలో తెలుసుకున్నామన్నారు. కొన్ని విడిభాగాలను అమెరికా నుంచి తెప్పించి మొదలు పెట్టామని తెలిపారు. పనులు జరుగుతున్న క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఇంజనీర్లు, కార్మికులు ప్రమాదంలో ఇరుక్కోవడం దురదృష్టకరమన్నారు. తొమ్మిది రోజులుగా దేశ, విదేశాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రయివేటు ఏజెన్సీల నుంచి వచ్చిన నిపుణులను సైతం సొరంగంలో చిక్కుకున్న కార్మికులను కాపాడడానికి ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఆర్మీ నేవీ, హైడ్రా వంటి 11 సంస్థలు, 500 మంది నిపుణులు ఇక్కడ రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేయడం అభినందనీయమన్నారు. కూలిన మట్టి, నీటి ఊటను తొలగించడానికి ఉపయోగించే కన్వర్ బెల్ట్‌ను మరమ్మతు చేస్తే రెండు రోజుల్లో కార్మికులను వెలికితీసే అవకాశం ఉందని తెలిపారు. ప్రాథమికంగా మనుషులు ఉన్నారని గుర్తించినప్పటికీ నిర్ధారణ చేయలేమని, రెండు రోజులు గడిస్తే మొత్తం వివరాలు బయటకు వస్తాయని చెప్పారు. ఇలాంటి విపత్తు సమయంలో రాజకీయ పార్టీలకతీతంగా సహాయ సహకారాలు అందించాల్సింది పోయి బీఆర్ఎస్, బీజేపీలకు బురద జల్లడం పరిపాటిగా మారిందన్నారు. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగినప్పుడు ఏ ఒక్కరిని అక్కడికి వెళ్లనీయలేదని, ఇక్కడ జరిగిన ప్రమాదానికి ఏ పార్టీ వాళ్లు వచ్చినా అనుమతులు ఇవ్వలేదని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతి పొడవైన టన్నెల్‌లో అద్భుతంగా రెండువైపులా పనులు నిర్వహిస్తున్నామని, రాజకీయాలకతీతంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రాజెక్టు పనులు పూర్తి చేయడంతో పాటు ప్రమాదంలో చిక్కుకున్న కార్మిక కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇకనుంచి ప్రాజెక్టు ప్రమాదంలో కార్మికులు చనిపోకుండా రోబోలను సైతం ఉపయోగిస్తామని అన్నారు. సీఎం, మంత్రులు ప్రమాదం గురించి స్పందించడం లేదన్న ఆరోపణలు సరికాదని, ప్రమాదం జరిగిన గంటలోపే ఘటనా స్థలానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీ వచ్చి సహాయ సహకారాలు అందించడం రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ మల్లురవి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ ఉన్నారు.

ఈ పాపం కేసీఆర్‌దే

(మొదటిపేజీ తరువాయి)

ఆయన వనపర్తిలో 12 సంవత్సరాలపాటు అద్దెకు ఉన్న ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి యజమాని సీఎంకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి ఆ ఇంటితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తన పాఠశాల గురువులు, మిత్రులతో కలిసి సీఎం భోజనం చేశారు. వనపర్తి కేడీఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రుణమేళా, జాబ్ మేళా స్టాల్స్‌నూ పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వనపర్తిలో పుట్టి.. అచ్చంపేటలో పెరిగి.. చదువు, సంస్కృతి నేర్చుకొని, కొడంగల్ నుంచి రాజకీయంగా రాణిస్తున్న తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా రుణం తీర్చుకుంటానని అన్నారు. రాష్ట్రంలో వనపర్తికి ప్రత్యేక గుర్తింపు ఉందని, కానీ ఐదేండ్ల క్రితం వనపర్తిలో గెలిచిన ఎమ్మెల్యే రాజకీయాలను కలుషితం చేశారని తెలిపారు. పాలమూరు బిడ్డలకు పరిపాలించే శక్తి లేదా అని ప్రశ్నించారు. పాలమూరు వాళ్లది అమాయకత్వం కాదని, మంచితనమని, తిక్క రేగితే డొక్క చీల్చి డోలు కడతం జాగ్రత్త అని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదినది పాలమూరు బిడ్డ జిల్లెల చిన్నారెడ్డి అని చెప్పారు. వనపర్తిలో అనేక విద్యాసంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వాలే పునాది వేశాయన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే 25.50 లక్షల మంది రైతులకు రూ.22 వేల కోట్ల రుణమాఫీ జరిగిందా లేదా గుండెలపై చేయి వేసుకొని చెప్పాలని కోరారు. రూ.7625 కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 16 వేల మెగావాట్లకు పైగా పెరిగినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని తెలిపారు. 150 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేశారని, దాని కోసం ఆర్టీసీకి రూ.4500 కోట్లు చెల్లించామన్నారు. వనపర్తి సాక్షిగా ఈ రోజు రూ.1000 కోట్ల రుణాలను ఆడబిడ్డలకు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయన్నారు. స్వయం సహాయక సంఘాలను ఆదుకునే బాధ్యత తనదేనన్నారు. హైటెక్ సిటీ శిల్పారామం పక్కనే స్వయం సహాయక మహిళల కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థల పక్కనే మహిళా సంఘాలకు మూడున్నర ఎకరాల స్థలం ఇస్తారని ఎప్పుడైనా ఊహించారా.. అని మహిళలను ఉద్దేశించి సీఎం అన్నారు. 1000 బస్సులను స్వయం సహాయక మహిళలతో కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చేశామన్నారు. రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరుతో ఇస్తున్నామన్నారు. పదేండ్లలో నిరుద్యోగ యువతకు కేసీఆర్ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. కానీ ఆయన కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పడుకుని ప్రజల గురించి ఆలోచించలేదన్నారు. ఆయనే ప్రాజెక్టులు కడితే పాలమూరు ప్రజలు ఎందుకు వలస పోతున్నారని ప్రశ్నించారు. వలసలు పోతున్న పాలమూరు ప్రజల గురించి కేసీఆర్ ఏనాడైనా ఆలోచించారా అని నిలదీశారు. పదేండ్లలో పాలమూరు ఎత్తిపోతలతో పాటు బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు ఎందుకు పూర్తి చేయలేదని, ఆర్డీఎస్ ఎందుకు ఎండిపోయిందని కేసీఆర్ చెప్పాలని నిలదీశారు.

సైంధవుడిలా మారిన ఎంపీ కిషన్ రెడ్డి

నానా కష్టాలు పడి వరంగల్‌కు ఎయిర్ పోర్టు తీసుకువస్తే కిషన్ రెడ్డి తానే తీసుకువచ్చానని చెబుతున్నాడని, తెలంగాణ అభివృద్ధిపై ఇక్కడి బీజేపీ ఎంపీ కిషన్ రెడ్డి సైంధవుడిలా తయారయ్యారని సీఎం విమర్శించారు. మెట్రో విస్తరణ అనుమతులు, మూసీ నది ప్రక్షాళనకు నిధులు, రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపులు, కాళేశ్వరానికి నీటి కేటాయింపులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

తెలంగాణకు ఏదైనా వస్తే తన ఖాతాలో వేసుకుంటున్నారని, ఎన్నికల హామీ మేరకు 12 ఏండ్ల మోడీ పాలనలో 24 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. మోడీ తెలంగాణలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో కిషన్ రెడ్డి లెక్కపెట్టి చెప్పాలన్నారు. తెలంగాణలో మోడీ రెండు బోడి ఉద్యోగాలు ఇచ్చారని, అవి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మంత్రి పదవులని తెలిపారు. సికింద్రాబాద్‌లో వరదలు వచ్చి కొట్టుకుపోతే కేంద్రం చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదన్నారు. ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి హైదరాబాద్‌లో సమీక్షకు వస్తే గల్లీలో ఉన్న కిషన్ రెడ్డి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి కావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై అన్ని పార్టీల ఎంపీలతో భట్టి విక్రమార్క సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. అందరం కలిసి కేంద్రం దగ్గరకు వెళ్లి రాష్ట్రానికి కావాల్సిన నిధులు అడుగుదామని చెప్పారు. నిర్మలా సీతారామన్ తమిళనాడుకు మెట్రో తీసుకువెళ్లారని, కేంద్ర మంత్రి శోభా బెంగళూరుకి మెట్రో తీసుకెళ్లారని అన్నారు. సొంత రాష్ట్రం తెలంగాణకు కిషన్ రెడ్డి ఎందుకు మెట్రో తీసుకురావడం లేదని నిలదీశారు. తనకు భేషజాలు లేవని, తానే స్వయంగా కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి తెలంగాణ సమస్యలను వివరించానన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళన చేస్తే కేంద్రం వేల కోట్ల నిధులు ఇస్తోందని, మూసీ ప్రక్షాళనకు ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు. పాలమూరు అభివృద్ధికి ఎవరూ అడ్డుపడినా సహించబోనని హెచ్చరించారు. వనపర్తి నుంచే మంచి నాయకత్వం పుట్టుకొచ్చిందన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించలేకపోయిన సన్నాసి కేసీఆర్ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పదేండ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ ప్రజా సమస్యలను పరిష్కరించలేని సన్నాసి అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గడిని దాటి బయటికి రాలేని కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్.. తమ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రిని, మంత్రులను పాలన చేతకాని సన్నాసులు అంటూ సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడటం బాధాకరమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలను గ్రామాలకు వస్తే ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు ఆనాడు మీ పాలనలో ఎందుకు చేయలేదని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించాలని ప్రజలను కోరారు. రైతు భరోసా రెండో విడతను ఇప్పటికే ప్రారంభించామని, రూ.9,660 కోట్ల రైతు భరోసా నిధులను మార్చి 31 లోగా జమ చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు తర్వాత తమ కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్లకు రూ.6,000 కోట్లు కేటాయించిందన్నారు. సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ గ్రూపులకు ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలలోగా వాటిని పంపిణీ చేస్తామని, దీన్ని వనపర్తి నుంచే ప్రారంభిస్తామని తెలిపారు.

ఆసీస్ కాచుకో!

- భారత్ సెమీఫైనల్ ప్రత్యర్థి ఆస్ట్రేలియా
- న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం
- వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్ల మాయ

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2025



టీమ్ ఇండియా హ్యాట్రిక్ విజయం. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశలో వరుసగా మూడో విజయం సాధించిన భారత్ అజేయ రికార్డుతో సెమీఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం జరిగే సెమీస్‌లో అగ్రజట్టు ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత భారత్, ఆసీస్ తలపడనున్న మెగా మ్యాచ్ ఇదే.

నవతెలంగాణ-దుబాయ్

మన మాయగాడు వరుణ్ చక్రవర్తి (5/42) ఐదు వికెట్ల ప్రదర్శనతో తిప్పేశాడు. వరుణ్ చక్రవర్తి దెబ్బకు 250 పరుగుల ఛేదనలో న్యూజిలాండ్ 205 పరుగులకే కుప్పకూలింది. 44 పరుగులతో భారత్ ఘన విజయం సాధించింది. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశ ఆఖరు మ్యాచ్‌లో గెలుపొందిన టీమ్ ఇండియా.. గ్రూప్-ఏలో అగ్రస్థానం దక్కించుకుంది. దీంతో సెమీఫైనల్లో గ్రూప్-ఏలో రెండో స్థానంలో నిలిచిన ఆస్ట్రేలియాతో సెమీఫైనల్లో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. గ్రూప్-బి టాపర్ దక్షిణాఫ్రికాతో న్యూజిలాండ్ మరో సెమీఫైనల్లో ఢీకొట్టనుంది. ఛేదనలో కేన్ విలియమ్సన్ (81, 120 బంతుల్లో 7 ఫోర్లు) అర్థ సెంచరీతో పోరాడినా.. కివీస్‌కు పరాజయం తప్పలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 249 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (79, 98 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), హార్దిక్ పాండ్య (45, 45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు), అక్షర్ పటేల్ (42, 61 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ (5/42) సైతం ఐదు వికెట్ల ప్రదర్శన చేసినా.. వరుణ్ చక్రవర్తి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

వరుణ్ మాయజాలం :

250 పరుగుల ఛేదనలో కేన్ విలియమ్సన్ (81) అర్థ సెంచరీతో కదం తొక్కాడు. ఓ వైపు భారత బౌలర్ల వరుస వికెట్లతో ఒత్తిడి పెంచినా.. కేన్ విలియమ్సన్ కీవీస్‌ను రేసులోనే నిలిపాడు. యంగ్‌తో 32, మిచెల్‌తో 44, లేథమ్‌తో 40 పరుగుల భాగస్వామ్యాలు నిర్మించిన విలియమ్సన్ ఓ దశలోనూ భారత బౌలర్లను ఒత్తిడికి గురి చేశాడు. ఐదు ఫోర్లతో 77 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన విలియమ్సన్‌ను ఊరించిన అక్షర్ పటేల్.. స్టంపౌట్‌గా సాగనంపాడు. అప్పటికి కివీస్ స్కోరు 40.6 ఓవర్లలో 169 పరుగులు. విలియమ్సన్ నిష్క్రమణతో న్యూజిలాండ్ కథ ముగిసింది. ఆ తర్వాత మూడు వికెట్లను భారత్ అలవోకగా పడగొట్టింది. పవర్‌ప్లే తర్వాత మాయ మొదలెట్టిన వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లతో అదరగొట్టాడు. కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ సైతం మెప్పించారు. 45.3 ఓవర్లలో కివీస్ 205 పరుగులకు ఆలౌటైంది.

టాప్ ఆర్డర్ విఫలం :

టాస్ ఓడిన టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్‌కు వచ్చింది. గత రెండు మ్యాచుల్లో తొలుత ఫీల్డింగ్ చేసిన రోహిత్‌సేన ఆలోచన సైతం ప్రత్యర్థికి లక్ష్యం నిర్దేశించటమే. కానీ భారత టాప్ ఆర్డర్ దారుణంగా నిరాశపరిచింది. మంచి ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్ (2), రోహిత్ శర్మ (15) సహా విరాట్ కోహ్లి (11) ఏడు ఓవర్లలోపే పెవిలియన్‌కు చేరారు. కివీస్ పేసర్ల మెరుపులకు కండ్లుచెదిరే ఫీల్డింగ్ జతకలవటంతో 30 పరుగులే భారత్ 3 వికెట్లు కోల్పోయింది. భారత టాప్-3 బ్యాటర్లు ఈ స్థాయిలో నిరాశపరచటం ఇటీవల ఇదే ప్రథమం!.


శ్రేయస్ అయ్యర్ (79)

నిలబెట్టిన అయ్యర్, అక్షర్ :

కఠిన పరిస్థితుల్లో జతకట్టిన శ్రేయస్ అయ్యర్ (79), అక్షర్ పటేల్ (42) ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. న్యూజిలాండ్ పేస్, స్పిన్‌ను అలవోకగా ఎదుర్కొన్నారు. అయ్యర్, అక్షర్ సహజంగా దూకుడుగా ఆడతారు. కానీ పరిస్థితులకు అనుగుణంగా సమయోచిత ఇన్నింగ్స్‌లు ఆడిన ఈ జోడీ.. స్ట్రయిక్ రొటేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చింది. మూడో వికెట్‌కు 136 బంతుల్లో 98 పరుగులు జోడించింది. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్ ఫామ్ కొనసాగించాడు. నాలుగు ఫోర్లతో 75 బంతుల్లో బాధ్యతాయుత అర్థ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇన్నింగ్స్ గేర్ మార్చే ప్రయత్నంలో అయ్యర్, అక్షర్ వెనుదిరిగారు. అప్పటికి భారత్ స్కోరు 36.2 ఓవర్లలో 172/5.

ఆఖర్లో హార్దిక్ ధనాధన్ :

మిడిల్ ఆర్డర్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టగా.. లోయర్ ఆర్డర్‌లో హార్దిక్ పాండ్య (45) దంచికొట్టాడు. కెఎల్ రాహుల్ (23), రవీంద్ర జడేజా (16) మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. కానీ ఆఖరు వరకు నిలిచిన హార్దిక్ పాండ్య భారత్‌ను 250 పరుగులకు చేరువ చేశాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో మెరిసిన హార్దిక్.. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో నిష్క్రమించాడు. నిర్ణీత 50 ఓవర్లలో భారత్ 249 పరుగులు చేసింది. న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ (5/42) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. జెమీసన్, ఓరౌర్క్, రచిన్, శాంట్నర్‌లు తలా ఓ వికెట్ పడగొట్టారు.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) యంగ్ (బి) జెమీసన్ 15, శుభ్‌మన్ గిల్ (ఎల్బీ) హెన్రీ 2, విరాట్ కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11, శ్రేయస్ అయ్యర్ (సి) యంగ్ (బి) ఓరౌర్క్ 79, అక్షర్ పటేల్ (సి) విలియమ్సన్ (బి) రచిన్ 42, కెఎల్ రాహుల్ (సి) లేథమ్ (బి) శాంట్నర్ 23, హార్దిక్ పాండ్య (సి) రచిన్ (బి) హెన్రీ 45, రవీంద్ర జడేజా (సి) విలియమ్సన్ (బి) హెన్రీ 16, మహ్మద్ షమి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 5, కుల్దీప్ యాదవ్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 10, **మొత్తం : (50 ఓవర్లలో 9 వికెట్లకు) 249.**

వికెట్ల పతనం : 1-15, 2-22, 3-30, 4-128, 5-172, 6-182, 7-223, 8-246, 9-249.

బౌలింగ్ : మాట్ హెన్రీ 8-0-42-5, కైల్ జెమీసన్ 8-0-31-1, విల్ ఓరౌర్క్ 9-0-47-1, మిచెల్ శాంట్నర్ 0-1-41-1, మైకల్ బ్రాస్‌వెల్ 9-0-56-0, రచిన్ రవీంద్ర 6-0-31-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : విల్ యంగ్ (బి) వరుణ్ 22, రచిన్ రవీంద్ర (సి) అక్షర్ (బి) హార్దిక్ 6, కేన్ విలియమ్సన్ (స్టంప్డ్) రాహుల్ (బి) అక్షర్ 81, డార్లీ మిచెల్ (ఎల్బీ) కుల్దీప్ యాదవ్ 17, టామ్ లేథమ్ (ఎల్బీ) జడేజా 14, గ్లెన్ ఫిలిప్స్ (ఎల్బీ) వరుణ్ 12, మైకల్ బ్రాస్‌వెల్ (ఎల్బీ) వరుణ్ 2, మిచెల్ శాంట్నర్ (బి) వరుణ్ 28, మాట్ హెన్రీ (సి) కోహ్లి (బి) వరుణ్ 2, కైల్ జెమీసన్ నాటౌట్ 9, విల్ ఓరౌర్క్ (బి) కుల్దీప్ యాదవ్ 1, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (45.3 ఓవర్లలో ఆలౌట్) 205.**

వికెట్ల పతనం : 1-17, 2-49, 3-93, 4-133, 5-151, 6-159, 7-169, 8-195, 9-196, 10-205.

బౌలింగ్ : మహ్మద్ షమి 4-0-15-0, హార్దిక్ పాండ్య 4-0-22-1, అక్షర్ పటేల్ 10-0-32-1, వరుణ్ చక్రవర్తి 10-0-42-5, కుల్దీప్ యాదవ్ 9.3-0-56-2, రవీంద్ర జడేజా 8-0-36-1.

భారత్, ఆసీస్ ఢీ

దక్షిణాఫ్రికాతో కివీస్ పోరు

దుబాయ్ : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో ఎవరు ఎవరితో తలపడేది తేలిపోయింది. గ్రూప్-ఏలో భారత్, న్యూజిలాండ్ మ్యాచ్ ఫలితంతో సెమీఫైనల్ ప్రత్యర్థులపై స్పష్టత వచ్చింది. గ్రూప్-ఏలో హ్యాట్రిక్ విజయాలు సాధించిన భారత్ మంగళవారం తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. గ్రూప్-ఏలో రెండో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్ రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికాను ఎదుర్కోనుంది. భారత్, ఆసీస్ సెమీస్ దుబాయ్‌లో జరుగనుండగా.. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ సెమీఫైనల్ లాహోర్‌లో జరుగనుంది.


భారత టీమ్ మేనేజర్ ఆర్. దేవరాజ్

భారత టీమ్ మేనేజర్‌కు మాతృ వియోగం

దుబాయ్ నుంచి స్వదేశానికి పయనం

హైదరాబాద్ : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు టీమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న ఆర్. దేవరాజ్ కుటుంబంలో విషాదం నెలకొంది. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కార్యదర్శిగా కొనసాగుతున్న దేవరాజ్ తల్లి కమలేశ్వరి రామచందర్ ఆదివారం ఉదయం మెట్టుగూడలోని నివాసంలో మరణించారు. దేవరాజ్ తల్లి మృతి పట్ల హెచ్‌సీఏ సంతాపం వ్యక్తం చేసింది. దుబాయ్‌లో భారత క్రికెట్ జట్టుతో పాటు ఉన్న దేవరాజ్ స్వదేశానికి బయల్దేరారు. మంగళవారం భారత జట్టు సెమీఫైనల్ ఆడనుంది. సెమీస్ ఫలితం ఆధారంగా దేవరాజ్ తిరిగి దుబాయ్‌లో టీమ్ మేనేజర్ బాధ్యతలు చేపట్టేది, లేనిది తెలియనుంది. సోమవారం ఉదయం బన్సీలాల్ పేటలో కమలేశ్వరి రామచందర్ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.


రంజీ ట్రోఫీ టైటిల్‌తో విదర్భ ఆటగాళ్లు, బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్ని

రంజీ చాంప్ విదర్భ

ఫైనల్లో కేరళకు తప్పని నిరాశ

నాగ్‌పూర్ (మహారాష్ట్ర) : రంజీ ట్రోఫీ విదర్భ సొంతమైంది. ఐదురోజుల పాటు ఉత్కంఠగా సాగిన టైటిల్ పోరులో తొలిసారి ఫైనలిస్ట్ కేరళపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం (37 పరుగులు) సాధించిన విదర్భ చాంపియన్‌గా అవతరించింది. గతంలో వరుసగా రెండు సీజన్లలో విజేతగా నిలిచిన విదర్భకు ఇది ఓవరాల్‌గా మూడో రంజీ ట్రోఫీ టైటిల్. విదర్భ బ్యాటర్ డానిశ్ మలేవార్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా, విదర్భ పేసర్ హర్ష్ దూబె 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. ఇదిలా ఉండగా రంజీ ట్రోఫీ ఫైనల్ డ్రాగా ముగిసింది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 379 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 375/9 పరుగులు చేసింది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులే చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్ విదర్భను వరించింది. రంజీ చాంపియన్ విదర్భ రూ. 5 కోట్లు, రన్నరప్ కేరళ రూ.3 కోట్ల నగదు బహుమతి దక్కించుకున్నాయి.

కరుణ్ నాయర్ (135, 295 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సులు) శతకంతో చెలరేగాడు. డానిశ్ మలేవార్ (73, 162 బంతుల్లో 5 ఫోర్లు) తొలి ఇన్నింగ్స్ శతక జోరు కొనసాగించాడు. లోయర్ ఆర్డర్‌లో దర్శన్ నల్కండె (51 నాటౌట్, 98 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్థ సెంచరీతో కదం తొక్కాడు. అక్షయ్ కర్నేవార్ (30), అక్షయ్ వాడ్కర్ (25), యశ్ రాథోడ్ (24) రాణించారు. విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 143.5 ఓవర్లలో 9 వికెట్లకు 375 పరుగులు చేసింది. కేరళ బౌలర్లలో ఆదిత్య (4/96) నాలుగు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్ ఖాయం కాగా.. విదర్భ ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చే ఆలోచన చేయలేదు. ఐదు సెషన్ల పాటు కేరళ బౌలింగ్, ఫీల్డింగ్‌తో నీరసించింది. సెమీఫైనల్లో గుజరాత్‌పై 2 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఫైనల్‌కు చేరుకున్న కేరళ.. అంతిమ సమరంలో అదే తొలి ఇన్నింగ్స్ లోటుతో భంగపాటుకు గురైంది.

ప్రజ్ఞానంద ముందంజ

ప్రేగ్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్

ప్రేగ్ (చెక్ రిపబ్లిక్) : 2025 ప్రేగ్ చెస్ ఫెస్టివల్ మాస్టర్స్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద రమేశ్‌బాబు, అరవింద్ చితంబరం ముందంజలో కొనసాగుతున్నారు. నాలుగు రౌండ్ల పోటీల అనంతరం ప్రజ్ఞానంద, అరవింద్‌లు మూడేసి పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. నాల్గో రౌండ్లో జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌పై ప్రజ్ఞానంద విజయం సాధించారు. అమెరికా గ్రాండ్‌మాస్టర్ శామ్ శాంక్లాండ్‌తో గేమ్‌లో తొలుత అరవింద్ ఇబ్బందిలో పడినా.. చివరకు గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. టాప్ సీడ్ చైనా గ్రాండ్‌మాస్టర్ వీ యి ఎట్టకేలకు ఓ విజయం సాధించాడు. చెక్ రిపబ్లిక్ జీఎం డెవిడ్ నవారాపై విజయంతో గెలుపు బాట పట్టాడు. ఐదో రౌండ్లో ప్రజ్ఞానంద, అరవింద్ ముఖాముఖి పోటీలో ఎత్తులకు పైఎత్తులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మరో ఐదు రౌండ్ల పోటీలు ఉండటంతో ఆధిక్యం నిలుపుకోవటం భారత గ్రాండ్‌మాస్టర్స్‌కు సవాల్‌గా మారింది.


భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద


మేఘా చౌదరి, త్రిగుణ్

లాకర్ చుట్టూ తిరిగే కథ..

త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా మల్లి యేలూరి దర్శకత్వం వహిస్తున్న కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. ఈ చిత్రాన్ని డా. వై.జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే సాంగ్స్‌కి వచ్చిన ట్రెమండస్ రెస్పాన్స్‌తో సినిమా మ్యూజికల్ హిట్ అయ్యింది.

తాజాగా మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. త్రిగుణ్‌ని లాకర్ ఎక్స్‌పర్ట్‌గా పరిచయం చేస్తూ మొదలైన ట్రైలర్ కామెడీ, సస్పెన్స్ థ్రిల్‌తో మెస్మరైజ్ చేసింది. త్రిగుణ్, మేఘా చౌదరి ప్రేమకథ లవ్లీగా ఉంది. షియజి షిండే, పోసాని కృష్ణమురళి, రఘుబాబు, పృథ్వీ రాజ్, మధు నందన్, ముక్కు అవినాశ్ పాత్రలు కామెడీతో గిలిగింతలు పెట్టారు.

మల్లి యేలూరి కథని చాలా ఎంగేజింగ్‌గా చెప్పారని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. లాకర్ చుట్టూ వచ్చే సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. టాప్ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మాతలు సినిమా నిర్మించారు. ట్రైలర్ సినిమాపై చాలా క్యురియాసిటీని పెంచింది. ఈనెల 7న సినిమా ప్రేక్షకులు ముందుకు వస్తోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి స్టోరీ- స్క్రీన్ ప్లే: నాగార్జున అల్లం, డిఓపీ : వాసు, డైలాగ్స్: రమేశ్ చెప్పాల, నాగార్జున అల్లం, మ్యూజిక్ డైరెక్టర్: ఆనంద్ మంత్ర, ఎడిటింగ్ : కోటగిరి వెంకటేశ్వరరావు, డ్యాన్స్: చంద్ర కిరణ్, ఫైట్స్ : డ్రాగన్ ప్రకాష్, మల్లి, లిరిక్స్ : భాస్కర భట్ల, ఆనంద్ మంత్ర.

అడవి నేపథ్యంలో సాగే అద్భుతమైన లవ్‌స్టోరీ

'కలర్ ఫోటో' డైరెక్టర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్న కొత్త సినిమా 'మోగ్లీ 2025'. ఈ సినిమాతో ఆయన మరో ఎమోషనల్, పవర్‌ఫుల్ నెరేటివ్‌ని తెరపైకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు. 'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల ఇందులో పవర్ ఫుల్ లీడ్‌రోల్‌ని పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫారెస్ట్ నేపథ్యంలో జరిగే అద్భుతమైన ప్రేమకథగా ఉండనుంది. సాక్షి సాగర్ మడోల్కర్ ఈ సినిమాతో కథానాయికగా పరిచయం అవుతోంది.

ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ 20 రోజుల క్రూషియల్ షెడ్యూల్‌ని పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లో రంపచోడవరం, మారేడుమిల్లి ఫారెస్ట్‌లో రెండు మ్యాసివ్ యాక్షన్ బ్లాక్‌లను షూట్ చేశారు. సినిమాలో ఈ యాక్షన్ సీక్వెన్స్‌లు హైలెట్‌గా ఉండబోతున్నాయి. ఈ సంవత్సరం చివర్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: సందీప్ రాజ్, నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, సహ నిర్మాత: వివేక్ కూచిబొట్ల, సంగీతం: కాల భైరవ, డిఓపి: రామ మారుతి ఎం, ఎడిటర్: కోదాటి పవన్ కళ్యాణ్, ఆర్ట్: కిరణ్ మామిడి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : సుజిత్ కుమార్ కొల్లి, చీఫ్ కోఆర్డినేటర్: మేఘస్యం, యాక్షన్: నటరాజ్ మాడిగొండ, సహ రచయితలు: రామ మారుతి. ఎం, రాధాకృష్ణ రెడ్డి.


రోషన్ కనకాల


ఆంటోనీ వర్గీస్ (పెపే)

యాక్షన్ థ్రిల్లర్‌గా 'కాట్టలన్'

పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'మార్కో' విజయం తర్వాత క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షెరీఫ్ మొహమ్మద్ నిర్మించిన కొత్త సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఆంటోనీ వర్గీస్ (పెపే) నటించిన ఈ చిత్రం వైలెన్స్‌తో నిండిన మరో ఇంటెన్స్ థ్రిల్లర్ అని పోస్టర్ చెప్పకనే చెప్పింది. ఈ చిత్రానికి పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు.

క్యూబ్స్ ఎంటర్టైన్మెంట్స్ తన మొదటి సినిమాతోనే కంటెంట్ డెలివరీ, మార్కెటింగ్‌లో ఒక బెంచ్‌మార్క్‌ను నెలకొల్పడంతో పాటు, తన మునుపటి చిత్రాల ద్వారా పెద్ద సంఖ్యలో అభిమానులను గెలుచుకున్న పెపే మరోసారి కలిసి పనిచేయడంతో, ఈ హ్యూజ్ పాన్-ఇండియా సినిమా కోసం అందరూ ఎదురుచూసేలా చేస్తోంది.

నవచిత్రం

ఒక రోజు ముందుగానే వస్తున్నాం



బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా రూపొందిన 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం ఈనెల 29 శనివారం విడుదల కావాల్సి ఉండగా, డిస్ట్రిబ్యూటర్ల కోరిక మేరకు ఒక రోజు ముందుగా అంటే ఈనెల 28 శుక్రవారం విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు.

ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ స్పందిస్తూ, "మా పంపిణీదారుల అభ్యర్థన, మద్దతుతో ఈ చిత్రం ఒక రోజు ముందుగా ఈనెల 28వ తేదీన వస్తుంది. చివరి నిమిషంలో విడుదల తేదీ మార్చాలనే ఉద్దేశం ఎప్పుడూ లేదు. ఆనెల 29న అమావాస్య కావడంతో మా పంపిణీదారులు విడుదలను మార్చటం ఉత్తమమని అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం పట్ల మేము కూడా సంతోషంగా ఉన్నాం. మా సినిమాతో పాటు ఈనెల 28న విడుదల కానున్న 'రాబిన్‌హుడ్' చితం కూడా ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ వేసవికి నవ్వుల పండుగ రాబోతుంది' అని అన్నారు.

శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు.

మ్యాడ్ సినిమాలో తనదైన ప్రత్యేక శైలి హాస్య సన్నివేశాలు, ఆకర్షణీయమైన కథనంతో ఎంతో పేరు తెచ్చుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్ ఈ సీక్వెల్‌తో మరోసారి నవ్వుల విందుని అందించబోతున్నారు.

మొదటి భాగంలో తమ అల్లరితో నవ్వులు పూయించిన నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ మరియు విష్ణు ఓఐ (లడ్డు) ఈ సినిమాలో అంతకుమించిన అల్లరి చేయబోతున్నారు. రెబా జాన్ ప్రత్యేక గీతంలో సందడి చేయనున్నారు. కె.వి.అనుదీప్, ప్రియాంక జవాల్కర్ తదితరులు కీలక పాత్రలలో అలరించనున్నారు. 'మ్యాడ్ స్క్వేర్' చిత్రానికి సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. ఛాయగ్రాహకుడు శామ్‌దత్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

కృష్ణవేణిది ఓ సువర్ణాధ్యాయం



నటిగా, నిర్మాతగా, నేపథ్య గాయనిగా, శోభనచల స్టూడియో అధినేతగా కృష్ణవేణిది తెలుగు చిత్ర సీమలో ఓ సువర్ణ అధ్యాయం' అని అని భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు.

ఆదివారం జరిగిన కృష్ణవేణి సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ, 'కృష్ణవేణి విలక్షణమైన నటి. 1949లో ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో నిర్మించిన 'మనదేశం' చిత్రంతో ఎన్టీఆర్‌ను పరిచయం చేసిన ఘనత ఆమెదే. అలాగే ఏఎన్నార్‌కి 'కీలుగుఱ్ఱం'తో స్టార్ స్టేటస్ తీసుకొచ్చింది కూడా మీర్జాపురం రాజా, కృష్ణవేణి దంపతులే. 'మనదేశం' వజ్రోత్సవ వేడుకలు విజయవాడలో జరిగినప్పుడు ఆమెను సత్కరించే అవకాశం నాకు దక్కటం ఆనందంగా ఉంది. 102 సంవత్సరాల పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి ఎందరో నటీనటులకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచారు. ఆమె జీవితంపై సీనియర్ జర్నలిస్ట్ భగీరథ అద్భుతమైన షార్ట్ ఫిల్మ్‌ని రూపొందించడం అభినందనీయం' అని అన్నారు.


'మీర్జాపురం రాజా, కృష్ణవేణి అంటే మా కుటుంబానికి ఎంతో అభిమానం. మా నాన్న ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో ఎన్టీఆర్‌ను సినిమా రంగానికి వీరిద్దరే పరిచయం చేయటం అదొక చరిత్ర' అని అక్కినేని రమేష్ ప్రసాద్ చెప్పారు. ఎన్.టి.ఆర్. కమిటీ చైర్మన్ టి.డి.జనార్థన్, నందమూరి మోహనకృష్ణ, రామకృష్ణ, మురళీమోహన్, పరుచూరి గోపాలకృష్ణ, నిర్మాతలు కె.ఎస్.రామారావు, కైకాలనాగేశ్వరరావు, తుమ్మల ప్రసన్న కుమార్, కాట్రగడ్డ ప్రసాద్, రోజా రమణి, పూర్ణ విశ్వనాథ్, గుమ్మడి గోపాలకృష్ణ, అక్కినేని వెంకట్, అక్కినేని నాగసుశీల తదితరులు కృష్ణవేణికి ఘన నివాళి అర్పించారు. కృష్ణవేణి ముని మనవరాలు సాయిప్రియ జాస్తి వందన సమర్పణ చేశారు.

కొత్త దర్శకుడితో 'కొక్కొరోకో'

కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు దర్శక, నిర్మాత రమేష్ వర్మ ఆర్‌వి ఫిల్మ్ హౌస్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలి ప్రాజెక్ట్‌ను శ్రీనివాస్ వసంతల అనే ఓ నూతన దర్శకుడితో చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'కొక్కొరోకో' అనే టైటిల్‌ని ఖరారు చేశారు.

సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ సోదరుడు సాగర్ ఈ చిత్రానికి రైటర్‌గా పని చేస్తున్నారు. దీనికి కథ, స్క్రీన్‌ప్లే రమేష్ వర్మ అందిస్తున్నారు. అద్భుతమైన విజువల్స్, భావోద్వేగాలను చూపించే స్క్రీన్‌ప్లేతో ఈ సినిమా సరికొత్తగా ఉండనుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని రేఖ వర్మ కూరపాటి శిరీష నిర్మిస్తుండగా, నీల్లాద్రి సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది.


రమేష్ వర్మ



ఊటీలో తొలి షెడ్యూల్..

సోనుది ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్ జంటగా నటిస్తున్న చిత్రం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. సంగీత దర్శకుడు ఆర్ పి పట్నాయక్ క్లాప్ కొట్టగా, తొలి షాట్‌ను దేవుని పటాలపై చిత్రీకరించారు. దర్శకులు వీరశంకర్, నవీన్ ఎర్నేని, తనికెళ్ల భరణి చిత్ర దర్శక ద్వయం కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్యలకు స్క్రిప్ట్‌ను అందించారు. ప్రొడ్యూసర్ ప్రసన్న కుమార్, వంశీ కెమెరా స్విచ్చాన్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత ఆర్ యు రెడ్డి మాట్లాడుతూ,'నూతన దర్శకులతో మంచి కథతో ఈ సినిమా చేస్తున్నాం. ఈనెల 6 నుండి తొలి షెడ్యూల్‌ను ఊటీలో ప్రారంభిస్తున్నాం. రెండో షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్లాన్ చేశాం. మా సోనుది నుండి ఏడాదికి కొన్ని సినిమాలు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. సమాజం మాకు అండగా ఉండి, ఎంతో ఇచ్చింది. మా వంతుగా మేము కూడా సమాజానికి మేలు చేసే మంచి సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాం.

'మా టాలెంట్‌ను నిరూపించుకునే అవకాశం కల్పించిన నిర్మాత ఆర్ యు రెడ్డికి కృతజ్ఞతలు. సినిమాను గొప్పగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం' అని దర్శకులు కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్య అన్నారు. ఈ కార్యక్రమంలో బిగ్ బాస్ ఫేమ్ శుభశ్రీ, సంధ్య జనక్, కెమెరా మెన్ జోషి తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.